

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే. ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 6.00





# నీట్-2020లో మంచి ర్యాంకే మీ లక్ష్యమైతే...
# ఈసారి శ్రీగాయత్రిలో ప్రయత్నించండి.

ఈ విజేతలంతా నీట్-2019 కోసం శ్రీగాయత్రిలో ప్రయత్నించారు, సక్సెస్ అయ్యారు




## Success path followed in Srigayatri...
## Successfully entering in Medical Colleges

Students assured a seat in MBBS, BDS

**288**

Above Students

**NEET-2019 All India Ranks**

| | | | | |
|---|---|---|---|---|
| 160 | 268 | 285 | 310 | 310 |
| 365 | 378 | 387 | 473 | 634 |
| 661 | 687 | 716 | 894 | 937 |
| 990 | 1176 | 1195 | 1196 | 1245 |
| 1306 | 1392 | 1471 | 1509 | 1722 |
| 1954 | 1983 | 1997 | | |

And many more

All categories

## MEDICAL PROGRAMME HIGHLIGHTS

- Special coaching for Organic chemistry, physical chemistry, physics in the competitive exams where whatever your level of understanding, you can aim for excellence.
- A tradition of years of excellence with a carefully designed program which gives students an ability to crack the competitive exams under the expert guidance of our trained faculty.
- In depth teaching of concepts in Biology, diagram based, solving all NCERT books exemplar questions.
- Under our expert counselling, students can confidently face the competitive exams and reduce their fears making them more self confident
- An approach to completely understand and cover the syllabus where doubts and any confusion are immediately resolved.
- Academic rigour & constant evaluation trains our students to face the exams as confidently as possible.

## Fee Concession

| NEET'19 Marks | Concession | NEET'19 Marks | Concession |
|---|---|---|---|
| >465 | 90% | 410 - 419 | 40% |
| 450 - 464 | 75% | 400 - 409 | 30% |
| 435 - 449 | 60% | 375 - 399 | 15% |
| 420 - 434 | 50% | | |

# SRIGAYATRI
# MEDICAL ACADEMY

www.srigayatri.com / Cell: 9581991018/1019

Long Term Coaching Centres

Miyapur Ph:7660013454 / 55 /58 / 59 Madhapur Ph:9581991286/1267

• Hyderabad • Vijayawada • Vizag • Guntur • Kurnool • Kadapa • Tirupati • Karimnagar

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం  వెల: ₹ 6.00  సంపుటి: 12 సంచిక: 85

SUNDAY Special  ఆదివారం 16-6-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

## నాన్నా! నేనున్నాను



చంద్రబోస్‌తో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

– ఫ్యామిలీలో

## 'సప్త' సమరానికి సై...



మాంచెస్టర్ వేదికగా నేడు భారత్, పాకిస్తాన్ పోరు

– స్పోర్ట్స్‌లో

## న్యూస్‌రీల్

### సీఎం ఆసుపత్రికి రావాలి



బెంగాల్‌లో వైద్యులు, జూనియర్ డాక్టర్ల ఆందోళన ఐదో రోజుకు చేరుకుంది. వారిని బుజ్జగించేందుకు సీఎం మమతా బెనర్జీ చర్చల కోసం సచివాలయానికి ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రే స్వయంగా కోల్‌కతాలోని నీల్‌రతన్ సిర్కర్ (ఎన్‌ఆర్‌ఎస్) వైద్యకళాశాలకు రావాలని వైద్యులు కోరారు.

- వివరాలు 5లో

### అమెరికా వస్తువులపై పన్ను పెంపు



అమెరికా నుంచి దిగుమతయ్యే కొన్ని వస్తువులపై భారత్ భారీగా పన్నులు పెంచింది. భారత్ నుంచి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై ఇటీవల అమెరికా ప్రభుత్వం పన్నులు పెంచిన విషయం తెలిసిందే. ఆదివారం నుంచే ఈ పెంపు అమల్లోకి రానుంది.

- వివరాలు 5లో

### ఫించ్ ఫటాఫట్

కెప్టెన్ ఫించ్ అద్భుత సెంచరీ.. శ్రీలంకతో జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌లో 87 పరుగులతో నెగ్గిన ఆస్ట్రేలియా. – స్పోర్ట్స్‌లో

ఢిల్లీలో శనివారం జరిగిన నీతి ఆయోగ్ ఐదవ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా




# లక్ష్యం.. 5 ట్రిలియన్లు

## ఆ మేరకు ఆర్థిక వ్యవస్థను మార్చేందుకు కృషి చేద్దాం: మోదీ

"2019 మార్చి చివరికి దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 2.75 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. 2024 కల్లా దీనిని 5ట్రిలియన్ డాలర్ల స్థాయికి మార్చడం కష్టమైనప్పటికీ సాధించగలిగిన లక్ష్యమే. జీడీపీని జిల్లా స్థాయి నుంచే పెంచేందుకు రాష్ట్రాలు తమ శక్తియుక్తులను ఉపయోగించాలి. దీంతోపాటు దేశీయ ఎగుమతులు భారీగా పెరగాల్సి ఉంది. దేశంలో కొన్ని ప్రాంతాల్లోని కరువును ఎదుర్కొనేందుకు ప్రతి నీటి బొట్టుకు మరింత ఫలసాయం (పర్ డ్రాప్, మోర్ క్రాప్) విధానాన్ని అభివృద్ధి చేయాలి. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం చేపలపెంపకం, పశుపోషణ, ఉద్యానపంటలు, పూలు, కూరగాయల సాగు రైతులు చేపట్టేలా ప్రోత్సహించాలి.

- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోదీ

- 5లో

# టీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం

## కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- కేసీఆర్ కుటుంబ పాలనను ఎదుర్కోవడం కమలానికే సాధ్యం
- కనుచూపు మేరలో మరో పార్టీ కనిపించట్లేదు
- కాంగ్రెస్ దుస్థితికి నాయకత్వ వైఫల్యమే కారణం
- 12 మంది ఎమ్మెల్యేలను పార్టీ మారకుండా కాపాడుకోలేకపోయారు
- కుంతియా, ఉత్తమ్ పార్టీని సమన్వయపరచలేకపోయారు
- బీజేపీలో చేరాలని ఇంకా నిర్ణయం తీసుకోలేదు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితిపై ఆ పార్టీ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఘోరంగా తయారైందని, పార్టీ అధిష్టానం తప్పుడు నిర్ణయాల వల్లే ఈ దుస్థితి తలెత్తిందని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇప్పట్లో కోలుకొనే అవకాశం కనిపించడం లేదని, అది మునిగిపోయే పడవని వ్యాఖ్యానించారు. తెలంగాణలో టీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ కుటుంబ నియంతృత్వ ధోరణులను అడ్డుకోవాలంటే ప్రత్యామ్నాయంగా బీజేపీ తప్ప మరొక పార్టీ కనుచూపు మేరలో

మిగతా 2వ పేజీలో ▶

## కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి వ్యాఖ్యల కలకలం 2లో

# ఆ మూడు చట్టాలు సవరిస్తేనే..

కంక్లూజివ్ టైటిల్ ఇవ్వాలంటే రిజిస్ట్రేషన్ చట్టాలను సవరించాల్సిందే

కొత్తగా అమల్లోకి టైటిల్ రిజిస్ట్రేషన్ చట్టం... ఇప్పటికే ముసాయిదా సిద్ధం

రెవెన్యూ, వ్యవసాయ, రిజిస్ట్రేషన్ శాఖలకు తోడు టైటిల్ శాఖ ఏర్పాటు తప్పనిసరి

టైటిల్ రిజిస్టర్ ఆ శాఖ దగ్గరే... సివిల్ కోర్టుతో పాటు అధికారం కట్టబెట్టాల్సిందే

### కేంద్రం ఓకే అంటేనే..

భూములకు కంక్లూజివ్ టైటిల్ ఇవ్వాలంటే ఇప్పుడున్న చట్టాలకు సవరణ చేయాల్సి వస్తోంది. అయితే, ఈ రిజిస్ట్రేషన్ చట్టాలు కేంద్రప్రభుత్వం రూపొందించినవి కనుక వీటిని సవరించాలంటే కేంద్రం అనుమతి తప్పనిసరి.

### కొత్త చట్టం..

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కేవలం సివిల్ కోర్టులకు కంక్లూజివ్ టైటిల్‌ను నిర్ధారించే అధికారం ఉంది. ఈ అధికారాన్ని టైటిల్ శాఖకు కూడా కట్టబెడుతూ కొత్త చట్టాన్ని తయారు చేయాల్సి ఉంటుంది.

### కొత్త శాఖ..

రెవెన్యూ, వ్యవసాయ, రిజిస్ట్రేషన్ల శాఖలతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారం కొలిక్కి రావాలంటే మరో ప్రత్యేక శాఖ అవసరమవుతుంది. కంక్లూజివ్ టైటిల్‌కు సంబంధించిన రికార్డులు ఒకే ఏజెన్సీ లేదా శాఖ ద్వారా నిర్వహించాల్సి ఉంటుంది.

- వివరాలు 14లో

# 18న ఐఆర్ ప్రకటన!

- చెల్లింపు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వ పరిశీలన
- కేబినెట్ భేటీ తర్వాత ప్రకటించే అవకాశం
- ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆశలు
- ఒక శాతం ఐఆర్‌పై ఏటా రూ.300 కోట్ల భారం
- ప్రస్తుతానికి ఫిట్‌మెంట్ ప్రకటన లేనట్లే!

❖ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 18న జరగనున్న కేబినెట్ భేటీ అనంతరం ఐఆర్‌పై ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలా లేక పీఆర్సీనా? అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

❖ ఏపీలో 27 శాతం ఐఆర్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో అంతకుమించి ప్రకటించవచ్చని ఉద్యోగ వర్గాలు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

❖ అలాగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో రిటైర్మెంట్ వయసు పెంపు ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.



- వివరాలు 4లో











సికింద్రాబాద్ టు నాగ్‌పూర్...

## సెమీ హైస్పీడ్ కారిడార్‌కు ఓకే!

- త్వరలో నివేదిక సమర్పించనున్న రష్యన్ రైల్వేస్
- ఈ కారిడార్‌లో గంటకు 180 కి.మీ. వేగం సాధ్యమేనన్న ఇంజనీర్లు
- ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధమన్న రష్యా
- కిర్గిస్తాన్‌లో మోదీ–పుతిన్ చర్చల్లో ప్రస్తావన
- కారిడార్ సిద్ధమైతే సగానికి తగ్గనున్న ప్రయాణ సమయం
- 584 కి.మీ. దూరం దాదాపు 4 గంటల్లోనే చేరే అవకాశం

- వివరాలు 13లో



## ఇంటి కంటే రెస్టారెంట్ పదిలం

- భారతీయ కుటుంబాలు నెలకి చేస్తున్న సగటు ఖర్చు రూ.2,500 కోట్లు
- నార్త్ ఇండియన్ ఫుడ్‌పైనే ఎక్కువ మందికి మోజు
- దక్షిణ భారతంలో మాంసాహారానికే ఓటు..

- వివరాలు 5లో







షాజహాన్ భార్య ముంతాజ్ మహల్ 1631లో జూన్ 17న మరణించింది.



# నాన్నను బతికించుకోవాలి..



తండ్రికి పెద్ద కష్టం వచ్చిపడింది. ఆ సమస్యకు పరిష్కారం చెప్పారు వైద్యులు. అదేంటంటే కొడుకు కడుపు నిండా తింటే సరిపోతుందట. తండ్రికి కష్టం వస్తే కొడుకు తినడమేంటనే కదా మీ ప్రశ్న. చైనాలోని హెనాన్ ప్రావిన్స్ జిన్‌జియాంగ్ పట్టణానికి చెందిన లూ జికువాన్‌కు 11 ఏళ్లు. అబ్బాయి తండ్రికి ఏడేళ్ల కింద ల్యుకేమియా వ్యాధి వచ్చింది. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. కానీ ఇటీవలే ఆరోగ్యం మరింత క్షీణిస్తూ వచ్చింది. వేరే వారి ఎముక మజ్జ ఆ తండ్రికి ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే బతుకుతాడని వైద్యులు చెప్పారు. అయితే తెలుసు కదా.. ఎముక మజ్జ సరిపోలడం అంత సులువు కాదు. దాతలు కూడా దొరకరు. కానీ అదృష్టం కొద్దీ జికువాన్ ఎముక మజ్జ ఆ తండ్రికి సరిపోతుందట. అయితే జికువాన్ ఏమో చిన్న వాడు. బరువు కూడా 30 కిలోలే ఉన్నాడట. అంత తక్కువ బరువు ఉంటే శస్త్రచికిత్స చేయలేమని డాక్టర్లు చెప్పారట. కనీసం 15 కిలోల బరువైనా పెరగాలని చెప్పడంతో మనోడు రోజుకు ఐదు కంటే ఎక్కువసార్లు అది కూడా ఎంత తినగలిగితే అంత ఆహారం తీసుకుంటున్నాడు. బరువు పెరిగేందుకు ఉపయోగపడే ఆహారపదార్థాలను తెచ్చుకుని రోజూ తినేస్తున్నాడు. 'మా నాన్న బతకాలంటే నేను తినడమే మార్గమని డాక్టర్లు చెప్పారు. 45 కిలోలకు పెరగడమే నా లక్ష్యం. 50 కిలోలైతే మరీ మంచిదని చెబుతున్నారు. అంతగా తినాలంటే ఇబ్బందిగా ఉంటోంది. కానీ తింటూనే ఉన్నాను. ఎందుకంటే మా నాన్నను కోల్పోవడం మా కుటుంబం భరించలేదు'అని జికువాన్ పేర్కొన్నాడు. లావుగా అవ్వడం చూసి స్కూల్‌లో అందరూ ఎక్కిరించేవారని, అయితే దాని వెనుక ఉన్న కారణం తెలిసి అందరూ ఇప్పుడు మెచ్చుకుంటున్నారని చెప్పాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో.. ప్రపంచవ్యాప్తంగా అందరూ జికువాన్‌ను తెగ మెచ్చుకుంటున్నారు. 'ముందు నాన్నను బతికించుకోవాలి.. ఆ తర్వాతే లావు తగ్గాలి..'అంటుంటే అందరి కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. చిన్న వయసులోనే పెద్ద బాధ్యత భుజానికెత్తుకున్నావు.. నువ్వు గ్రేట్ అంటూ నెటిజన్లు కితాబిస్తున్నారు. నిజమైన హీరోవంటూ మెచ్చుకుంటున్నారు.



## సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు
# జాయింట్ చెక్‌పవర్
### గెజిట్ జారీ చేసిన సర్కార్

సాక్షి, హైదరాబాద్: గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లో కొన్ని సెక్షన్లను చేరుస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ శనివారం నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018లో చెక్ పవర్‌కు సంబంధించిన సెక్షన్లను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇందులో భాగంగా చట్టంలో 6(10), 34, 37(6), 43(10), 47(4), 70(4), 113(4), 114(2), 141 సెక్షన్లను నోటిఫై చేశారు. గ్రామపంచాయతీల చెక్ పవర్‌కు సంబంధించి నోటిఫికేషన్ జారీతో జాయింట్ చెక్‌పవర్‌పై ప్రభుత్వం స్పష్టతనిచ్చినట్టు అయ్యింది. సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ కల్పించడంతోపాటు, గ్రామ పంచాయతీల్లో ఆదాయ, వ్యయ సంబంధిత ఆడిటింగ్ బాధ్యతలు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించనున్నారు. ఈ అంశంతోపాటు గ్రామ సభ నిర్వహణకు ఉండాల్సిన కోరం తదితర ఇతర అంశాలనూ పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. సోమవారం (జూన్ 17) నుంచి కొత్త సెక్షన్లు అమల్లోకి రానున్నాయి. ఈ నోటిఫికేషన్‌ను సోమవారం నాటి గెజిట్‌లో ప్రచురించాలని వికాస్‌రాజ్ ఆదేశించారు.

# టీఆర్‌ఎస్ ఖాతాలోకే..
### 8 ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలు గెలుపు
### కాంగ్రెస్ ఖాతాలోకి 5 ఎంపీపీ అధ్యక్ష పదవులు

సాక్షి, హైదరాబాద్: శనివారం వివిధ జిల్లాల్లోని ఎంపీపీ పదవులకు జరిగిన ఎన్నికల్లో ఒక కోఆప్టెడ్, రెండు ఎంపీపీ అధ్యక్ష, మూడు ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఈ ఎన్నికల్లో భాగంగా 17 మండల ప్రజాపరిషత్(ఎంపీపీ)ల్లోని కోఆప్టెడ్ సభ్యులు, 16 అధ్యక్ష, 15 ఉపాధ్యక్ష పదవులకు జరిగిన ఎన్నికల్లో 8 ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను అధికార టీఆర్‌ఎస్ గెలుపొందింది. 5 ఎంపీపీ అధ్యక్ష పదవులను కాంగ్రెస్, మూడింటిని ఇండిపెండెంట్లు, మూడు ఎంపీపీ ఉపాధ్యక్ష పదవులను కాంగ్రెస్, ఒక్కో ఉపాధ్యక్ష పదవి చొప్పున బీజేపీ, టీడీపీ, రెండు ఉపాధ్యక్ష పదవులను ఇండిపెండెంట్లు గెలుచుకున్నారు.

# ఎడ్‌సెట్ ఫలితాలు వాయిదా

హైదరాబాద్: ఈ నెల 15న విడుదల కావాల్సిన ఎడ్‌సెట్ ఫలితాలను ఈ నెల 19కి వాయిదా వేసినట్లు శనివారం టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్ మృణాళిని ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఫలితాలను సిద్ధం చేశామని, కానీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఈ నెల 19న ఉదయం 11:30కి ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్య అందాలి
### రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థిని ఉన్నత విద్యావంతుడిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం తమదేనని స్పష్టీకరించారు. ఈనెల 17న రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 119 బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో శనివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని, దీంట్లో భాగంగానే కేజీటు పీజీ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కేవలం 19 గురుకులాలు మాత్రమే ఉండేవని, టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 238 బీసీ గురుకులాలను ప్రారంభించిందన్నారు. 2017–18 వార్షికంలో 119 బీసీ గురుకులాలు ప్రారంభమవ్వగా... 2019–20 వార్షికంలో మరో 119 బీసీ గురుకులాలను అందుబాటులోకి తెస్తుందన్నారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని, ఇంటర్, డిగ్రీ ఫలితాల్లోనూ గురుకుల విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. అదేవిధంగా జేఈఈ, నీట్, తదితర పోటీ పరీక్షలకు ఎంపికవుతుండడం ఆనందంగా ఉందన్నారు. నాణ్యమైన విద్యతోపాటు పౌష్టిక విలువలున్న భోజనాన్ని అందిస్తుండడంతో గురుకులాల పరపతి మరింత పెరుగుతోందని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆలోచనలతో విద్యారంగం ముందుకు వెళ్తోందన్నారు. గురుకులాల్లో సీట్ల పెంపు అంశం సీఎం దృష్టిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్య భట్టు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలోనే...
### బీజేపీ అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఐదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఉంటే నిరుద్యోగులు మాత్రం కోచింగ్ సెంటర్లలో ఉన్నారని బీజేపీ అధికార ప్రతినిధి రాకేశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఐదేళ్లలో తెలంగాణలో వచ్చిన మార్పు ఏమాత్రం కనబడడం లేదన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిరుద్యోగుల సహకారం, మద్దతుతో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ చెబుతున్నట్టుగా ఇప్పుడు చూస్తున్నది బంగారు తెలంగాణ కాదని, బడాయి తెలంగాణ అని విమర్శించారు. ఇంటికో ఉద్యోగమిస్తామని, రాష్ట్రంలో 1.12 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కేసీఆర్.. ఆ తర్వాత వాటిని పూర్తిగా మరిచిపోయారని మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీ విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. వివిధ పోటీ పరీక్షలు నిర్వహించినా అవి బాలారిష్టాలు దాటి ఉద్యోగాల భర్తీ చేపట్టలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా నిర్వహించిన పరీక్షల ఫలితాలు వెల్లడించి, ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# డీఈఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ

సాక్షి, హైదరాబాద్: డీఈఈసెట్–2019 తొలి దశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు సెట్ కన్వీనర్ ఎ.సత్యనారాయణ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం డీఈఈసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరూ ఈ నెల 20 నుంచి 22 తేదీల మధ్య తమ జిల్లాలోని ప్రభుత్వ డైట్ కాలేజీల ప్రిన్సిపాళ్ల వద్ద సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. అలాగే ఈ నెల 23 నుంచి 25 తేదీల్లో వెబ్ ఆధారంగా కాలేజీల ఎంపిక కోసం ఆప్షన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. కాలేజీల ఎంపిక కోసం సాధ్యమైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. ఎక్కువ ఆప్షన్లు ఇవ్వడం ద్వారా సీటు లభించే అవకాశం పెరుగుతుందన్నారు.

# కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి వ్యాఖ్యల కలకలం

- పార్టీ నాయకత్వంపై రాజగోపాల్‌రెడ్డి తిరుగుబాటుతో సర్వత్రా చర్చ
- ఆయన కమలం గూటికి వెళ్తారనే సంకేతాలు
- పార్టీని వీడాలని నిర్ణయించుకున్నాకే ఎదురుదాడి చేశారని వాదన
- సోదరుడు వెంకట్‌రెడ్డి కూడా పార్టీ వీడతారా?
- రాష్ట్ర కాంగ్రెస్‌లో మిగిలేది ఎందరనే దానిపై చర్చ

సాక్షి, హైదరాబాద్: విభిన్న రాజకీయాలకు మారుపేరైన కోమటిరెడ్డి బ్రదర్స్ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి కలకలం రేపారు. కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరైన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ను, సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొని పోరాడే శక్తి ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వానికి లేదని, టీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమంటూ ఆయన కాంగ్రెస్ నాయకత్వంపై ఏకంగా తిరుగుబాటు చేశారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క.. ఇలా ఎవరినీ వదలకుండా రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. బీజేపీలోకి వెళ్లేందుకు రాజగోపాల్‌రెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారన్న వార్తల నేపథ్యంలో ఆయన మాట్లాడిన మాటలు అవే సంకేతాలిస్తున్నాయనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. రాజగోపాల్‌తోపాటు ఆయన సోదరుడు, భువనగిరి ఎంపీ వెంకటరెడ్డి కూడా బీజేపీలోకి వెళ్తారా? కాంగ్రెస్ నుంచి ఇంకెవరు వెళ్లిపోతారు, ఎంత మంది మిగులుతారన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

### అదను చూసి.. గళం విప్పి

రాష్ట్ర నాయకత్వంపై ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై మొదటి నుంచీ విముఖతతో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొంతకాలంగా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత సీఎల్పీ నేత పదవిని ఆశించిన ఆయన... అది దక్కనప్పటికీ బహిరంగంగా పార్టీ నేతలను ఎక్కడా విమర్శించలేదు. పీసీసీ అధ్యక్ష హోదాను ఆశిస్తున్నా అధిష్టానం ఏదీ తేల్చనప్పటికీ ఎక్కడా నోరు విప్పలేదు. కానీ 12 మంది ఎమ్మెల్యేలను కోల్పోయి పార్టీ ప్రతిపక్ష హోదాను పోగొట్టుకున్న గడ్డు పరిస్థితుల్లో ఆయన అదను చూసి గళం విప్పడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కునారిల్లిపోయిందని, ప్రధాని మోదీ చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ఆమోదం లభించిందని, బీజేపీ ద్వారానే అటు దేశం, ఇటు రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్ముతున్నానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజగోపాల్ బీజేపీలోకి వెళ్తారనే ఊహాగానాలకు ఊతమిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత రాహుల్ గాంధీ రాజీనామా చేసినప్పుడు ఉత్తమ్ ఎందుకు చేయరని, సీఎల్పీ నేతను ఎన్నుకునేటప్పుడు ఎవరిని అడిగారని, 12 మంది ఎమ్మెల్యేలు పోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించిన ఆయన... నల్లగొండ ఎమ్మెల్సీ స్థానంలో తన భార్య లక్ష్మి ఓటమికి పరోక్షంగా ఉత్తమ్, జానాలే బాధ్యులనే విధంగా వ్యాఖ్యలు చేయడం వెనుక కూడా ఇదే వ్యూహం ఉందనే చర్చ జరుగుతోంది. ఇక పార్టీలో ఉండకూడదని నిర్ణయించుకున్న తర్వాతే ఏకంగా రాహుల్ నిర్ణయాలను తప్పుపడుతూ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారని, రాహుల్ రాజీనామా చేసి గాంధీ కుటుంబేతర వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పగించాలనే డిమాండ్ చేశారని అంటున్నారు.



### బయటకు ఇంకెంత మంది?

రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఆయన బీజేపీలోకి వెళ్లడం లాంఛనమేననే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నందున బీజేపీలోకి ఎలా వెళ్లాలన్న మీమాంస తప్ప ఆయన పార్టీ మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులంటున్నారు. అయితే ఈసారి రాజగోపాల్ ఒక్కరేనా లేక ఇంకెంత మంది వెళ్లిపోతారు? అసలు రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎవరు మిగులుతారన్నది కూడా ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ముఖ్యంగా ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పయనం ఎటువైపు అనే విషయమై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల పార్టీ మారే వ్యవహారం చర్చకు వచ్చిన సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తాను తుది శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని ప్రకటించిన నేపథ్యంలో సోదరులిద్దరూ చెరో బాట పడతారా? పార్టీ మారేలా రాజగోపాల్ తన కుటుంబ సభ్యులతో మాట్లాడి వెంకట్‌రెడ్డిని ఒప్పిస్తారా అన్నది కూడా సస్పెన్స్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది ఎమ్మెల్యేలు గెలిచినా ప్రస్తుతం పార్టీలో రాజగోపాల్‌తోపాటు భట్టి, శ్రీధర్‌బాబు, సీతక్క, జగ్గారెడ్డి, పోదెం వీరయ్యలు మాత్రమే ఉన్నారు. ఇప్పుడు రాజగోపాల్‌తోపాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలు వెళ్లిపోతారా లేక పార్టీలోనే కొనసాగుతారా? రాజగోపాల్ బీజేపీలోకి వెళ్తే ఆయనతోపాటు ఎవరెవరిని వెంటబెట్టుకొని వెళ్తారనే బెంగ ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలకు పట్టుకోవడం గమనార్హం. అయితే పార్టీ నాయకత్వాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన రాజగోపాల్‌రెడ్డిపై పార్టీ చర్యలకు ఉపక్రమిస్తుందా లేక ఆయన చెప్పినట్లు యువ నాయకత్వానికి పగ్గాలు అప్పగిస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

# టీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం

▶ మొదటి పేజీ తరువాయి

కనిపించడం లేదన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో డిండి ప్రాజెక్టు నిర్వాసితులతో జరిగిన సమీక్ష సమావేశానికి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై మీడియాతో మాట్లాడారు.

**కుంతియా, ఉత్తమ్ ఫెయిల్...**

అసెంబ్లీ సమావేశాల తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని మార్చి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీసీసీ పదవి నుంచి తప్పుకొని ఉండాల్సిందని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అలాగే ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా పార్టీని సమన్వయపరచలేక పోయారని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌ను మార్చనందుకే కాంగ్రెస్ ఓటమిపాలైందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోయిందని, 12 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడినా పట్టించుకునే నాథుడే లేరని ఆయన ఘాటు విమర్శలు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినా ఉత్తమ్ మాత్రం అలా ఆలోచించలేకపోయారని విమర్శించారు.

**కేసీఆర్‌ను ఢీకొట్టే శక్తి కాంగ్రెస్‌కు లేదు**

రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌ను, నియంతలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌ను ఢీకొట్టే శక్తి కాంగ్రెస్‌కు లేదని, కేసీఆర్‌ను, ఆయన కుటుంబ పాలనను ఢీకొట్టాలంటే ప్రధాని మోదీ వంటి నేతకే సాధ్యమని పేర్కొన్నారు. పీసీసీ సారథ్యాన్ని ఆశిస్తున్నారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ 'ఇప్పుడు చేయగలిగింది ఏమీ లేదు. అంతా అయిపోయింది'అని వ్యాఖ్యానించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, నల్లగొండ పార్లమెంటు స్థానాలను గెలుచుకున్న అంశంపై మాట్లాడుతూ భువనగిరిలో కేవలం తమ కుటుంబ బ్రాండ్ ఇమేజ్ వల్లే గెలిచామని, కాంగ్రెస్ ఎక్కడుందని ప్రశ్నించారు. నల్లగొండలో తామంతా కష్టపడ్డామని, అందుకే ఉత్తమ్ గెలిచారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందుకు వచ్చి పోటీలో ఉన్నామని, పార్టీ నాయకులు ఉత్తమ్, జానారెడ్డి వంటి వారు ఆ ఎన్నికను సీరియస్‌గా తీసుకోలేదని, అందుకే ఓడిపోయామన్నారు.

**కార్యకర్తలు, కుటుంబంతో మాట్లాడాకే పార్టీ మార్పుపై నిర్ణయం**

బీజేపీలో చేరాలని తాను ఇంకా నిర్ణయించుకోలేదని, భవిష్యత్తులో ఒకవేళ పార్టీ మారాల్సి వస్తే కార్యకర్తలతో, కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ అంటే తమకు కృతజ్ఞత ఉందని, తెలంగాణ ఇచ్చిన పార్టీగా రాష్ట్రంలో బలపడటంలో మాత్రం కాంగ్రెస్ నాయకత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితిపై నాయకత్వం ఆలోచన చేయాలని, డీకే అరుణ వంటి నాయకులు బీజేపీలోకి ఎందుకు వెళ్లిపోయారో సమీక్షించుకోవాలని సూచించారు.

## రాజగోపాల్‌రెడ్డి మాట్లాడింది వాస్తవాలే..
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పార్టీకి బీజేపీ ఒక్కటే ప్రత్యామ్నాయమంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పిన మాటలు వాస్తవాలేనని, ప్రజల్లో ఉన్న అభిప్రాయమే ఆయన చెప్పారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి వంటి నేతలు అనేకమంది బీజేపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అందరినీ ఆహ్వానించి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి 10 లక్షల మంది యువతను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రాణిగంజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ నేనని స్పష్టం చేశారు. బీజేపీలో చేరేందుకు యువత ఉత్సాహం చూపుతోందని చెప్పారు.



ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తనను ఎంపీగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.

**అస్థిరపరిచేందుకు పాక్ కుట్ర**

దేశాన్ని అస్థిరపర్చాలని పాకిస్తాన్ కుట్రలు చేస్తోందని, అవసరమైతే ఆ దేశానికి మరోసారి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తమ దేశ ప్రజలకు సరిగా తిండి పెట్టలేని పాక్ ప్రభుత్వం భారత్‌ను ఏదో చేసేస్తామన్న భ్రమల్లో ఉందని ఎద్దేవా చేశారు.

# మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

- అన్ని వ్యాపారాలు మహిళా సంఘాలే నిర్వహించే స్థాయికి రావాలి
- బ్యాంకు లింకేజీ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి
- ఎస్‌హెచ్‌జీల వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించిన మంత్రి

సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో అన్ని వ్యాపారాలను మహిళా సంఘాలే నిర్వహించేలా, పూర్తిస్థాయిలో ఆర్థిక పరిపుష్టిని సాధించేలా కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు సూచించారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయిల్లో వివిధ ప్రైవేట్ వ్యాపారులు, ఇతరులు నిర్వహించే పరిశ్రమలన్నీ మహిళా సంఘాలే నిర్వహించేలా ఈ వ్యవస్థ బలోపేతం కావాలనేది రాష్ట్ర ప్రభుత్వ కోరిక అని పేర్కొన్నారు. కల్తీలను నిరోధించేందుకు ఆయా వ్యాపారాలన్నీ కూడా మహిళా సంఘాల ద్వారా చేయించాలని సీఎం కేసీఆర్ పట్టుదలతో ఉన్నారన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. శనివారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) బ్యాంకు లింకేజీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు.. పీఆర్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సెర్ప్ సీఈవో పౌసమి బసు, ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్ ఓంప్రకాశ్ మిశ్రా, ఆర్‌బీఐ మేనేజర్ శంకర్, నాబార్డ్ సీజీఎం విజయ్‌కుమార్‌లతో కలిసి 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.6,584 కోట్లకు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ అందించేందుకు సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రుణ ప్రణాళిక లక్ష్యాలను వివరించడంతోపాటు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. గతంలో ప్రతి చిన్న విషయానికి పురుషులపై ఆధారపడాల్సిన పరిస్థితి నుంచి ప్రస్తుతం పురుషులే మహిళలపై ఆధారపడాల్సిన పరిస్థితులు రావడానికి మహిళాసంఘాలు, అవి నిర్వహించే కార్యకలాపాలే కారణమన్నారు. రుణ లక్ష్యాలకు మించి తమ ప్రభుత్వం సంఘాలకు కార్యక్రమాలు ఇస్తుందని, అందువల్ల అంతకు మించి రుణాలిచ్చేందుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయబోతోందన్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్‌ను నియమిస్తున్నట్టు, సంఘాల్లోని ప్రతి మహిళ ఏయే కార్యకలాపాలు చేపడుతుందో తెలుసుకోవడంతోపాటు ప్రతి ఇంటికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తెలిపారు. సెర్ప్ ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, తదితర అంశాలను గురించి సీఈవో పౌసమి బసు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మహిళా సంఘాలకు అన్నివిధాలా సహాయ, సహకారాలను అందిస్తామని ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్ ఓపీ మిశ్రా వెల్లడించారు. సంఘంలోని ఒక్కో మహిళకు ఇచ్చే రుణాల్లో రూ. 25 వేల వరకు ప్రాసెసింగ్ చార్జీలు వసూలు చేయరాదని ఆర్‌బీఐ నిర్దేశించిందని ఆర్‌బీఐ మేనేజర్ శంకర్ తెలిపారు. 1992లో 500 గ్రూపులతో మొదలైన స్వయం సహాయక సంఘాల ఉద్యమం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 87 లక్షల గ్రూపులకు విస్తరించిందని నాబార్డ్ సీజీఎం విజయ్‌కుమార్ తెలిపారు. నాబార్డ్ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ఒక గదిలో రూరల్ మార్ట్‌లను నిర్వహించేందుకు వీలుగా ఆ గదికి రెండేళ్లపాటు అద్దె కట్టడంతోపాటు సేల్స్‌పర్సన్‌కు జీతం ఇచ్చేందుకు, నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

# 'కాళేశ్వరం' ప్రారంభోత్సవ ఏర్పాట్లు ముమ్మరం

- మేడిగడ్డ బ్యారేజీ, పంప్‌హౌస్‌ల వద్ద సిద్ధమవుతున్న 14 హెలిప్యాడ్‌లు
- రెండు చోట్ల కొనసాగుతున్న యాగశాలల నిర్మాణం
- ఉదయం 11 గంటల్లోపే ప్రారంభోత్సవం పూర్తి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సన్నాహకాలు మొదలయ్యాయి. ఇద్దరు గవర్నర్లు, ముగ్గురు ముఖ్యమంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ, మేడిగడ్డ పంప్‌హౌస్‌ల వద్ద యాగశాలలు మొదలు, హెలిప్యాడ్‌ల నిర్మాణం, పోలీసు భద్రత, పార్కింగ్ వంటి ఏర్పాట్లను చకచకా పూర్తి చేస్తున్నారు. ఈ నెల 20 నాటికే సర్వసన్నద్ధంగా ఉండాలని, 21న ఉదయం 11 గంటల్లోగా అన్ని కార్యక్రమాలు పూర్తవ్వాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి.

**4 వేల మంది పోలీసులతో భద్రత...**

కాళేశ్వరం ప్రారంభోత్సవం సందర్భంగా మహాజలసంకల్ప యాగాన్ని సతీసమేతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ, పంప్‌హౌస్‌ల వద్ద యాగం నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించగా యాగ స్థలిని వేదపండితులు గోపీకృష్ణ శర్మ, ఫణిశశాంక్ శర్మలు గుర్తించి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. యాగశాలలకు అవసరమైన వసతుల కల్పన బాధ్యతను ప్రాజెక్టు ఇంజనీర్లు దగ్గరుండి చూసుకుంటున్నారు. ప్రారంభోత్సవం రోజున ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య మోటార్లను ప్రారంభించేలా పూజా కార్యక్రమాలు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇప్పటికే సూచనలు వెళ్లినట్లుగా తెలిసింది. సీఎం కేసీఆర్‌తోపాటు ఏపీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవేంద్ర ఫడ్నవిస్, గవర్నర్లు ఈఎస్‌ఎల్ నరసింహన్, విద్యాసాగర్‌రావులు హాజరవుతున్న నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ, పంప్‌హౌస్‌ల వద్ద ఏడేసి హెలిప్యాడ్‌ల చొప్పున 14 హెలిప్యాడ్‌లు సిద్ధం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఇప్పటికే పోలీసుల సహకారంతో స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి భారీ భద్రత ఏర్పాటు చేశారు. వరంగల్ రేంజ్ ఐజీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం కావడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. నాలుగు వేల మంది పోలీసులతో కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ భద్రతను పెట్టనున్నారు. ఇప్పటికే గ్రేహౌండ్స్, స్పెషల్ ఫోర్స్, బీఎస్‌ఎఫ్ జవాన్లు ప్రాజెక్టు వద్దకు చేరుకుంటున్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవ శిలాఫలకం, దానిపై ముద్రించాల్సిన పేర్లు తదితరాలపై శనివారం ప్రభుత్వ పెద్దలు నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్‌తో చర్చించారు. శిలాఫలకంపై గవర్నర్ల పేర్లతోపాటు ముగ్గురు ముఖ్యమంత్రుల పేర్లు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంజనీర్లు, ఇతరుల పేర్లు ఉండకపోవచ్చని నీటిపారుదల వర్గాలు తెలిపాయి. సాంకేతికంగా మోటార్ల ప్రారంభానికి సంబంధించి నీటి నిల్వలు, పంపింగ్‌లో అవాంతరాలు ఏర్పడకుండా ఇంజనీర్లు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### ఇదండీ సంగతి



మనతో ఎవరు పొత్తు పెట్టుకుంటే వాళ్లు ఓడిపోతున్నారు... పెట్టుకోకుంటే మనం ఓడిపోతున్నాం!!

# అడవిలో అక్రమార్కులు!

**సాక్షి, కొత్తగూడెం:** అడవులను సంరక్షించాల్సిన ఆ శాఖ అధికారులే యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో పాటు, అటవీశాఖ భాగస్వామ్యంతో ప్లాంటేషన్ చేపట్టిన వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) సభ్యులైన గిరిజనులకు రావాల్సిన మొత్తాన్ని సైతం మింగుతున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం కెనాల్ ప్రాంతంలో తొలగించిన కలపను సైతం వేలం వేయకుండా అక్రమ మార్గంలో అధికారులే అమ్ముకుంటున్నారు. రైతుల పట్టాభూముల్లో నుంచి వచ్చిన కలప పేరుతో అటవీ భూముల్లోని కలపను సైతం అమ్ముతుండటంతో పాటు, ఈ పర్మిట్లకు కిందిస్థాయి అధికారుల సంతకాలను సైతం ఓ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, మరో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కలిసి ఫోర్జరీ చేసి చెక్‌పోస్టులు దాటిస్తున్నారనే ఫిర్యాదులు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా దృష్టికి వెళ్లాయి. దీంతో ఆయన నేరుగా హైదరాబాద్ నుంచి విజిలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపారు. ఆయా బృందాలు ఏకధాటిగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు దాడులు నిర్వహించాయి. రెండు కలప లారీలను పట్టుకుని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. కలప అక్రమ దందా నడిపిస్తున్న సదరు ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్‌వోలకు జిల్లాలోని మరికొందరు ఉన్నతాధికారుల మద్దతు ఉందనే సమాచారంతో నేరుగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ దృష్టి పెట్టారని తెలుస్తోంది.

**దారి తప్పుతున్న అటవీ అధికారులు**
- సీతారామ కెనాల్ పరిధిలో వచ్చిన కలప సైతం పక్కదారి
- వేలం నిర్వహణలో ఇష్టారాజ్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా సీరియస్

**విస్తుపోయేలా అక్రమాల చిట్టా**

సీతారామ ఎత్తిపోతల పథకం కెనాల్ కోసం జిల్లాలో సుమారు 4,951 ఎకరాల అటవీ భూములు సేకరించారు. ఈ కెనాల్ పొడవునా లక్షలాది టన్నుల్లో వివిధ రకాల జాతుల కలప తొలగించారు. ఈ కలపను అటవీశాఖ టింబర్ డిపోలకు తరలించి ప్రకటనలు ఇచ్చి వేలం పాట ద్వారా అమ్మాల్సి ఉంటుంది. అయితే ఈ అక్రమ అధికారులు మాత్రం సదరు కలపలో 80 శాతం పైగా ఇష్టారాజ్యంగా బయట అమ్ముకున్నట్లు తెలుస్తోంది. పాల్వంచ, ములకలపల్లి మండలాల పరిధిలో గత రెండు నెలల్లో 2 లారీల టేకు కలప, 6 లారీల వెదురుబొంగులు, 6 లారీల వేగిస, 2 లారీల నారవేప, 20 లారీల జామాయిల్, 21 లారీల ఫైర్ ఉడ్ అమ్ముకున్నట్లు సమాచారం. ఈ కలపను నేరుగా హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి, రాజమండ్రి ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. దమ్మపేట మండలంలోని ఓ సామిల్‌లో టేకు కలపకు సంబంధించి తగిన పరిమాణాల్లో దిమ్మెలు తయారు చేసి మరీ తరలించినట్లు సమాచారం. చెక్‌పోస్టుల వద్ద కూడా ఇదే పంథా అవలంబించినట్లు తెలిసింది. అటవీశాఖ, వీఎస్ఎస్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్లాంటేషన్ కలపను సైతం ఇష్టారాజ్యంగా అమ్ముకున్నారు. ఈ కలపకు సంబంధించి అటవీశాఖ టింబర్ డిపోల్లో వేలం వేయాలి. వచ్చిన ఆదాయంలో 50 శాతం అటవీ అభివృద్ధికి ఉపయోగించాలి. మరో 50 శాతం ఆదాయాన్ని వీఎస్ఎస్ సభ్యులకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఈ కలపను పక్కదారి పట్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, వీఎస్ఎస్ సభ్యులకూ అన్యాయం చేస్తుండటం శోచనీయం. అదేవిధంగా అక్రమంగా టింబర్ డిపో నుంచి నేరుగా వక్రమార్గంలో ఐటీసీకి సైతం జామాయిల్ అమ్ముకుంటున్నట్లు వీఎస్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ వీఎస్ఎస్ కలప తరలింపు కోసం సృష్టించిన పర్మిట్లు సైతం ఫోర్జరీవే కావడం విశేషం. పట్టా భూముల్లోని కలప పేరుతో అటవీ కలపను అక్రమంగా రవాణా చేయిస్తున్నారు. రైతుల పట్టా భూములకు సంబంధించిన కలపను నరికి, తరలించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్‌వో, ఫారెస్ట్ బీట్ అధికారులే పర్మిట్లు ఇస్తారు. అయితే ఎఫ్‌బీవోల సంతకాలను సైతం ఫోర్జరీ చేసి సదరు ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్‌వోలు అక్రమ కలప రవాణాకు మార్గాలు ఏర్పాటు చేయడం గమనార్హం. కిందిస్థాయి అధికారులను ఉద్దేశపూర్వకంగా ఇతర చోట్లకు పంపించి నిర్ణీత సమయం అనేది లేకుండా ఎప్పుడుపడితే అప్పుడే లారీలకు లోడ్ చేయిస్తున్నారు. ఈ ఎఫ్‌డీవో నిర్వాకంతోనే బూర్గంపాడు మండలం ఉప్పుసాక వద్ద కొందరు 2 వేల ఎకరాల్లో అక్రమంగా అడవిని పోడు కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోడు దున్నుతున్న ఒక్కో ట్రాక్టరుకు 50 వేల చొప్పున వసూలు చేసినట్లు తెలుస్తోంది.



విజిలెన్స్ బృందాల దాడిలో పట్టుబడిన కలప లారీ

**అటవీ అధికారుల పాత్రపై విచారణ**



హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ డీఎఫ్ఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ములకలపల్లి మండలంలో దాడులు చేసిన అనంతరం రాజశేఖర్ విలేకరులతో మాట్లాడారు. పలు రకాల ఫిర్యాదులు రావడంతో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆదేశంతో దాడులు చేశామన్నారు. అటవీ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేస్తామన్నారు. ఈ విషయాలపై ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రశాంత్‌కుమార్ ఝా ను 'సాక్షి' వివరణ కోరగా విచారణ నివేదిక వచ్చిన తరువాత శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## గురుకుల విద్యార్థిని మృతి

**సిబ్బంది నిర్లక్ష్యంతోనే అంటూ తల్లిదండ్రుల ఆరోపణ**



గుగులోతు నేహ

**బోనకల్:** ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని గుగులోతు నేహ (12) మృతి చెందింది. 8వ తరగతి చదువుతున్న నేహ అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం కన్నుమూసింది. తిరుమలాయపాలెం మండలం పడమటి తండాకు చెందిన గుగులోతు రవికుమార్, వినోద దంపతుల కుమార్తె నేహను ఈనెల 13వ తేదీన గురుకుల పాఠశాలలో చేర్పించారు. ఆమెకు శుక్రవారం రాత్రి వాంతులు కావడంతో అస్వస్థతకు గురైంది. ఎండల తీవ్రతతో వాంతులు అవుతున్నాయని గుర్తించి హెల్త్ సూపర్‌వైజర్ మాత్రలు ఇచ్చింది. అయితే శనివారం ఉదయం పరిస్థితి తీవ్రం కావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించడంతోపాటు నేహను వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. విద్యార్థిని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతి చెందిందని ఆమె తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తూ.. ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు.

## మహిళ కళ్లల్లో కారం చల్లి హత్య

**ఒంటిపై బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు**

**పటాన్‌చెరు టౌన్:** ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ కళ్లల్లో కారం చల్లి గుర్తు తెలియని దుండగులు ఆమెను హత్యచేసి ఒంటి మీద ఉన్న బంగారం ఎత్తుకెళ్లారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సీఐ ప్రభాకర్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్, అరుంధతి (58) దంపతులు బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వాణినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సురేందర్‌గౌడ్ కోహీర్‌లో ఆయుర్వేద డాక్టర్‌గా పని చేస్తున్నాడు. సురేందర్ గౌడ్ శుక్రవారం ఎప్పటిలాగే కోహీర్‌లో ఉన్న తన క్లినిక్‌కు వెళ్లాడు. దీంతో ఇంట్లో అరుంధతి ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఆమె కళ్లలో కారం చల్లి ఆపై గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న పుస్తెల తాడు, నాలుగు బంగారు గాజులు, చెవుల కమ్మలను ఎత్తుకెళ్లారు. రాత్రి 10 గంటలకు సురేందర్‌గౌడ్ తిరిగొచ్చి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా భార్య అరుంధతి మృతి చెంది ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హుజూర్‌నగర్ సీటును గిరిజనులకు ఇవ్వాలి

**చింతలపాలెం (హుజూర్‌నగర్) :** హుజూర్‌నగర్ అసెంబ్లీ సీటును గిరిజనులకు కేటాయించాలని మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ పీసీసీని కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎస్టీ జనాభా ఎక్కువగా ఉందని, గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం.. ఉత్తమ్ రాజీనామాతో ఖాళీ అయిన ఈ సీటును గిరిజనులకు ఇవ్వాలని కోరారు. అలాగే సీఎం కేసీఆర్ ఇద్దరు ఎస్టీ మహిళలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

# మా వాళ్లను విడిపించరూ..!

**ఇరాక్ జైల్లో కవ్వాల్ గ్రామస్తులు**
- పాఠశాలలో పని చేస్తున్న వారిని పట్టుకెళ్లిన పోలీసులు
- రెండు నెలలుగా కారణం చెప్పని వైనం
- విడుదల చేయించాలని రెండు కుటుంబాలు వేడుకోలు



ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీబిడ్డలు

**జన్నారం(ఖానాపూర్):** 'మా నాన్న మాతో మాట్లాడక రెండు నెలలయితంది. ఇరాక్ దేశంలో జైల్లో పడ్డాడట. అమ్మ వాళ్లు ఏడుస్తున్నరు. మా కోసం వేరే దేశం వెళ్లిన మా నాన్నను ఇంటికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలి. కేటీఆర్ సార్ మా మీద దయ చూపాలి, మా నాన్నను తీసుకురావాలి' అని మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన కుంటాల లచ్చన్న పిల్లలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కవ్వాల్ గ్రామానికి చెందిన కుంటాల లచ్చన్న, షేర్ల రాజు ఉపాధి కోసం 2015లో ఇరాక్ వెళ్లారు. కుంటాల లచ్చన్నకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. అదే విధంగా షేర్ల రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలను మంచిగా చదివించాలని, అందరిలో మంచిగా బతకాలనే ఉద్దేశంతో వీరిద్దరూ ఇరాక్‌కు వెళ్లారు. వీసా కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏజెంట్‌కు రూ.1.50 లక్షలు కట్టారు. ఏజెంట్ విజిట్ వీసాతో వారిని అక్కడికి పంపించాడు. అక్కడికి వెళ్లాక ఏజెంట్ మోసం చేశాడని తెలిసింది. అఖామా లేకుండా ఇరాక్‌లో ఉండటం చాల ఇబ్బందని తెలిసి, తెలిసిన వారి వద్ద ఉంటూ దొంగ చాటుగా పనిచేస్తూ జీవించారు. ఈ క్రమంలో సంవత్సరం అనంతరం పనిచేసిన డబ్బులతో అఖామా చేయించుకున్నారు. ఆ సమయంలో అప్పుల పాలయ్యారు. అఖామా వచ్చాక ఎర్బిల్‌లోని పాఠశాలలో పని దొరికింది. ఇద్దరూ అక్కడే ఉంటూ పని చేస్తున్నారు. ఎలాగోలా అఖామాకు చేసిన అప్పులు తీర్చారు. ఇక వెళ్లిన సమయంలో చేసిన అప్పులు తీర్చాల్సి ఉంది. అప్పులు తీర్చి ఇంటికి వద్దామనుకున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 16వ తేదీన పోలీసులు వచ్చి ఎలాంటి కారణం లేకుండా వారిద్దరినీ పట్టుకెళ్లారు. ఎందుకు పట్టుకెళ్లారో.. ఎన్ని రోజులు జైల్లో ఉంచుతారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**కన్నీరుమున్నీరవుతున్న కుటుంబాలు**

ఊరిలో షేర్ల రాజు, కుంటాల లచ్చన్నల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇద్దరిదీ పేద కుటుంబం కావడంతో ఉపాధి కోసమని అప్పులు చేసి ఇరాక్ దేశం వెళ్లారు. తమ భర్తలు జైల్లో పడ్డారని తెలిసి రెండు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వారు క్షేమంగా తిరిగి వచ్చేలా కేటీఆర్‌ను వేడుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14న గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాట్కూరి బసంతరెడ్డి వద్దకు వెళ్లి వారిని ఎలాగైన విడిపించాలని వేడుకున్నారు.

# ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితా

- ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సులో ప్రవేశాలకు 1404 మంది ఎంపిక
- 25, 26 తేదీల్లో మొదటిదశ కౌన్సెలింగ్
- మిగిలిన సీట్లకు జూలై 3న రెండో విడత

**భైంసాటౌన్:** బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)లో 2019–20 విద్యాసంవత్సరానికిగాను ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సులో మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ అశోక్‌కుమార్ శనివారం ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,763 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మాస్టర్ డేటాబేస్‌లో వచ్చిన సరైన దరఖాస్తులు 34,217. ఇక స్థానిక విద్యార్థుల నుంచి 32,401 దరఖాస్తులు రాగా, 1816 దరఖాస్తులు స్థానికేతర విద్యార్థుల నుంచి వచ్చాయి. ఇతర రాష్ట్రాల (ఏపీ, తెలంగాణ కాకుండా) నుంచి 59 మంది దరఖాస్తు చేసుకోగా, ఎన్ఆర్ఐ కోటా కింద ఒక్కరు దరఖాస్తు చేసుకున్నారు. ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకుగాను 1500 సీట్లు ఉండగా, మొదటి దశ కౌన్సెలింగ్ కోసం ఎంపికైన 1404 మంది విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. మిగిలిన 96 సీట్లను దివ్యాంగులు, సీఏపీ, ఎన్‌సీసీ, క్రీడలు వంటి ప్రత్యేక కేటగిరికి చెందిన విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. మొదటి దశలో ఎంపికైన విద్యార్థుల్లో 32:68 నిష్పత్తిలో బాలబాలికలను ఎంపిక చేశారు. 960 బాలికలు, 444 మంది బాలురను ఎంపిక చేశారు.

**25, 26 తేదీల్లో కౌన్సెలింగ్**

ఎంపికైన 1404 మంది విద్యార్థులకు ఈనెల 25, 26 తేదీల్లో మొదటిదశ కౌన్సెలింగ్ ఉంటుంది. క్రమసంఖ్య 1నుంచి 800ల వరకు ఈనెల 25న, అలాగే క్రమసంఖ్య 801 నుంచి 1404 వరకు ఈనెల 26న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎంపికైన విద్యార్థులు తప్పనిసరిగా నిర్దేశించిన తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. హాజరుకాని విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం కోల్పోతారు. మొదటి దశ కౌన్సెలింగ్ తరువాత మిగిలిన సీట్లకు వెయిటింగ్ లిస్టు విడుదల చేసి, జూలై 3న రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు.




## జైపూర్ అడవుల్లో శిలాజాలు

- సమ్మక్క గద్దెపై జంతుశిలాజం ఆనవాళ్లు
- నిర్ధారించనున్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

**జైపూర్(చెన్నూర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ అడవుల్లో శిలాజాల ఆనవాళ్లు కనిపించాయి. వెలిశాల మల్లన్నగుడి ప్రాంతంలో ఏళ్ల చరిత్ర కలిగిన శిలాజాల ఆనవాళ్లను అధికారులు గుర్తించారు. ఏటా సమ్మక్క–సారక్కగా భక్తులకు దర్శనమిస్తున్న సమ్మక్క గద్దపై ఉన్న దేవుడిని శిలాజంగా పురావస్తుశాఖ అధికారులు భావిస్తున్నారు. రెండ్రోజుల కిందట సమ్మక్క–సారక్క గద్దెలపై ఉన్న దేవుడి విగ్రహాలు, వెలిశాల మల్లన్న గుడి ప్రాంతంలో పురవాస్తుశాఖ సహాయ సంచాలకులు నాగరాజు, ప్రాచీన కట్టడాల ముఖ్య సంరక్షకులు భానుమూర్తి పరిశోధన చేశారు. సారక్క దేవుడి గద్దెపై.. వెన్నుపూస ఉండి, ఇరువైపులా పక్కటెముకలు కలిగిన జంతు శిలాజం ఆనవాళ్లు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. శిలాజాలపై జియాలాజికల్ ఆఫ్ ఇండియా పూర్తిస్థాయిలో నిర్ధారించనుంది. మల్లన్నగుడి ప్రాంతంలో పురావస్తుశాఖ అధికారులు 1983లోనే శిలాజాలను గుర్తించారు. జంతు శిలాజాలను గుర్తించి వాటిని మ్యూజియంలో పెట్టేందుకు అధికారులు ప్రయత్నించగా ఇక్కడి ప్రాంతవాసులు అంగీకరించలేదు. దీంతో అధికారులు వాటిని ఇక్కడే వదిలివెళ్లిపోయారు. అవి ఇప్పుడు అదృశ్యమయ్యాయి. మళ్లీ పరిశోధన బృందం ఇదే ప్రాంతంలో పరిశోధన చేయగా.. శిలాజాలు వెలుగుచూశాయి. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిసింది.

# కిలోమీటరుకు 5 పైసలు

**ఐఐటీ హైదరాబాద్ అంకుర సంస్థ ఆధ్వర్యంలో బ్యాటరీ వాహనాలు**
- ధ్వని, వాయు కాలుష్య రహితం
- 4 గంటల విద్యుత్ చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల ప్రయాణం
- నెల రోజుల్లో అందుబాటులోకి ద్విచక్ర వాహనాలు



బ్యాటరీ వాహనాల తయారు చేస్తున్న దృశ్యం

**సాక్షి, సంగారెడ్డి:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌కు చెందిన అంకుర సంస్థ 'ప్యూర్ ఈవీ' విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. మరో నెలరోజుల్లో దేశ వ్యాప్తంగా మార్కెట్లోకి తెచ్చేందుకు ఈ విద్యుత్ చార్జింగ్ ద్విచక్ర వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నిశాంత్ దొంగరి, ఐఐటీ ముంబైకి చెందిన రోహిత్ వడేరాలు 2016లో ఈ అంకుర సంస్థకు శ్రీకారం చుట్టారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం శివారులోని కంది మండలంలో ప్యూర్ ఈవీ పరిశోధన–అభివృద్ధిని కేంద్రాన్ని నెలకొల్పారు. ఇందులోనే విద్యుత్ చార్జింగ్‌తో నడిచే బ్యాటరీ వాహనాలను రూపొందించారు. ఈ వాహనాలకు కిలోమీటరుకు కేవలం 5 పైసలు మాత్రమే ఖర్చవుతుందని చెబుతున్నారు. ఈ సంస్థ చార్జింగ్‌తో నడిచే ద్విచక్ర వాహనాలతో పాటుగా పర్వతారోహకులు ఉపయోగించే సైకిళ్లను సైతం తయారు చేస్తోంది. ఇగ్నైట్, ఈ–ట్రాన్స్, ఈ–ప్లుటో.. వంటి పేర్లతో ధ్వని, వాయుకాలుష్యం లేని వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ వాహనాల్లో వినియోగించే లిథియం అయాన్ బ్యాటరీలను వారే స్వయంగా తయారు చేయడం విశేషం. ఈ వాహనాలు దొంగతనాలకు గురికాకుండా ఉండేందుకుగాను 'యాంటీ థెఫ్ట్ స్మార్ట్ లాక్' పరిజ్ఞానంతో తయారు చేస్తున్నారు. వాహనాల రకాలను బట్టి 150 నుంచి 200 కిలోల బరువును మోయగల సామర్థ్యంతో రూపొందిస్తున్నారు. వర్షం, ఎండలను తట్టుకునే విధంగా, తుప్పు రాకుండా వీటిని తయారుచేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ వేగాన్ని అందుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని వీటి తయారీలో వినియోగిస్తున్నారు. దేశంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఇంజనీరింగ్ చదివిన 15 మంది విద్యార్థులు ఈ బ్యాటరీ వాహనాల రూపకల్పనలో భాగస్వాములయ్యారు.

**చార్జింగ్ వాహనాలకే డిమాండ్**



అనుదీప్

వేలూరు ఐఐటీ పూర్వ విద్యార్థి రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల కంటే విద్యుత్ చార్జింగ్‌తో నడిచే వాహనాలకే డిమాండ్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ రకమైన వాహనాల తయారీకి శ్రీకారం చుట్టాం. ఈ వాహనాల వల్ల వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది. ప్రభుత్వాలు కూడా బ్యాటరీతో నడిచే వాహనాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. ఢిల్లీలో ఇప్పటికే అధిక కాలుష్యంతో నడిచే వాహనాలపై నియంత్రణ ఉంది. భవిష్యత్తులో అన్ని పట్టణాల్లో కాలుష్య కారక వాహనాలపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది.

**DELHI POLICE**

**NOTICE**

**DIRECT RECRUITMENT FOR VARIOUS TRADES OF MULTI-TASKING STAFF (CIVILIAN) IN DELHI POLICE-2017**

The result of Written Examination for direct recruitment for various trades of Multi-Tasking Staff (Civilian) in Delhi Police-2017 held from 17.12.2018 to 09.01.2019 has been declared on 14.06.2019 and the same has been uploaded on the website of the Delhi Police i.e. **www.delhipolice.nic.in.** The Admission Cards for Trade Test will be made available on Delhi Police website **(www.delhipolice.nic.in)** later on. For any enquiry or clarification in this regard, the candidates may contact on Helpline Nos. viz. 011-27412715, 011-27241205, 011-27241206 of Recruitment Cell, New Police Lines, Kingsway Camp, Delhi-110009 during working hours.

Sd/-
(Vikram K. Porwal)
Dy. Commissioner of Police
Recruitment, Delhi

DP/8862/17

**తెలంగాణ ప్రభుత్వం**
**పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, నిజామాబాద్**
**టెండరు నోటీస్**

**CTN No. 05/DB/T1/Tenders/2018-19** తేది: 10.06.2019

నిజామాబాద్ మండలంలో మహిళా భవన్స్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, యూత్ బిల్డింగ్స్ నిర్మాణం, CC రోడ్లు మరియు డ్రెయిన్స్ నిర్మాణం మొ॥ అభివృద్ధి పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. 74 పనులకు మొత్తం ECV: రూ. 475.94 లక్షలు, దరఖాస్తుల చివరి తేది: 10.06.2019 నుండి 20.06.2019 సా. 05.00 గం. వరకు, టెండర్ షెడ్యూళ్ల జారీ: 21.06.2019న సా. 05.00 గం. వరకు, టెండర్ల స్వీకరణకు చివరి తేది: 22.06.2019, మ. 03.00 గం. టెండరు షెడ్యూళ్లు తెరుచుట: 22.06.2019న మ. 03.30 గం.కు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.

సం/– జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, PIU డివిజన్, నిజామాబాద్
DIPR Ro. No. 320-DP/CL/Advt/1/2019-20, Dt: 15/06/2019.

**తెలంగాణ ప్రభుత్వం**
**ప్రజారోగ్య మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్**

**NIT No.10/TUFIDC/UNIT-II/NLG/Roads, Junctions & Arches/2019** తేది : 13.06.2019

**టెండర్ ID : 126108, పనిపేరు** : నల్గొండ మున్సిపాలిటీ – TUFIDC రుణ సహాయం క్రింద నల్గొండ మున్సిపాలిటీలో జంక్షన్లు, రోడ్ల అభివృద్ధి పనులు మరియు ఆర్చెస్ నిర్మాణం. ECV : రూ. 23,91,97,431.00. బిడ్ దాఖలు ముగింపు తేది : 01.07.2019. సెల్ నం. : 9849905730. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చును.

సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), TUFIDC, యూనిట్ – II (FAC)
DIPR RO.No.322-DP/CL/Advt/1/2019-20, Dt:15.06.2019.

**తెలంగాణ ప్రభుత్వం**
**రోడ్లు మరియు భవనాల శాఖ, మహబూబ్‌నగర్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్**

**NIT No.01/SE/TS/R&B/MBNR/2019-20,** తేది : 11.06.2019

**పనిపేరు** : నాగర్‌కర్నూలు జిల్లాలో నాగర్‌కర్నూలు వద్ద EVM's & VVPAT's స్టోరేజ్ కొరకు వేర్‌హౌస్ నిర్మాణం ECV : రూ. 80.91 లక్షలు. టెండర్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 02.07.2019, ఆఫీస్ ఫోన్ నం : 08542–222407. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో చూడవచ్చును.

సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్ : మహబూబ్‌నగర్
DIPR RO.No.326-DP/CL/Advt/1/2019-20, Dt:15.06.2019.

**తెలంగాణ ప్రభుత్వం**
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TUFIDC, యూనిట్–IV, రామగుండం**
**ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

**Lr.No.NIT No.26/EE/TUFIDC/UNIT-IV/2018-19** తేది: 13.06.2019

**సంక్షిప్త టెండరు ప్రకటన**

**పని పేరు:** జమ్మికుంట మున్సిపాలిటీలో స్మశానవాటికలు, LED లైటింగ్ (3నం.లు) మరియు హుజూరాబాద్ మున్సిపాలిటీలో LED మరియు డెకరేటివ్ లైటింగ్, స్వాగత ద్వారాల (1నం.) అభివృద్ధి పనులు. అంచనా వ్యయం: **రూ. 172.31 లక్షలు.** బిడ్ దాఖలు ప్రారంభ తేది: **17.06.2019.** బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: **25.06.2019, మ.3.00 గం.** సాంకేతిక బిడ్ తెరుచు తేది: **25.06.2019, మ.3.30 గం.** ధర బిడ్ తెరుచుట: **25.06.2019, సా.5.30 గం.** సంబంధిత అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ **@https://tender.telangana.gov.in**లో చూడవచ్చును.

సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TUFIDC, యూనిట్–IV, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO. No.324-DP/CL/ADVT/1/2019-20 Dt: 15.06.2019

# దొంగతనానికి వచ్చి హత్య

**మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన**
- దొంగతనం చేస్తే చంపేస్తారా? అంటూ ఇంటిపై దాడి
- ఇంటి ముందు చితిని పేర్చి ఆందోళన.. ఉద్రిక్తత
- ఇరుగ్రామాల పెద్దల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



**వర్ని(బాన్సువాడ):** దొంగతనానికి వచ్చి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. దొంగతనం చేస్తే చంపేస్తారా అంటూ మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆ ఇంటిపై దాడి చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జలాల్‌పూర్‌లో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్లెర్ల భూమయ్య ఇల్లు శివారులో ఉంది. ఉక్కపోత కారణంగా శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు దాబాపైన పడుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు వ్యక్తులు వచ్చి తాళం పగులగొట్టారు. ఒకరు బయట కాపలా కాస్తుండగా మరొకరు ఇంట్లోకి వెళ్లాడు. ఈ సమయంలో కింది నుంచి శబ్దం విన్పించడంతో భూమయ్య కుటుంబ సభ్యులు దాబాపై నుంచి కిందికి దిగుతుండగా బయట కాపలా ఉన్న వ్యక్తి పారిపోయాడు. ఇంట్లోని వ్యక్తికి పట్టుకుని చితకబాదడటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం భూమయ్య కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ వెళ్లి లొంగిపోయారు. మృతుడు ఇదే మండలం శంకోరా గ్రామానికి చెందిన కేతావత్ రాజు అలియాస్ రాజేష్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, శంకోరా గ్రామస్తులు శనివారం ఘటన స్థలానికి వచ్చి ఆందోళన నిర్వహించారు. భూమయ్య ఇంటిపై దాడి చేశారు. వాటర్ పైపు ధ్వంసం చేశారు. కాగా, దొంగతనం చేస్తే చంపేస్తారా? అంటూ మృతుడి బంధువులు పోలీసులను నిలదీశారు. ఇంటి ముందే మృతదేహాన్ని దహనం చేస్తామని చితిని పేర్చారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఇరు గ్రామాల పెద్దలు చర్చలు జరిపి మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని సయోధ్య కుదిర్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు.

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజేబిలిటీస్ (దివ్యాంగ్‌జన్) (NIEPMD)**

NAAC ద్వారా అక్రిడేటెడ్ – ISO 9001:2015

(వికలాంగుల (దివ్యాంగ్‌జన్) సాధికారత శాఖ, సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం) ఈస్ట్ కోస్ట్ రోడ్, ముత్తుకాడు, కోవళం (PO) , చెన్నై – 603112 తమిళనాడు – ఇండియా ఫోన్ : 044–27472104, 27472113, 27472423, 27472046 టోల్ ఫ్రీ నం 18004250345 www.niepmd.tn.nic.in E-mail : niepmd@gmail.com, niepmdhrd@gmail.com

**ప్రవేశ ప్రకటన – 2019–20**

| కోర్సు | ఆఖరి తేది |
| --- | --- |
| కేర్ గివింగ్‌లో సర్టిఫికేట్ కోర్సు (A లెవల్) (3 నెలలు) | 31.07.2019 బ్యాచ్ –I |
| కేర్ గివింగ్‌లో సర్టిఫికేట్ కోర్సు (B లెవల్) (6 నెలలు) | 29.11.2019 బ్యాచ్ –II |
| కేర్ గివింగ్‌లో సర్టిఫికేట్ కోర్సు (సీనియర్) (10 నెలలు) | 15.07.2019 |
| బ్యాచిలర్స్ ఆఫ్ ఫిజియోథెరపీ (BPT) ($4^{1/2}$ సంవత్సరాలు)<br>బ్యాచిలర్స్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ (BOT) ($4^{1/2}$ సంవత్సరాలు) | స్టేట్ సెలెక్షన్ కమిటీ, తమిళనాడు ప్రభుత్వం ద్వారా అడ్మీషన్ (తమిళనాడు ప్రభుత్వం తేది ప్రకటిస్తుంది) |
| B.Ed. స్పెషల్ ఎడ్యుకేషన్ – (మల్టిపుల్ డిజేబిలిటీస్ / ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ / బధిరులు అంధులు (2 సంవత్సరాలు) | 15-7-2019 |
| M.Ed. స్పెషల్ ఎడ్యుకేషన్ – ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (2 సంవత్సరాలు) | |
| M.Ed. స్పెషల్ ఎడ్యుకేషన్ – బహుళ వైకల్యాలు (2 సంవత్సరాలు) | |

- అర్హత నిబంధనలు, మారదర్శకాలు, దరఖాస్తు మరియు ప్రాస్పెక్టస్ కోసం దర్శించండి. www.niepmd.tn.nic.in
- ఈశాన్య ప్రాంత విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్స్ లభిస్తాయి
- TN ప్రభుత్వ / రాష్ట్ర ప్రభుత్వ / కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రకారం SC/ST/PH స్కాలర్‌షిప్స్ వర్తిస్తాయి

davp 38118/11/0004/1920

సం/– డైరెక్టర్

భారతదేశం నుంచి పాకిస్తాన్‌ను విడగొట్టాలన్న ప్రతిపాదన (మౌంట్‌బాటన్ ప్లాన్)ను 1947 జూన్ 15న కాంగ్రెస్ అంగీకరించింది.



# పుర్రె ఎముకలు పెరుగుతున్నాయి



స్మార్ట్‌ఫోన్లతో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో.. అంతేస్థాయిలో నష్టాలు ఉన్నాయని మనం తరచూ వింటుంటాం. సామాజిక సంబంధాలు తగ్గిపోతాయని.. అదేపనిగా టైప్ చేయడం వల్ల వేళ్లు, కీళ్ల నొప్పులు ఎక్కువవుతాయని చెబుతుంటారు. తాజాగా స్మార్ట్‌ఫోన్ అతి వాడకం పుణ్యమా అని మన పుర్రెల్లో కొన్ని ఎముకలు అవసరానికి మించి పెరుగుతున్నాయని ఆస్ట్రేలియాలోని సన్‌షైన్ కోస్ట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఊరట కలిగించే విషయం ఏంటంటే దీంతో ఎలాంటి ఆరోగ్య సమస్యల్లేకపోవడం. ఒకప్పుడు ఇలాంటి ఎముక పెరుగుదల అరుదుగా.. లక్షల్లో కొందరికి జరుగుతాయని భావించినా.. స్మార్ట్‌ఫోన్ల పుణ్యమా అని ఇప్పుడు వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పుర్రె వెనుక భాగంలో తాకితే తెలిసేంత సైజుకు ఎముకలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తాము 18–30 ఏళ్ల మధ్య వయసున్న ఓ వెయ్యి మంది పుర్రెలను పరిశీలించిన తర్వాత తాము ఈ అంచనాకు వచ్చామని డాక్టర్ డేవిడ్ షహర్ అనే శాస్త్రవేత్త తెలిపారు. వైద్య వృత్తిలో 20 ఏళ్లుగా ఉన్న తాను గత పదేళ్ల నుంచి ఎముక పెరుగుదలకు సంబంధించిన కేసులను ఎక్కువగా చూస్తున్నట్లు డేవిడ్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లను వాడేటప్పుడు మనం మెడను వంచి కిందకు చూస్తూ ఉండటం సమస్యకు మూలకారణమని.. సాధారణ పరిస్థితుల్లో అతి తక్కువగా ఉపయోగించే కండరాలను తల వంచినప్పుడు వాడుతుండటంతో ఆ అదనపు బరువును తట్టుకునేందుకు, తల నిలకడగా ఉండేందుకు ఈ ఎముకల పెరుగుదల అవసరమవుతుందని చెప్పారు. మెడను, వెన్నును కలిపే కండరాలపై ఎక్కువ ఒత్తిడి పడకుండా ఉండేందుకు శరీర వ్యవస్థ ఎముకలు పెరిగేలా చేస్తుందని అంచనా.

### అంగుళం మేర పెరుగుదల..

ఈ అధ్యయనంలో కొంతమంది యువకుల ఎముకలు ఒక అంగుళం మేర పెరిగినట్లు తెలిసింది. 1996 నాటితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. గతేడాది నీల్సన్ సంస్థ జరిపిన ఒక సర్వే ప్రకారం భారత్‌లో మొబైల్‌ఫోన్ సగటు వినియోగం రోజుకు 90 నిమిషాలు. బాగా ఖరీదైన ఫోన్లు వాడే వారైతే 2 గంటల 10 నిమిషాలు వాడుతున్నారు. బ్రిటన్‌లో ఇది రెట్టింపు కంటే ఎక్కువ. కచ్చితంగా చెప్పాలంటే రోజుకు మూడున్నర గంటల పాటు యువత స్మార్ట్‌ఫోన్లను వాడుతోంది.

## జగన్‌ను రావొద్దనడం కుటిల నీతి: కర్నె

### 'కాళేశ్వరం' ప్రారంభోత్సవంపై కాంగ్రెస్ తీరు దుర్మార్గం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రావొద్దంటూ కాంగ్రెస్ నేతలు కుటిలనీతిని ప్రదర్శిస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని స్వాగతించాల్సిందిపోయి కాంగ్రెస్ నేతలు.. దుర్బుద్ధిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలోని టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతుల కాళ్లు కడిగి, కన్నీళ్లు తొలగిస్తుందని వ్యాఖ్యానించారు. దశాబ్దాల క్రితం ప్రారంభమైన చాలా ప్రాజెక్టుల పనులు ఇంకా కొనసాగుతున్నాయని కానీ దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన ప్రాజెక్టు కాళేశ్వరమేనని తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని స్వాగతించాల్సింది పోయి కాంగ్రెస్ నేతలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావొద్దంటూ ప్రధాని మోదీకి గతంలో టీపీసీసీ లేఖ రాసిందని, ఈ విధంగా కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రతిష్టతను దిగజార్చుతున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టు నిర్వాసితులపై కాంగ్రెస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు భరోసా ఇస్తూ ప్యాకేజీ ఇచ్చినా.. కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులు నేటికీ న్యాయం కోసం తిరుగుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఆ పార్టీకి విమర్శలు మాత్రమే చేయడం తెలుసన్నారు. కాంగ్రెస్ నేతలు రాజనీతిని ప్రదర్శించడం లేదని.. వరుస ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్‌కు ఏకపక్ష తీర్పునిచ్చినా వారి వ్యవహార శైలి మారడం లేదన్నారు.

## 19లోగా ఖాళీ చేస్తాం

### సచివాలయ భవనాలపై తెలంగాణ సీఎస్‌కు ఏపీ సీఎస్ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాల కోసం హైదరాబాద్‌లో కేటాయించిన సచివాలయ భవనాలను ఈ నెల 19లోగా ఖాళీ చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి లేఖ రాశారు. ఏపీ సచివాలయం అమరావతికి తరలిపోవడంతో నాలుగేళ్లుగా ఈ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భవనాలు తమకు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా, ఏపీలోని కొత్త ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో భవనాలను తెలంగాణకు అప్పగిస్తూ గవర్నర్ నరసింహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు రాష్ట్ర అవసరాలకు తగ్గట్లు ప్రస్తుత సచివాలయం ఉన్న ప్రాంతంలోనే కొత్త సచివాలయం నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 27న కొత్త సచివాలయ నిర్మాణానికి భూమి పూజ జరపాలని సీఎం కేసీఆర్ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. దీనికి వీలుగా ఏపీ సచివాలయ భవనాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది.

## 'సోషల్' వదంతులను నమ్మొద్దు

### ప్రజలకు డీజీపీ మహేందర్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కిడ్నాపర్లు, దొంగలు ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లు, వదంతులను నమ్మొద్దని డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజులుగా వాట్సాప్, ఫేస్‌బుక్ ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా దొంగల గ్యాంగ్‌లు తిరుగుతున్నట్లు మెసేజ్‌లు, ఫొటోలు ప్రచారమవుతున్నాయని, వీటిలో నిజం లేదని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రజలు నేరుగా 100 నంబర్‌కు ఫోన్ చేయడంతోపాటు, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం లేదా ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల రక్షణకు తెలంగాణ పోలీసులు గట్టి చర్యలు చేపడుతున్నారని, ఈ విషయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావొద్దని వివరించారు.

## ఏపీ సీఎం జగన్‌ను కలిసిన కొండా



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండా రాఘవరెడ్డి శనివారం ఢిల్లీలో కలిశారు. ఏపీ సీఎంగా ఎన్నికైన సందర్భంగా జగన్‌ను శాలువాతో సత్కరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## సచివాలయ భవనాల కూల్చివేతను ఒప్పుకోం: రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత సచివాలయంలోని భవనాలను కూల్చి మళ్లీ అక్కడే కొత్త భవనాలు నిర్మించడాన్ని మేం ఒప్పుకోమని, ఇలా చేయడం వల్ల ప్రజాధనం వృథా తప్ప ఏమీ ఒరగదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వందేళ్లు మన్నిక ఉండే సచివాలయ భవనాలను వాస్తు పిచ్చితో కేవలం 20 ఏళ్లకే కూల్చాలనుకోవడం సరికాదన్నారు. సచివాలయం కూల్చివేతను అడ్డుకునేందుకు అవసరమైతే మళ్లీ కోర్టుకు వెళ్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వ సొమ్ముతో టీఆర్ఎస్ ప్రభుత్వం జల్సాలు చేయాలనుకుంటోందని, కాంట్రాక్టర్ల కోసమే సీఎం కేసీఆర్ సచివాలయాన్ని కూల్చివేయాలనుకుంటున్నట్లు ఆరోపించారు. కేసీఆర్ గొప్పగా చెప్పే గురుకులాలకు కొత్త భవనాలు ఎందుకు మంజూరు చేయడంలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇక్కడి నుంచే పాలన జరిగిందని, సచివాలయ భవనాలకు ఇబ్బందులుంటే మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. తక్షణమే సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

## కాలుష్యానికి తప్పదు తగిన 'మూల్యం'

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణకు నిర్దేశించిన చట్టాల్లోని నిబంధనలు పాటించని కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) హెచ్చరించింది. అలాంటి పరిశ్రమల నుంచి 'పర్యావరణ పరిహారం' వసూలు చేస్తామని పీసీబీ కార్యదర్శి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి ఈ అధికారాన్ని కల్పిస్తూ గత ఫిబ్రవరిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలతోపాటు 'పర్యావరణ పరిహారం' వసూలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# 18న ఐఆర్‌పై ప్రకటన!

- చెల్లింపు సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వ పరిశీలన
- 18న కేబినెట్ భేటీ తర్వాత ప్రకటించే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆశలు
- ఒక శాతం ఐఆర్‌పై ఏటా రూ. 300 కోట్ల భారం
- ఏడాది గడిచినా నివేదిక సమర్పించని పీఆర్సీ
- ప్రస్తుతానికి ఫిట్‌మెంట్ ప్రకటన లేనట్లే!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. మధ్యంతర భృతి చెల్లింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుపుతోంది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ నెల 18న మంగళవారం మధ్యాహ్నం జరగనున్న కేబినెట్ సమావేశం అనంతరం ఐఆర్‌పై ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలా లేక ఫిట్‌మెంట్‌పై ప్రకటన చేయాలా? అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మధ్యంతర భృతి చెల్లింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై సీఎం కేసీఆర్ ఇటీవల రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో సమావేశమై సుదీర్ఘ కసరత్తు చేశారని సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యంతర భృతి చెల్లింపునకే ప్రభుత్వం మొగ్గుచూపే అవకాశాలున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక అవసరాలు, ఆదాయ వనరులను దృష్టిలో పెట్టుకొని ఎంత శాతం మేరకు మధ్యంత భృతి ప్రకటించాలన్న అంశంపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు 27 శాతం మధ్యంతర భృతిని ప్రకటించడంతో తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. ఏపీలో 27 శాతం ఐఆర్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో అంతకు మించి ప్రకటించవచ్చని ఉద్యోగ వర్గాలు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. వాస్తవానికి 2018 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మధ్యంతర భృతిని ప్రకటిస్తామని అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. దీనికి సరిగ్గా ఒక రోజు ముందు అంటే 2018 జూన్ 1న ఐఆర్ ప్రకటనను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేతన సవరణ సంఘం (పీఆర్సీ) చైర్మన్, సభ్యులతో సీఎం కేసీఆర్ సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నారు. పీఆర్సీ నివేదిక సమర్పించడానికి ముందే ఐఆర్ ప్రకటించడం సరికాదనే అభిప్రాయం రావడంతో సీఎం వెనక్కి తగ్గారు. ఉద్యోగులకు ఐఆర్ చెల్లించడానికి వీలుగా వెంటనే నివేదిక సమర్పించాలని అప్పట్లో పీఆర్సీ చైర్మన్, సభ్యులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉద్యోగులకు ఒక శాతం ఐఆర్ చెల్లిస్తే ఏడాదికి రూ. 300 కోట్లు, 10 శాతం ఇస్తే రూ. 3,000 కోట్లు, 20 శాతం ఇస్తే రూ. 6,000 కోట్ల వ్యయం కానుందని అప్పట్లో ఆర్థికశాఖ అధికారులు సీఎంకు నివేదించారు. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 27 శాతం ఐఆర్ ప్రకటిస్తే ఏటా ప్రభుత్వంపై రూ. 8,100 కోట్ల భారం పడే అవకాశాలున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా ఉందని, ఆదాయం సమృద్ధిగా పెరుగుతోందని రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఇటీవల సచివాలయంలో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఐఆర్ ప్రకటన రావొచ్చని ఉద్యోగ సంఘాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

### పీఆర్సీ నివేదిక ఆలస్యం?

రిటైర్డ్ ఐఏఎస్ సీఆర్ బిస్వాల్ నేతృత్వంలో మహమ్మద్ అలీ రఫత్, ఉమామహేశ్వర్‌రావుతో 2018 మే 18న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర తొలి పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు చేసింది. మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదు. గత 9 నెలలుగా రాష్ట్రంలో వరుస ఎన్నికలు జరగడంతో సుదీర్ఘకాలం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాల్సి వచ్చింది. దీంతో మధ్యంతర భృతి, వేతన సవరణ అంశాలు మరుగునపడ్డాయి. ఈ నేపథ్యంలో పీఆర్సీ కమిటీ కాలపరిమితిని ప్రభుత్వం వరుసగా పొడిగించాల్సి వచ్చింది. దాదాపు ఎన్నికలన్నీ ముగియడంతో ప్రభుత్వం మళ్లీ పీఆర్సీ నివేదికపై దృష్టి సారించే అవకాశాలున్నాయి. పీఆర్సీ నివేదిక ఆలస్యం కావడంతో ప్రస్తుతానికి ప్రభుత్వం ఐఆర్ చెల్లింపునకు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. 2018 జూలై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ అమలు కావాల్సి ఉంది. తక్షణమే 43 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి గత జూలై నుంచి రావాల్సిన బకాయిలతో సహా చెల్లించాలని తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వర్కర్ల జేఏసీ తాజాగా డిమాండ్ చేసింది.

### పరిశీలనలో రిటైర్మెంట్ వయసు పెంపు!

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 61 ఏళ్లకు పొడిగిస్తామని గత డిసెంబర్‌లో జరిగిన రాష్ట్ర శాసనసభ మధ్యంతర ఎన్నికల సందర్భంగా అధికార టీఆర్ఎస్ హామీ ఇచ్చింది. ఈ నెల 18న జరగనున్న మంత్రివర్గ భేటీలో రిటైర్మెంట్ వయసు పెంపు ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. సీపీఎస్ రద్దు చేయాలని ఇటీవల ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రంలో సైతం ఇదే అంశాన్ని పరిశీలించవచ్చని ఉద్యోగ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..!

- ఈ విధానంతో ప్రభుత్వానికి నష్టమే తప్ప లాభం లేదు
- మీడియా సమావేశంలో టీఎన్జీవోస్ నేతలు రవీందర్‌రెడ్డి, మమత



శనివారం విలేకరులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి. చిత్రంలో మమత తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ పథకం అమలుతో ప్రభుత్వానికి నష్టమే తప్ప లాభం లేదని స్పష్టం చేసింది. పాత పద్ధతిలోనే ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వాలని కోరింది. శనివారం నాంపల్లిలోని టీఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో 18 అంశాలపై తీర్మానాలు చేశారు. తీర్మానాల ప్రతిని ప్రభుత్వానికి సమర్పించి వీటిని మంజూరు చేయించుకునేలా ఒత్తిడి తీసుకురావాలని సమావేశం నిర్ణయించింది. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కె.రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ వి.మమత మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు 43 శాతం ఐఆర్ ఇవ్వాలని, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 1,200 మంది తెలంగాణ ఉద్యోగులను వెంటనే వెనక్కి రప్పించాలని, ఇరు ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### బడిబాట తర్వాతే హేతుబద్ధీకరణ చేపట్టాలి

బడిబాట కార్యక్రమం తర్వాతే పాఠశాలల హేతుబద్ధీకరణను చేపట్టాలని ప్రభుత్వానికి రవీందర్‌రెడ్డి, మమత విజ్ఞప్తి చేశారు. పాలనలో భాగంగా చేపట్టే సంస్కరణలకు ఉద్యోగులు పూర్తిగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచాలని కోరారు. వెల్‌నెస్ సెంటర్లను అన్ని జిల్లాల్లో విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు. 010 పద్దు కింద గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ, యూనివర్సిటీలు, ఎయిడెడ్ సంస్థల్లోని ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని కోరారు. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి జూన్, జూలై మాసాల్లో సాధారణ బదిలీలకు అనుమతించాలన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని సర్వే నంబర్ 36లో ఏపీ ఎన్జీవోలకు కేటాయించిన ఇళ్లస్థలాలను టీఎన్జీవోలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### రెండేళ్లకే పదోన్నతి కల్పించాలి...

పదోన్నతి కోసం ప్రస్తుతమున్న మూడేళ్ల సర్వీసును రెండేళ్లకు కుదించాలని రవీందర్‌రెడ్డి, మమత కోరారు. రెవెన్యూ శాఖను మరో శాఖలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు అదనంగా 15 శాతం పెన్షన్ మంజూరు చేయాలని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందున వాళ్లకు తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సెలవు ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు సరిపడా క్యాడర్‌ను మంజూరు చేయాలన్నారు. ఈ అంశాలను సీఎం కె.చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు.

## భావప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తున్నారు: దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: భావప్రకటనా స్వేచ్ఛను అణచివేసే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల అదృశ్యంపై సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారనే పేరుతో యూత్ కాంగ్రెస్ నేతలపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని, వాటిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వాస్తవాలను రాజకీయంగా ఎదుర్కోలేక టీఆర్ఎస్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగానే యూత్ కాంగ్రెస్ నేతలు గ్రాఫిక్ డిజైన్ చేసి సోషల్ మీడియాలో పెట్టారని, ఈ పోస్టింగ్‌లో ఎవరినీ రెచ్చగొట్టే అంశాలు లేవని, ప్రజలను చైతన్యపరిచే విధంగా ఉన్న ఈ పోస్టింగ్ భావప్రకటన స్వేచ్ఛలో భాగంగానే పెట్టారన్నారు. మిస్సింగ్ కేసుల గురించి డీజీపీ ట్వీట్ చేశారని, గణాంకాలతో ఉమెన్ సేఫ్టీ ఇన్‌చార్జి స్వాతి లక్రా సైతం పత్రికా ప్రకటన విడుదల చేశారని గుర్తు చేశారు. ప్రజల రక్షణ కోసం పనిచేయాల్సిన పోలీసులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధుల రక్షణ కోసం మాత్రమే పనిచేయకూడదన్నారు. అనవసరంగా కేసులు పెట్టి భవిష్యత్తును దెబ్బతీయవద్దని, వెంకట్ గురజాల మరో ఇద్దరి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దని కోరారు. అంతకుముందు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌లతో కలిసి డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి యువజన కాంగ్రెస్ నేతలపైన, సోషల్ మీడియా విభాగంలో పనిచేసే వారిపై పెట్టిన తప్పుడు కేసుల్ని తక్షణమే విరమించుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## తగ్గనున్న సాధారణ వర్షపాతం

### నైరుతి రుతు పవనాల ఆలస్యమే కారణం

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతంలో 60 నుంచి 70 శాతం మేర తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వెల్లడించింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థతో కలిసి రాష్ట్రంలో వర్షపాతం, వ్యవసాయ సంబంధిత అంశాలపై శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేసింది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే 60 నుంచి 70 శాతం అధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్టులో దక్షిణ తెలంగాణతో పోలిస్తే ఉత్తర తెలంగాణలో 10 నుంచి 20 శాతం మేర అధిక వర్షపాతం నమోదవుతుందని రెండు సంస్థలు అంచనా వేశాయి. నైరుతి రుతు పవనాలు ఆలస్యమవుతుండటంతో కృష్ణా బేసిన్ పరిధిలోని రిజర్వాయర్లకు వరద ఆలస్యమయ్యే అవకాశం ఉంది. రైతులు వర్షాధార పంటలు వెంటనే వేయకుండా.. దుక్కులు సిద్ధం చేసుకోవాలని మెట్ట పరిశోధనా సంస్థ అధికారులు సూచించారు. కనీసం 50 నుంచి 60 మి.మీ వర్షపాతం నమోదైన తర్వాతే సోయా, జొన్న, కంది, పెసర, పత్తి తదితర పంటలు వేసుకోవాలని తెలిపారు.

### జూన్ నెలాఖరులోగా పెసర, జొన్న..

జూన్ నెలాఖరులోగా పెసర, జొన్న, జూలై 15 వరకు మొక్కజొన్న, పత్తి, సోయా, జూలై 31 వరకు కంది, ఆగస్టు 15 వరకు ఆముదం పంటలు వేయాలని అధికారులు పేర్కొన్నారు. వరి నార్ల విషయంలో దీర్ఘకాలిక రకాలకు జూన్ 20 వరకు, మధ్యకాలిక రకాలకు జూలై 10, స్వల్పకాలిక రకాలకు జూలై 31 వరకు నార్లు పోసుకోవాలని సూచించారు. సోయా చిక్కుడు, మొక్కజొన్న పంటల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

# ఏపీ పోలీసులకు.. వీక్లీఆఫ్‌లు వచ్చేశాయ్!

### ముందుగా విశాఖ సిటీలో అమలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన వీక్లీఆఫ్ హామీ అమల్లోకి వచ్చేసింది. విశాఖ సిటీలో శనివారం నుంచి దీనికి శ్రీకారం చుట్టారు. విశాఖతోపాటు మరికొన్ని చోట్లా వీక్లీఆఫ్ అమలులోకి రాగా.. దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తెచ్చేందుకు పోలీసు శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీని అమలుచేసేందుకు అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే ఆయన చర్యలకు ఉపక్రమించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే శాంతిభద్రతల ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో డీజీపీ డి.గౌతమ్ సవాంగ్ ఈ నెల 4న కమిటీ ఏర్పాటుచేశారు. వీక్లీఆఫ్ అమలులో వచ్చే ఇబ్బందులను ఈ కమిటీ వారం రోజులపాటు అధ్యయనం చేసింది. అనంతరం ఈ నెల 10న మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ సవాంగ్‌తో కమిటీ సమావేశమై వీక్లీఆఫ్ అమలుకు నిర్ణయించారు. ఇందుకు సిబ్బంది కొరత ఇబ్బంది కాదని తేల్చారు. ముందుగా విశాఖ నగర పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా శనివారం ఉత్తర్వులివ్వడంతో నగరంలోని 2,147 మంది సివిల్, 850 ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు వీక్లీఆఫ్ అమలులోకి వచ్చింది.

# 'నీట్' రాష్ట్ర స్థాయి ర్యాంకులు విడుదల

- తొలి వేయి ర్యాంకుల్లో 43 మంది రాష్ట్ర విద్యార్థులు
- మెడికల్, డెంటల్ ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల



సాక్షి, హైదరాబాద్: వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) రాష్ట్ర స్థాయి ర్యాంకులను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. కేటగిరీల వారీగా కటాఫ్ మార్కుల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 33,936 మంది రాష్ట్రం నుంచి నీట్–2019లో అర్హత సాధించారు. ఎంబీబీఎస్, దంత వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది మే 5న జాతీయ స్థాయిలో నీట్ అర్హత పరీక్షను నిర్వహించగా, జూన్ 5న జాతీయ స్థాయిలో ఫలితాలు ప్రకటించారు. జాతీయ స్థాయిలో ఏడో ర్యాంకు, మహిళ విభాగంలో ఒకటో ర్యాంకు సాధించిన జి.మాధురిరెడ్డి.. 720 మార్కులకు గాను 695 మార్కులతో తెలంగాణ టాపర్‌గా నిలిచింది. తాజాగా ప్రకటించిన రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో మొదటి వేయి ర్యాంకుల్లో 43 మంది తెలంగాణకు చెందిన విద్యార్థులు ఉన్నారు. కాగా శనివారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి ర్యాంకుల వివరాలను అభ్యర్థుల వారీగా కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పెట్టినట్లు వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాలకు వీలుగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసేందుకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించింది. అన్‌రిజర్వుడు కోటా కింది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అర్హులని.. ప్రస్తుత ర్యాంకుల జాబితాలో వారు కూడా చేరితే.. ర్యాంకుల్లో మార్పు ఉంటుందని తెలిపింది. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాపై పూర్తి స్పష్టత వస్తుందని ప్రకటించింది.

### ర్యాంకులిలా..

శనివారం విడుదల చేసిన రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో.. మొదటి వేయి ర్యాంకుల లోపు తెలంగాణకు చెందిన 43 మంది విద్యార్థులు ఉన్నారు. 2 వేల ర్యాంకుల్లోపు 69, 5 వేల ర్యాంకుల్లోపు 149, 10 వేల ర్యాంకుల్లోపు 289, 20 వేల ర్యాంకుల్లోపు 600, 25 వేల ర్యాంకుల్లోపు 793, 30 వేల ర్యాంకుల్లోపు 967, 35 వేల ర్యాంకుల్లోపు 4,148 మంది అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. ఇదిలా ఉంటే 720 మార్కులకు గాను 107 మార్కులను ఈ ఏడాది నీట్ కటాఫ్‌గా నిర్ణయించిన విషయం తెలిసిందే. జనరల్ కేటగిరీలో 134 మార్కులు, దివ్యాంగులకు 120, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ విద్యార్థులకు 107 మార్కులు కటాఫ్‌గా నిర్ణయించి ర్యాంకులు ప్రకటించారు.

**రాష్ట్ర స్థాయిలో టాప్ 10 విద్యార్థులు!**

| విద్యార్థి | మార్కులు | ర్యాంకు |
|---|---|---|
| జి.మాధురిరెడ్డి | 695 | 7 |
| ఎంపటి కుశ్వంత్ | 685 | 55 |
| ఆరె అక్షయ్ | 685 | 59 |
| నీల వంశీకృష్ణ | 685 | 65 |
| నెరవటి గగన్ | 680 | 109 |
| బుర్ర శివ శ్రీవాస్తవ | 676 | 135 |
| సార్థక్ జైన్ | 675 | 145 |
| అవినాశ్‌రెడ్డి తుమ్మూరు | 675 | 170 |
| అనీల జాడి | 672 | 198 |
| హేమంత్‌రెడ్డి గంగాడి | 671 | 215 |

# 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**కష్టమైనా సాధించేందుకు ఐక్యంగా కృషి చేద్దాం • నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ • హాజరైన సీఎంలు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు**

**న్యూఢిల్లీ:** 2024 నాటికి దేశాన్ని 5 లక్షల కోట్ల డాలర్ల(సుమారు రూ.35 కోట్ల కోట్లు) విలువైన ఆర్థిక వ్యవస్థగా మార్చడం సాధించగల లక్ష్యమేనని ప్రధాని మోదీ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రాలు స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)ని జిల్లా స్థాయి నుంచే పెంచేందుకు తమ శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. శనివారం ఆయన నీతి ఆయోగ్ ఐదో పాలక మండలి సమావేశాల్లో ప్రారంభోపన్యాసం చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో తలెత్తిన కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదరికం, నిరుద్యోగం, కరువు, వరదలు, కాలుష్యం, అవినీతి, హింస తదితర సమస్యలపై సమష్టి పోరాటం సాగించాలని నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని పిలుపునిచ్చారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**ఆర్థిక వ్యవస్థ రెట్టింపు కావాలి**

'2019 మార్చి చివరికి దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 2.75 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. 2024 కల్లా దీనిని 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి మార్చడం కష్టమైనప్పటికీ సాధించగలిగిన లక్ష్యమే. జీడీపీని జిల్లా స్థాయి నుంచే పెంచేందుకు రాష్ట్రాలు తమ శక్తియుక్తులను ఉపయోగించాలి. దీంతోపాటు దేశీయ ఎగుమతులు భారీగా పెరగాల్సి ఉంది'అని మోదీ అన్నారు. 'సాధికారిత, సులభ జీవనం ప్రతి భారతీయుడికి అందుబాటులోకి తేవాలి. స్వల్ప, దీర్ఘ కాలిక లక్ష్యాలను అధిగమించేందుకు ఉమ్మడిగా ముందుకు సాగాలి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడిగా చేపట్టాల్సిన స్వచ్ఛ భారత్ అభియాన్, పీఎం ఆవాస్ యోజన ఇందుకు ఉదాహరణ'అని తెలిపారు. 'మహాత్మాగాంధీ 150వ వర్ధంతికి లక్ష్యంగా పెట్టుకున్న వాటిని అక్టోబర్ 2వ తేదీకి సాధించాలి, 75వ స్వాతంత్ర్య దినోత్సవానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను 2022 కల్లా అధిగమించేందు కృషి జరగాలి' అని కోరారు.

**పర్ డ్రాప్, మోర్ క్రాప్**

'దేశంలోని పలు ప్రాంతాల్లో కరువు వంటి పరిస్థితులున్నందున వీటిని ఎదుర్కొనేందుకు ప్రతి నీటి బొట్టుకు మరింత ఫలసాయం (పర్ డ్రాప్, మోర్ క్రాప్) విధానాన్ని అభివృద్ధి చేయాలి. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం చేపలపెంపకం, పశుపోషణ, ఉద్యానపంటలు, పూలు, కూరగాయల సాగు రైతులు చేపట్టేలా ప్రోత్సహించాలి. పీఎం–కిసాన్ వంటి రైతు పథకాలు సకాలంలో ఉద్దేశించిన రైతులకు అందాలి'అని సూచించారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ పెట్టుబడులు, రవాణా సౌకర్యాలు, మార్కెట్ సదుపాయం కల్పించేందుకు కృషి జరగాలని ప్రధాని అన్నారు. ఆహారధాన్యాల ఉత్పత్తి కంటే ఫుడ్ ప్రాసెసింగ్ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ నినాదం సాధనలో నీతి ఆయోగ్ పాత్ర ఎంతో కీలకమన్నారు. అభివృద్ధి లక్షిత(అస్పిరేషనల్) 115 జిల్లాల్లో ఇంకా కొన్ని రంగాల్లో వెనుకబాటును అధిగమించేందుకు గుడ్ గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రులను కోరారు.



నీతి ఆయోగ్ సమావేశంలో సీఎంలు, గవర్నర్లు, ఉన్నతాధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ

**హాజరుకాని ముగ్గురు సీఎంలు**

కరువు పరిస్థితులు, వ్యవసాయ సంక్షోభం, వాన నీటి సంరక్షణ, ఖరీఫ్ పంటల సన్నద్ధత, అభివృద్ధి లక్షిత జిల్లాల పథకం, వ్యవసాయరంగంలో మార్పులు, వామపక్ష తీవ్రవాదం వంటి ఐదు ప్రధానాంశాలపై చర్చించేందుకు ఏర్పాటైన ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆర్థిక అధికారాలు లేని నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కాబోనంటూ ఇటీవల ప్రధానికి లేఖ రాసిన బెంగాల్ సీఎం మమత బెనర్జీ రాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం పనుల్లో బిజీగా ఉన్నందున తెలంగాణ సీఎం కేసీఆర్ రాలేదు. ఆరోగ్య సమస్యలతో పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ రాలేదు.

**కాంగ్రెస్ సీఎంలకు మన్మోహన్ నిర్దేశం**

నీతి ఆయోగ్ సమావేశాల సందర్భంగా ప్రస్తావించాల్సిన అంశాలపై మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్, రాజస్తాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి సీఎంలు కమల్‌నాథ్, అశోక్ గెహ్లోత్, కుమారస్వామి, భూపేశ్ బఘేల్, నారాయణ స్వామి హాజరయ్యారు.

**టాప్-10 దేశాల ఆర్థిక వ్యవస్థలు (2019, 2020)**




## సర్పంచిలకు ప్రధాని మోదీ లేఖ

**వాన నీటి సంరక్షణ చేపట్టాలని పిలుపు**

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం గ్రామీణప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని రాబోయే వర్షాకాలంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ గ్రామ సర్పంచిలను కోరారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న గ్రామ సర్పంచిలకు గత వారం లేఖలు రాశారు. ప్రధాని సొంత నియోజకవర్గం యూపీలోని వారణాసిలో ఉన్న 637 గ్రామ సర్పంచిలకు ఈ లేఖలు అందాయి. ఉదాహరణకు, సోన్‌భద్ర సర్పంచికి రాసిన లేఖలో.. 'ప్రియమైన సర్పంచి గారికి నమస్కారం, మీరు, పంచాయతీలోని సోదరసోదరీమణులంతా ఆరోగ్యంతో ఉన్నారని భావిస్తున్నాను. త్వరలో వర్షాకాలం రానుంది. దేవుని దయవల్ల మనకు మంచివానలు కురుస్తున్నాయి. వర్షం నీటిని సంరక్షించుకునేందుకు మనం ప్రయత్నాలు ప్రారంభించండి. మీరు స్వయంగా ముందుగా గ్రామంలో పర్యటించి నీటి సంరక్షణకు ఉన్న అవకాశాలను గుర్తించండి' అని అందులో ఉంది. 'మొదటగా గ్రామసభను సమావేశ పరిచి, ఈ లేఖను అందరికీ చదివి వినిపించాలి. అనంతరం వాననీటి సంరక్షణపై గ్రామసభలో చర్చ జరగాలి. అందరూ కలిసి చెక్ డ్యాములు, చెరువులు, కుంటలు నిర్మించుకోవాలి' అని ఆ లేఖలో మోదీ కోరారు. నీటి వనరులతో పంటలు సమృద్ధిగా పండటంతోపాటు కరువు కూడా ఉండదని తెలిపారు. ప్రధాని సంతకంతో కూడిన హిందీలో ఉన్న ఈ లేఖలను ఆయా జిల్లాల మేజిస్ట్రేట్లు, కలెక్టర్లు ఆయా గ్రామ సర్పంచిలకు అందజేస్తారు. ఇప్పటికే ఈ లేఖలు అందుకున్న గ్రామాల్లో వీటిలో పేర్కొన్న అంశాలపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది.

## ప్రధాని అధ్యక్షతన నేడు అఖిలపక్షం

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** 17వ లోక్‌సభ మొట్టమొదటి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నేడు కేంద్రం అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ కార్యకలాపాలు, కీలకమైన బిల్లులు సభ ఆమోదం పొందేందుకు సహకరించాల్సిందిగా ప్రతిపక్షాలను కోరేందుకు ఉద్దేశించిన ఈ సమావేశం ఆనవాయితీ ప్రకారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరగనుంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రభుత్వం సాధారణ బడ్జెట్‌తోపాటు ఆర్థిక బిల్లులతోపాటు కీలకమైన ట్రిపుల్ తలాక్ వంటి బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది. అయితే, ట్రిపుల్ తలాక్ బిల్లులోని కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ వాటిని తొలగిస్తేనే బిల్లు ఆమోదానికి సహకరిస్తామని ఇంతకుముందే స్పష్టం చేసింది. 545 మంది సభ్యులుండే లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయేకి 353 మంది సభ్యుల మద్దతుంది. అయితే, 245 సీట్లున్న రాజ్యసభలో ఎన్‌డీయే బలం 102 మాత్రమే. దీంతో ఎగువసభలో కీలక బిల్లులు గట్టెక్కాలంటే ప్రతిపక్షాల సహకారం తప్పనిసరిగా మారింది. ఈ నెల 7వ తేదీన కేంద్రమంత్రులు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ జోషి, అర్జున్ మెఘావత్ సమావేశాల్లో సహకారం అందించాల్సిందిగా యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం కూడా జరగనుంది.

## అమెరికా వస్తువులపై సుంకాల పెంపు

**28 వస్తువులపై నేటి నుంచే అమలు**



**న్యూఢిల్లీ:** అమెరికా నుంచి దిగుమతయ్యే కొన్ని వస్తువులపై భారత్ భారీగా సుంకాలు పెంచింది. భారత్ నుంచి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై ఇటీవల అమెరికా ప్రభుత్వం పన్నులు పెంచిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా భారత్ అమెరికా నుంచి దిగుమతయ్యే బాదం, పప్పుధాన్యాలు, వాల్‌నట్ తదితర 28 వస్తువులపై పన్ను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆదివారం నుంచే ఈ పెంపు అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలో తయారయ్యే, అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులకు ఇది వర్తిస్తుందని తెలిపింది. వాల్‌నట్‌పై 30 శాతం నుంచి 120 శాతానికి, పప్పులపై 30 నుంచి 70 శాతానికి పన్ను పెరగనుంది. ఫలితంగా ఈ 28 వస్తువులపై పన్ను భారం పెరిగి, దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ పెంపుతో భారత్‌కు 217 మిలియన్ డాలర్ల ఆదాయం అధికంగా సమకూరనుంది. కాగా, అమెరికా ప్రభుత్వం చర్యతో భారత్‌కు 2.4కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లింది.

## మురికిని శుభ్రం చేస్తూ ఏడుగురి దుర్మరణం

**వడోదర:** హోటల్‌కు చెందిన మురికిని భూగర్భ కాలువలో శుభ్రపరిచే సమయంలో విషవాయువులు పీల్చుకొని ఏడుగురు మృతి చెందిన ఘటన గుజరాత్‌లోని వడోదరలో జరిగింది. నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న దర్శన్ హోటల్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుల్లో నలుగురు పారిశుధ్య కార్మికులు, ముగ్గురు హోటల్ సిబ్బంది ఉన్నారు. శుభ్రం చేయడానికి లోపలికి దిగిన నలుగురు కార్మికుల్లో ఒకరు బయటకు రాలేకపోవడంతో అతన్ని తీసుకురావడానికి వెళ్లిన మిగిలిన వారు కూడా ఊపిరాడక మరణించారని జిల్లా కలెక్టర్ కిరణ్ జావేరి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 4 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించింది. హోటల్ యజమాని హసన్ అబ్బాస్ ఇస్మాయిల్ బొరానియా పరారీలో ఉన్నాడు. అతనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది.



సిరియాలో జిహాదీల అధీనంలోని ఇడ్లిబ్ ప్రావిన్సు ఫతీరా గ్రామంలో సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఓ పౌరుడు

## ఇరాన్‌ను వదలం: ట్రంప్

**వాషింగ్టన్:** 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' ప్రాంతంలో రెండు చమురు నౌకలపై ఇరానే దాడిచేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. ఇరాన్ ఉగ్రవాద దేశంగా మారిందన్నారు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ..'ఇరానే ఈ దాడులు చేసింది. వాళ్లు(ఇరాన్) నిజంగా చాలాపెద్ద తప్పు చేశారు. దీన్ని మేం అంత సులభంగా వదిలిపెట్టబోం. ఇరాన్‌కు అర్థమయ్యే భాషలో గట్టిగా జవాబిస్తాం. అణు ఒప్పందం విషయంలో వారిని చర్చలకు ఒప్పిస్తాం' అని తెలిపారు. ప్రపంచ చమురు రవాణాలో మూడోవంతు సాగే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయలేదన్నారు.

## భార్యా బాధితుల రావి పూర్ణిమ

**ఔరంగాబాద్ (మహారాష్ట్ర):** భార్యల నుంచి వేధింపులను ఎదుర్కొనే భర్తలకు తగిన చట్టాలను తేవాలంటూ డిమాండ్ చేస్తున్న 'పత్ని పీడిత్ పురుష్ సంఘటన'(భార్యల వేధింపులకు గురైన భర్తల సంఘం) సంస్థ సభ్యులు శుక్రవారం రావి పూర్ణిమను జరుపుకున్నారు. సాధారణంగా ఇక్కడ మహిళలు తమ భర్తలు దీర్ఘకాలం జీవించాలంటూ రావి చెట్టుకు దారాలను కడతారు. దానికి భిన్నంగా పురుషులు గుంపుగా రావి చెట్టు చుట్టూ తిరుగుతూ 'పింపాల్(రావి) పూర్ణిమ'జరుపుకున్నారు. మహిళలు బలహీనులని భావించడం వల్లే చట్టాలువారికి అనుకూలంగా ఉన్నాయని కాని వాస్తవంలో మాత్రం భార్యలే భర్తలను హింసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఆరు రాజ్యసభ సీట్లకు 5న ఉపఎన్నికలు

**న్యూఢిల్లీ:** ఖాళీ అయిన 6 రాజ్యసభ స్థానాలకు జూలై 5న ఉపఎన్నికలు నిర్వహిస్తామని ఈసీ తెలిపింది. ఆరింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తున్నా.. నోటిఫికేషన్లు విడివిడిగా జారీచేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అమిత్ షా, స్మృతీ ఇరానీ గెలవడంతో గుజరాత్‌లో రెండు సీట్లు ఖాళీ అయ్యాయి.కేంద్ర మంత్రి రవిశంకర్(బిహార్), బీజేడీ నేతలు అచ్యుతానంద సామంత(ఒడిశా), ప్రతాప్ దేబ్(ఒడిశా), సౌమ్యరంజన్ పట్నాయక్(ఒడిశా)లు ఖాళీచేసిన రాజ్యసభ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి.

# చర్చలకు సీఎం ఆసుపత్రికి రావాలి

- పశ్చిమబెంగాల్‌లో ఆందోళన చేస్తున్న డాక్టర్ల డిమాండ్
- మమత ప్రతిపాదనకు నో
- అన్ని డిమాండ్లను అంగీకరిస్తున్నా: మమతా బెనర్జీ



కోల్‌కతాలోని ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగిన జూనియర్ డాక్టర్లు

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో తమకు రక్షణ కల్పించాలని వైద్యులు, జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వైద్యులను బుజ్జగించేందుకు సీఎం మమతా బెనర్జీ చేసిన ప్రయత్నం ఫలించలేదు. తమ సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రే స్వయంగా కోల్‌కతాలోని నీల్‌రతన్ సిర్కర్(ఎన్ఆర్ఎస్) వైద్యకళాశాలకు రావాలని కోరారు. 'సీఎంతో సమావేశానికి మా ప్రతినిధులను పంపడం లేదు. ఎందుకంటే వారి భద్రత విషయంలో మాకు భయాందోళనలు ఉన్నాయి. కాబట్టి మా వైద్యుడిపై ఓ రోగి బంధువులు దాడి చేసిన ఎన్ఆర్ఎస్ ఆసుపత్రికి సీఎంను ఆహ్వానిస్తున్నాం' అని ఓ డాక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంవైపు నుంచి ప్రయత్నాలు నిజాయితీగా సాగడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులపై దాడులు జరగకుండా భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్‌లో 300 మందికిపైగా డాక్టర్లు రాజీనామా చేశారు. వీరికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులు సంఘీభావం తెలియజేశారు.

**కేంద్రం ఆందోళన..**

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ హింస, డాక్టర్ల ధర్నాపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రెండు ఘటనలపై వేర్వేరుగా నివేదిక సమర్పించాలని కేంద్ర హోంశాఖ శనివారం బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'మాకు అందిన నివేదికల ప్రకారం 2016లో పశ్చిమబెంగాల్‌లో 509 హింసాత్మక ఘటనలు నమోదుకాగా, 2018 నాటికి ఆ సంఖ్య 1,035కు చేరుకుంది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఏకంగా 773 హింసాత్మక ఘటనలు జరిగాయి. అదేసమయంలో ఇలాంటి దుర్ఘటనల్లో చనిపోయినవారి సంఖ్య 2018 నాటికి అది 96కు పెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 26 మంది హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు' అని కేంద్ర హోంశాఖ తెలిపింది. బెంగాల్‌లో హింసను అరికట్టడానికి ఏమేం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదిక పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి సీఎం మమతా బెనర్జీకి లేఖ రాశారు.

**ప్రత్యేక చట్టం రూపొందించండి..**

ఆసుపత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రత్యేకంగా చట్టాలను రూపొందించే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ రాష్ట్రాలకు సూచిస్తూ లేఖ రాశారు ఈ లేఖకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రూపొందించిన 'వైద్యసేవల సిబ్బంది, వైద్యసంస్థల రక్షణ ముసాయిదా బిల్లు–2017'ను జతచేశారు. భారత వైద్యులు ప్రపంచంలోనే అత్యున్నత నిపుణులుగా గుర్తింపు పొందారనీ, వారు తీవ్రమైన ఒత్తిడిలో, అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

**విధుల్లో చేరండి: మమత**

పశ్చిమబెంగాల్‌లో ఆందోళన చేస్తున్న వైద్యుల అన్ని డిమాండ్లను అంగీకరిస్తున్నామని, అవసరమైతే ఇంకా మరిన్ని డిమాండ్లను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం మమత చెప్పారు. ఆందోళన చేస్తున్న వైద్యులు వెంటనే విధుల్లో చేరాలని కోరారు. 'వైద్యులు, జూనియర్ డాక్టర్లు గత 5 రోజులుగా ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సేవల చట్టం(ఎస్మా)ను ప్రయోగించలేదు. చర్యలు తీసుకోవడం ద్వారా జూనియర్ డాక్టర్ల కెరీర్‌ను నాశనం చేయాలని మేం భావించడం లేదు. వైద్యులతో శుక్రవారం చర్చించేందుకు నేను 5 గంటలు ఎదురుచూశా. శనివారం నా అధికారిక కార్యక్రమాలు అన్నింటిని రద్దుచేసుకున్నా.ఒకవేళ నాతో చర్చించడం ఇష్టం లేకపోతే గవర్నర్ లేదా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా పోలీస్ కమిషనర్‌తో నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు' అని స్పష్టం చేశారు.

## రైళ్లలో మసాజ్ రద్దు

**పశ్చిమ రైల్వే నిర్ణయం**

**న్యూఢిల్లీ:** రైళ్లలో ప్రయాణికులకు మసాజ్ అందించే ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు పశ్చిమ రైల్వే శనివారం స్పష్టం చేసింది. మహిళలు ప్రయాణించే చోట ఇలాంటివి తగవని, ఇది భారత సంప్రదాయాలకు విరుద్ధమైనదంటూ బీజేపీ ఎంపీ శంకర్ లాల్వాణీ, రైల్వే మంత్రి పియూష్ గోయల్‌కు జూన్ 10న లేఖ రాసిన సంగతి తెలిసిందే. లేఖ రాసిన కొద్ది రోజులకే రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి ప్రారంభమయ్యే 39 రైళ్లలో తల, పాదాలకు మసాజ్ సౌకర్యాన్ని కల్పిస్తామని పశ్చిమ రైల్వేలోని రత్లమ్ డివిజన్ ప్రకటించింది. దీనిపై బీజేపీ ఎంపీ శంకర్, గత లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అభ్యంతరాలను లేవనెత్తారు. ఇది మహిళలకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉందని అన్నారు. అయితే ఈ మసాజ్ కేవలం తలకు, పాదాలకు మాత్రమే తప్ప శరీరమంతటికీ కాదని రత్లమ్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఆర్ఎన్ సుంకర్ అన్నారు.

## కారుతో ఢీకొట్టి పెట్రోల్‌తో తగలబెట్టి..

**మహిళా పోలీసును చంపిన మరో పోలీసు**



**మావెలిక్కర:** మహిళా కానిస్టేబుల్ ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీ కొట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించి చంపిన దారుణమైన ఘటన కేరళలో చోటుచేసుకుంది. వల్లక్కున్నం పోలీస్ స్టేషన్‌లో సివిల్ పోలీస్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సౌమ్య పుష్పకరణ్ (34) విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి బయలుదేరారు. ఆలువా ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని అజాస్ అనే పోలీసు ఆమెను కారులో వెంబడించాడు. అనంతరం ఆమె ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పదునైన ఆయుధంతో బెదిరించాలని చూడగా ఆమె పక్కనే ఉన్న ఇంటిలోకి వెళ్లి తలదాచుకుంది. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో ఆమెను చేరుకొని పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో బాధితురాలు అక్కడికక్కడే మృతిచెందారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. ఆమె భర్త విదేశాల్లో ఉంటున్నారు. నిందితుడు అజామ్‌కు మంటలు అంటుకున్నాయి. 40శాతం గాయాలయ్యాయని అలప్పుజ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు ఆస్పత్రిలో ఉన్నందున విచారణ తర్వాతే దాడికి సంబంధించిన కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

## ఇంట్లోంచి లాగి బెల్టుతో చితకబాది..

**అప్పుతీర్చలేదని మహిళపై కౌన్సిలర్ సోదరుడి దాడి**



**చండీగఢ్:** తీసుకున్న రూ.23,000 అప్పు తీర్చలేదన్న కారణంతో ఓ మహిళపై కాంగ్రెస్ నేత, కౌన్సిలర్ సోదరుడు అమానుషంగా ప్రవర్తించాడు. కొంత మందిని వెంటేసుకొచ్చి ఆమెను ఇంట్లోంచి బయటికి లాగి బెల్టుతో కొట్టి, పిడిగుద్దులు గుద్దాడు. ఈ ఘటన పంజాబ్‌లోని ముక్తసర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ దాడికి సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో కౌన్సిలర్ సోదరుడు సురేశ్ చౌదరితో సహా అతని అనుచరులు ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ వీడియోలో 35ఏళ్ల వయసున్న ఓ మహిళను రోడ్డుపై కొంతమంది దారుణంగా కొడుతున్నారు. ఇది చూస్తున్న ఆమె కొడుకు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. ఆ సమయంలోనే వాళ్ల అమ్మను జుట్టు పట్టి లాగి కొడుతుండగా ఆ అబ్బాయి వీడియో తీశాడు. దాడి చేస్తున్న వారిలో ఒకడు ఆమెపై కూర్చుని దాష్టీకం ప్రదర్శించాడు. అడ్డొచ్చిన ఆమె తల్లిపై కూడా చేయి చేసుకున్నాడు. 'అప్పు తీర్చని విషయంలో కౌన్సిలర్ సోదరుడైన సురేశ్ చౌదరి ఆ మహిళపై దారుణంగా దాడి చేశాడు. సురేశ్‌తో పాటు మిగతా ఐదుగురిని అరెస్టు చేశాం. కౌన్సిలర్ రాకేశ్ చౌదరితో పాటు ఇంకా నలుగురు పరారీలో ఉన్నారు'అని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మంజిత్ సింగ్ దేశీ తెలిపారు. అలాగే నిందితులపై భారత శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనను పంజాబ్ సీఎం తీవ్రంగా ఖండించారు.

# ఇంటి కంటే రెస్టారెంట్ పదిలం

**భారతీయ కుటుంబాలు నెలకి చేస్తున్న సగటు ఖర్చు రూ.2,500 కోట్లు**

- నార్త్ ఇండియన్ ఫుడ్‌పైనే ఎక్కువ మందికి మోజు



వీకెండ్ వచ్చిందంటే చాలు భార్యా పిల్లలతో కలిసి బయటకు వెళ్లి సరదా సరదాగా షాపింగ్ చేసి మల్టీప్లెక్స్‌లో మూవీ చూసి, తర్వాత రెస్టారెంట్‌లో ఇష్టమైన ఫుడ్ లాగిస్తేనే భారతీయులకు అదో తుత్తి. ఒకప్పుడు బయట హోటల్స్‌కు వెళ్లాలంటే బర్త్‌డే, మ్యారేజ్‌డే ఇలా ఏదో ఒక ఫంక్షన్ ఉంటేనే వెళ్లేవారు. ఇప్పుడు భారతీయుల మైండ్ సెట్ మారింది. శని ఆదివారాలు ఎన్నిరకాల వినోదాలున్నా హోటల్‌కి వెళ్లి చేతులు కడగవలసిందే. ప్రతీ నెలలో కనీసం ఏడుసార్లు భారతీయ కుటుంబాలు రెస్టారెంట్లలో తినడానికే ఇష్టపడుతున్నారని నేషనల్ రెస్టారెంట్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) సర్వేలో తేలింది. దీని కోసం భారతీయులు నెలకి సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇక స్విగ్గీలు, జోమాటో, యూబర్ ఈట్స్ వంటి యాప్‌లు వచ్చాక హోటల్ నుంచి ఇంటికి తెప్పించుకోవడాలు పెరిగిపోయాయి. అలా దేశ ప్రజలు నెలకి సగటున 6.6 సార్లు బయట తిండే తింటున్నారు. ఫుడ్ ట్రక్‌లు, ఫుడ్ పార్క్స్ , టేక్ ఎవేలు, హోమ్ డెలివరీలు అందుబాటులోకి వచ్చాక, ఆతిథ్య రంగం కొత్త దారి పట్టిందని, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తే ఇంటి భోజనమనే భావన వస్తే ఇంటి కన్నా రెస్టారెంట్లకి రావడానికే జనం ఇష్టపడుతున్నారని ఢిల్లీకి చెందిన రెస్టారెంట్ యజమాని అనురాగ్ కటియార్ వెల్లడించారు. నాలుగ్గోడల మధ్య మగ్గిపోతూ బయట నుంచి తెప్పించుకునే తిండి తినేకంటే, కాస్త ఆరుబయట గాలి పీల్చుకుంటూ రెస్టారెంట్‌లో యాంబియెన్స్‌ను ఎంజాయ్ చేస్తూ వేడివేడిగా తినడానికే 80 శాతం మంది భారతీయులు ఇష్టపడుతున్నారని ఎన్ఆర్ఏఐ సర్వేలో తేటతెల్లమైంది.

**ఎవరి టేస్ట్ వాళ్లదే**

రకరకాల ఘుమాయించే వంటకాలు,విభిన్న రుచులు, వైవిధ్యమైన డిషెస్ ఇప్పుడు ప్రతీచోటా దొరుకుతున్నాయి. పుర్రెకో బుద్ధి జిహ్వాకో రుచి అన్నట్టుగా ఒక్కొక్కరిది ఒక్కో టేస్ట్.. ఢిల్లీ వాసులకి స్థానికంగా దొరికే ఆహారం పట్ల మోజు లేదు. నార్త్ ఇండియన్ ఫుడ్ చూస్తేనే వారికి నోరూరుతుంది. బెంగుళూరులో దక్షిణాది వంటకాలపై అంతగా మోజు లేదు. నార్త్ ఇండియన్ మీల్స్, హైదరాబాదీ బిర్యానీలనే ఇష్టపడతారు. ఇక వెరైటీ రుచుల్ని ఆస్వాదించడంలో ముంబైకర్ల తీరే వేరు. దక్షిణాది రుచులకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు, దోసె, ఇడ్లీలను అత్యంత ఇష్టంగా లాగిస్తారు.

**ఏ ప్రాంతాల్లో ఏ ఫుడ్**

| | |
|---|---|
| ఉత్తర మధ్య భారతం: | 83% శాకాహారం |
| పశ్చిమ భారతం: | 71% శాకాహారం |
| తూర్పు భారతం: | 57% మాంసాహారం |
| దక్షిణ భారతం: | 70% మాంసాహారం |

**ఎవరెంత ఖర్చు చేస్తున్నారు ?**

| | |
|---|---|
| భారతీయ కుటుంబాలు నెలకి సగటు ఖర్చు | రూ. 2,500 కోట్లు |
| బెంగుళూరు వాసులు | రూ. 3,586 కోట్లు |
| ముంబైకర్లు | రూ. 2,890 కోట్లు |
| ఢిల్లీ వాసులు | రూ. 1,381 కోట్లు |

ఇతర దేశాల వంటకాల్లో 33% మంది ఇటాలియన్ ఫుడ్ అంటే పడిచచ్చిపోతే, 29% మందికి చైనీస్ ఫుడ్ తింటేనే కడుపు నిండినట్టు అనిపిస్తుంది. ఎప్పుడో ఒకసారి తప్ప ఎంతకని ఆ బయట తిండి తింటాం, ఇంట్లో చారు అన్నం తిన్నా అదే అమృతంలా అనిపిస్తుంది కదా అని 20శాతం మంది అభిప్రాయపడినట్టుగా సర్వేలో తేలింది.

**ఏ ఫుడ్‌కి ఎంత డిమాండ్**

| | |
|---|---|
| నార్త్ ఇండియన్ | 41% |
| చైనీస్ | 27% |
| సౌత్ ఇండియన్ | 23% |
| మొఘలాయ్ | 22% |
| ఇటాలియన్ | 16% |
| ఇండియన్ స్నాక్స్ | 11% |
| రాప్స్ అండ్ రోల్స్ | 8% |
| శాండ్ విచెస్ | 7% |
| మొమొస్ | 7% |
| సౌత్ ఈస్ట్ ఏషియన్ | 6% |

సాక్షి
6 నల్లగొండ । ఆదివారం । జూన్ । 16 । 2019
www.sakshi.com

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి శు.చతుర్దశి ప.1.55 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం అనూరాధ ఉ.10.30 వరకు, తదుపరి జ్యేష్ఠ వర్జ్యం సా.4.10 నుంచి 5.48 వరకు దుర్ముహూర్తం సా.4.45 నుంచి 5.38 వరకు, అమృతఘడియలు... రా.1.55 నుంచి 3.32 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.30
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

# అయోమయమా, అతి లౌక్యమా?

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

నిజమే. ప్రజాతీర్పును అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఎందుకు ఓడిపోయిందో అర్థం కావడం లేదని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారంనాడు అమరావతిలో జరిగిన విస్తృత సమీక్షా సమావేశంలో వ్యాఖ్యానించడంలో ఆశ్చర్యం లేదు. మే 23న ఓట్ల లెక్కింపు జరగడానికి ముందు టీడీపీ విజయం పట్ల చంద్రబాబు చాలా ధీమాగా ఉన్నారు. తన పిలుపును పురస్కరించుకొనే మహిళలంతా పనికట్టుకొని అర్ధరాత్రి వరకూ క్యూలలో నిలబడి తన పార్టీకి ఓట్లు వేశారని ఆయన సంపూర్ణంగా విశ్వసించారు. ఆ మాట ఢిల్లీలో, అమరావతిలో పదేపదే చెప్పారు. ఎన్నికలలో ఘోరపరాజయం తాలూకు దిగ్భ్రాంతి నుంచి ఆయన ఇంకా కోలుకోలేదనటానికి మొన్న అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ ఎన్నిక సన్నివేశంలో ఆయన ముఖారవిందమే నిదర్శనం. పద్నాలుగేళ్ళు ముఖ్యమంత్రిగా, పదేళ్ళు ప్రతిపక్ష నాయకుడిగా పదవులు నిర్వహించిన వ్యక్తి చిరునవ్వుతో సభలో ప్రవేశించి మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికైన యువనాయకులను అభినందించి, సభాపతి ఆసనం వైపు నడుస్తున్న తమ్మినేని సీతారాం వెంట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు కదిలి ఉంటే హుందాగా ఉండేది. సభాపర్వం ఆదిలోనే సామరస్యపూరితమైన వాతావరణం నెలకొనేది. ప్రతిపక్ష నేత గౌరవం పెరిగేది.

### తల్లకిందులైన అంచనాలు

ఎప్పటికప్పుడు వాస్తవాలు తెలుసుకునే వ్యవస్థ ఉండి ఉన్నట్లయితే చంద్రబాబును ఓటమి ఇంతగా ఆశ్చర్యపరిచేది కాదు. తన చుట్టూ తనకు ఇష్టమైన అధికారులనూ, అనధికారులనూ పెట్టుకున్నారు. వారు అధినేతకు ఏది నచ్చుతుందో అదే చెబుతారు. సానుకూల మీడియా సైతం పరిస్థితులు చేజారిపోతున్నాయని హెచ్చరించలేదు. విజయం తథ్యమంటూ ఆశ్వాసించింది. వందిమాగధుల వల్ల ఎంత ప్రమాదమో తెలిసింది. ఫీజు చెల్లించినవారికి ప్రతికూలంగా పరిస్థితులు ఉన్నప్పటికీ నిజమైన సర్వే ఫలితాలను వెల్లడించే సంస్థలు అరుదు. అశోక్ గజపతిరాజు వంటి నాయకులు నిర్మొగమాటంగా మాట్లాడగలరు కానీ వారికీ రాబోయే ఉపద్రవం సంగతి బొత్తిగా తెలిసినట్టు లేదు. ఎన్నికల సమరంలో పార్టీ శ్రేణులను నడిపించడంలో చంద్రబాబు శక్తిసామర్థ్యాల పట్లా, చాణక్యం పట్లా సీనియర్ నాయకులకు మితిమీరిన విశ్వాసం ఉండటం కూడా పార్టీకి నష్టం కలిగించింది. దిమ్మతిరిగే ఫలితాలు వెల్లడైన వెంటనే 'ప్రజలను మనం అంత కష్టపెట్టామా?' అంటూ టీడీపీ అధ్యక్షుడు సహచరులతో వాపోయారంటే చుట్టూ ఉన్నవారు ఆయనను ఎంత మబ్బులో పెట్టారో, ఆయన ఎన్ని భ్రమలలో జీవిస్తూ ఉన్నారో ఊహించుకోవచ్చు. చంద్రబాబుకు అర్థం కాలేదేమో కానీ నాబోటి రాజకీయ పరిశీలకులకు ఆయన దారుణంగా ఓడిపోతున్నారని కొన్ని మాసాలుగా అర్థం అవుతూనే ఉంది. ఆ విషయం సందర్భం వచ్చినప్పుడల్లా వెల్లడిస్తూనే ఉన్నాం. నిజానికి, 2014లో టీడీపీ 1.6 శాతం ఓట్ల వ్యత్యాసంతో వైఎస్ఆర్‌సీపీపైన గెలుపొందిన క్షణం నుంచీ ఆ పార్టీ ఓటమికి అధినాయకుడే స్వయంగా బాటలు వేశారు. ఎన్నికల తంత్రంపైన ఆధారపడటం, డబ్బుతో ఎన్నికలలో విజయం సాధించవచ్చునని నమ్మడం, అందు కోసం అవధులు మించిన అవినీతిని అనుమతించడం, పశ్చిమబెంగాల్‌లో మార్క్సిస్టు కార్యకర్తలు వామపక్ష సంఘటన 33 సంవత్సరాలు అధికారంలో అప్రతిహతంగా కొనసాగడానికి తోడ్పడినట్టే జన్మభూమి కమిటీలు కూడా టీడీపీ అధికారాన్ని సుదీర్ఘంగా కొనసాగిస్తాయని అంచనా వేసుకోవడం, టీడీపీ పాలనలో ఒకే ఒక సామాజికవర్గం ప్రయోజనాలు నెరవేరుతున్నాయనే అభిప్రాయం జనసామాన్యంలో ప్రబలడం, పార్టీ అధ్యక్షుడుగా, ముఖ్యమంత్రిగా చంద్రబాబులో విశ్వాసం కోల్పోవడమే కాకుండా తమను ఆయన మోసం చేస్తున్నారనే అనుమానం ప్రజలలో బలపడటం ఆయన ఓటమికి ప్రధాన కారణాలు. ప్రతిద్వంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాకులాంటి యువకుడూ, ప్రతిభావంతుడూ, దీక్షాదక్షతలు కలిగిన నాయకుడూ కావడం, ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన హామీలనూ, పథకాలనూ టీడీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిన తీరును తన 3648 కిలోమీటర్ల చారిత్రక పాదయాత్రలో అత్యంత సమర్థంగా ప్రజలకు వివరించడం, నవరత్నాల పేరుతో చిన్న పిల్లల నుంచీ వృద్ధుల వరకూ అందరికీ సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించడం, బీసీ డిక్లరేషన్‌తోనూ, టిక్కెట్ల పంపిణీలోనూ వెనుకబడిన వర్గాల ప్రజల హృదయాలను దోచుకోవడం ద్వారా జగన్ మోహన్‌రెడ్డి చంద్రబాబు ఓటమిని అనివార్యం చేశారు. అన్నిటి కంటే మించి సామాన్య ప్రజల అనుభవం ప్రధానం. స్వానుభవం కంటే భిన్నంగా నాయకులు చెప్పినా, పత్రికలు రాసినా, టీవీ చానళ్ళు గ్రాఫిక్స్‌లో చూపినా ప్రయోజనం ఉండదు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే, జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలలో ఎంత విశ్వాసం, అభిమానం ఉన్నాయో చంద్రబాబునాయుడి పట్ల అంత అవిశ్వాసం, ఆగ్రహం ఉన్నాయి. అభిమానం, ఆగ్రహం కలిసి సునామీని సృష్టించాయి.



2014 ఎన్నికల ప్రణాళికలో టీడీపీ పేర్కొన్న మొదటి మూడు అంశాలూ– వ్యవసాయ రుణాల మాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం– సవ్యంగా అమలు జరగలేదు. బీసీ డిక్లరేషన్‌లో వందమంది బీసీలను టీడీపీ టిక్కెట్టుపైన ఎన్నికల రంగంలో దించుతామనే పదో హామీ ఆదిలోనే ఆవిరైపోయింది. తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారనే నిర్ణయానికి బీసీలు వచ్చారు. తమకు బీసీ హోదా ఇస్తానని చెప్పి మోసం చేశారని కాపులు భావించారు. అవినీతిరహిత సుపరిపాలన అందిస్తామన్న పన్నెండవ వాగ్దానాన్ని అపహాస్యం చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జన్మభూమి కమిటీల వరకూ సర్వత్రా అవినీతిని అందలం ఎక్కించారు.

### 'మేనేజ్‌మెంట్'పై విశ్వాసం

అన్ని వ్యవస్థలనూ 'మేనేజ్' చేయడంలో తనకు తిరుగులేదనే విశ్వాసం చంద్రబాబును దారుణంగా దెబ్బతీసింది. ప్రజలు అమాయకులనీ, వారిని తేలికగా మభ్యపెట్టవచ్చుననే ధోరణి కూడా టీడీపీ పతనానికి దారితీసింది. నాలుగు సంవత్సరాల తొమ్మిది మాసాలు ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, ఎన్నికలకు మూడు మాసాల ముందు వరాల జల్లు కురిపిస్తే ప్రజలు పొంగిపోయి ఓట్లతో ముంచెత్తుతారనే అంచనా తప్పింది. జగన్‌పైన చంద్రబాబునాయుడూ, కాంగ్రెస్ నేతలూ కలిసి పెట్టించిన సీబీఐ కేసులలో పసలేదనీ, అవి రాజకీయ ప్రతీకారేచ్ఛతో బనాయించిన కేసులనీ ప్రజలలో అత్యధికులు విశ్వసించారు. పదేపదే నేరస్థుడంటూ జగన్‌ను అచ్చెన్నాయుడూ, బుచ్చయ్యచౌదరీ, బోండా ఉమామహేశ్వరరావూ వంటి నాయకులు దూషించడాన్ని ప్రజలు సహించలేదు. జగన్‌ను అవినీతిపరుడంటూ, నేరస్తుడంటూ సంబోధించిన చంద్రబాబు విశ్వసనీయతనే ప్రజలు శంకించారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సజీవంగా ఉన్నంత వరకూ, తాను కాంగ్రెస్‌లో కొనసాగినంత వరకూ తనపైన కేసులు లేవనీ, తనను గౌరవనీయుడుగానే పరిగణించారనీ, కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాతనే తనపైన కేసులు పెట్టారంటూ జగన్ ఇచ్చిన వివరణను ప్రజలు మనస్ఫూర్తిగా నమ్మారు. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మధ్య బేరీజు వేసుకొని మోదీని రెండో విడత ప్రధానిగా ఎన్నుకోవాలని నిర్ణయించిన విధంగానే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చంద్రబాబునాయుడినీ, జగన్‌మోహన్‌రెడ్డినీ పోల్చుకొని వైఎస్ఆర్‌సీపీ అధినేతకు పట్టం కట్టాలని స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల హామీలను అమలు పరచకపోగా ప్రణాళికలో ప్రస్తావించని పనులు చంద్రబాబునాయుడు చేశారు. విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఎన్నికల ప్రణాళికను పక్కనపెట్టి సొంత అజెండాను భుజానికి ఎత్తుకున్నారు. రాజధాని నిర్మాణం పేరుమీద 40 వేల ఎకరాలు సమీకరించడం, ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా అస్మదీయులకు లబ్ధి చేకూర్చడం, అనవసరమైన పట్టిసీమ నిర్మాణం పేరుతో నిధులు దుర్వినియోగం చేయడం, కేంద్రం నిర్మించవలసిన పోలవరం బాధ్యత తను అడిగి నెత్తికి ఎత్తుకోవడం వంటి అనేక అక్రమాలూ, తప్పుడు నిర్ణయాలూ జరిగాయి. అధికారంలో ఉండిన అయిదేళ్ళలో రూ. 1.69 లక్షల కోట్లు అప్పు చేసి ఫలానా నిర్మాణం చేశామని చెప్పుకోలేని, చూపించలేని దుస్థితి. ప్రత్యేకహోదా ఉద్యమాన్ని నిర్మించి జగన్ ప్రజల మనసులు గెలుచుకుంటున్నారనే ఆందోళనతో చంద్రబాబునాయుడు ఎన్డీయే నుంచి నిష్క్రమించారు. అంతటితో ఆగకుండా, ఏవో లెక్కలు వేసుకొని మోదీ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహించే ప్రయత్నం చేసి ప్రత్యేక విమానంలో ఢిల్లీ, లక్నో, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాలు సందర్శించి హడావిడి చేశారు. 35 సంవత్సరాలుగా వ్యతిరేకించిన కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ నివాసానికి వెళ్ళి కండువా కప్పి వచ్చారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణలో కాంగ్రెస్‌ను భ్రష్టుపట్టించారు. వ్రతం చెడినా ఫలం దక్కకపోవడం అంటే ఇదే. దేశంలోని ప్రతిపక్షాలన్నిటినీ ఒక్క తాటిపైకి తెచ్చి మోదీ–అమిత్‌షా నాయకత్వంలోని బీజేపీని ఓడించేందుకు విశ్వప్రయత్నం చేసిన జాతీయ నాయకుడికి ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్ళడానికి ముఖం చెల్లని పరిస్థితి. మూడు లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న పార్టీ నేతకు హస్తినలో గౌరవం ఏముంటుంది?

### భిన్న వైఖరులు

చంద్రబాబు, జగన్‌ల భిన్నమైన రాజకీయ ధోరణులను సైతం ప్రజలు జాగ్రత్తగా గమనించారు. ఎటువంటి కేసులు వచ్చినా 'స్టే'లు తెచ్చుకునే చంద్రబాబు ఒకవైపు. చట్టాలనూ, న్యాయస్థానాలనూ గౌరవిస్తూ కోర్టుకు హాజరవుతూనే పాదయాత్ర కొనసాగించిన జగన్ మరోవైపు. వైఎస్ఆర్‌సీపీ టిక్కెట్లపై నెగ్గిన 23 మంది ఎంఎల్ఏలనూ, ముగ్గురు ఎంపీలనూ ప్రలోభపెట్టి తన పార్టీలో చేర్చుకోవడమే కాకుండా వారిలో నలుగురిని మంత్రిపదవులతో సత్కరించిన ముఖ్యమంత్రి ఒక వైపు. వైఎస్ఆర్‌సీపీ పెట్టడానికి ముందే కాంగ్రెస్‌నుంచి నిష్క్రమించి, వెంటనే పార్లమెంటు స్థానానికి రాజీనామా చేయడమే కాకుండా తన పార్టీలో చేరదలచిన కాంగ్రెస్ శాసనసభ్యుల చేతా, పార్లమెంటు సభ్యుల చేతా, టీడీపీకి చెందిన ఎంఎల్‌సీ శిల్పా చక్రపాణిరెడ్డి చేతా రాజీనామా చేయించిన ప్రతిపక్ష నాయకుడు మరోవైపు. ఇచ్చిన హామీలను నెరవేర్చని నాయకుడు ఒకవైపు, నెరవేర్చడం సాధ్యం కాదనుకొన్న హామీని ఇవ్వడానికి నిరాకరించిన నేత మరోవైపు. మాయామర్మం చేసి, మసిపూసి మారేడుకాయ చేసి ఏదో విధంగా (చివరికి పాల్ వంటి విదూషకుడిని ప్రయోగించి) ఎన్నికలలో గెలవాలని ప్రయత్నించిన పార్టీ అధ్యక్షుడు ఒకవైపు. పారదర్శకంగా, ముక్కుసూటిగా వ్యవహరిస్తూ, మనసులో మాట నిస్సంకోచంగా చెబుతూ, ప్రజలతో మమేకమై, వారి విశ్వాసాన్ని చూరగొనడం ద్వారా ఎన్నికలలో విజయం సాధించాలని ప్రయత్నించిన ప్రతిపక్షనేత మరోవైపు. ఎవరిది నమ్మదగిన రాజకీయమో, ఎవరిది కపట రాజకీయమో, ఎవరిది నిజాయితీనో, ఎవరిది వంచనాశిల్పమో ప్రజలు అంచనావేసుకున్నారు. అందుకే, ఒక ప్రాంతం కాదు. ఒక కులం కాదు. ఒక మతం కాదు. రాష్ట్ర ప్రజలంతా కూడబలుక్కున్నట్టు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులకు ఓటు చేసి ఘనవిజయం చేకూర్చారు. ఈ పాటి విశ్లేషణ చంద్రబాబునాయుడికి తెలియకపోలేదు. వాస్తవాలను అంగీకరించడం, తప్పులు ఒప్పుకోవడం కష్టం. పరాజయాన్ని అంతుపట్టని పరిణామంగా చిత్రించి, ఓటమికి దారితీసిన కారణాలను అన్వేషించడం కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక కమిటీని వేసి, వాటి నివేదికలు తెప్పించుకొని, పార్టీ నాయకులను బీజేపీ వైపు చూడకుండా నిర్విరామంగా ఉంచడం చంద్రబాబునాయుడికి ఇప్పుడు అవసరం. పార్టీని రక్షించుకోవాలి. తనయుడికి అప్పగించాలి. 2004లో ఓడిపోయినప్పుడు అనుసరించిన పద్ధతులనే ఇప్పుడు కూడా అమలు చేస్తారు. అంతే కాని చంద్రబాబు ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకొని, రాజకీయ దృక్పథం మార్చుకొని, ధనబలం, కండబలంతో నిమిత్తం లేని పరిశుభ్రమైన రాజకీయాలవైపు అడుగులు వేసే ఆలోచన చేస్తున్న దాఖలా లేదు. ప్రశాంతంగా ఆలోచించి, ఓటమికి కారణాలను విశ్లేషించుకొని, నిర్మాణాత్మక రాజకీయాలవైపు దృష్టి సారిస్తే ఆయనకు చరిత్రలో స్థానం ఉంటుంది. నకారాత్మక (నెగెటివ్) రాజకీయాలకు స్వస్తి చెప్పి, సకారాత్మక (పాజిటివ్) రాజకీయాలకు శ్రీకారం చుట్టినట్లయితే తనయుడు లోకేష్‌కు ఉత్తమమైన రాజకీయ వారసత్వం అందించిన సంతృప్తి మిగులుతుంది. డబ్బు రాజకీయంలోనే కొనసాగాలనుకుంటే, అదే బాటలో కుమారుడిని కూడా నడిపించాలనుకుంటే నాలుగు దశాబ్దాలకు పైబడిన రాజకీయ ప్రస్థానం అర్థరహితం అవుతుంది. ఇంతవరకూ అనుసరించిన చంద్రబాబు మార్కు రాజకీయాన్ని ప్రజలు తిరస్కరిస్తారనే విషయం మాత్రం స్పష్టం. ఓటమిని ఏ విధంగా అర్థం చేసుకుంటారనే అంశంపైన చంద్రబాబునాయుడి భవిష్య ప్రణాళిక ఆధారపడి ఉంటుంది. నిర్మాణాత్మక రాజకీయాలను ఆచరిస్తే టీడీపీకీ, ఆ పార్టీ అధినాయకుడికీ, ప్రజలకీ మేలు.

---

మమతాబెనర్జీ (సీఎం)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఏ పార్టీ అయినా తను అధికారంలో ఉన్న రాష్ట్రాన్ని మాత్రమే పరిపాలిస్తుంది. బీజేపీ అలాక్కాదు. తను అధికారంలో లేని రాష్ట్రాలను కూడా పాలిస్తుంటుంది. ఆ రాష్ట్రాలకూ ఒక చీఫ్ మినిస్టర్ ఉంటారని మొహమాటానికి కూడా అనుకోదు.

కోల్‌కతాలో వారం రోజులుగా డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. రేపట్నుంచి దేశంలోని మిగతా రాష్ట్రాల డాక్టర్లు కూడా వీళ్లకు సపోర్ట్‌గా మెడలో స్టెతస్కోప్ వేసుకుని వీధుల్లోకి రాబోతున్నారని చంద్రిమా భట్టాచార్య వచ్చి చెప్పారు.

"మెడలో స్టెత్ ఉన్నవాళ్లు ఆసుపత్రుల్లో ఉండాలి కానీ, ఆసుపత్రుల బయట వాళ్లకేం పని చంద్రిమా! సమ్మెను సపోర్ట్ చెయ్యడానికి వస్తున్న బీజేపీ లీడర్‌ల కోసం ఆరుబయట వైద్య శిబిరాలను గానీ ఏర్పాటు చేస్తున్నారా? బీపీ మిషన్‌లను కూడా తీసుకెళ్లమని చెప్పవలసింది" అన్నాను.

"వినేలా లేరు దీదీ. అప్పటికీ నేను అడిగాను. 'చనిపోయిన రోగి బంధువులెవరో డాక్టర్‌ల మీద దాడి చేశారని ఆ కోపంతో వైద్యం కోసం వస్తున్న రోగుల్ని చంపేస్తామా?' అని. 'అలా చేస్తే ఇక రోగి బంధువుల కోపానికీ, రోగికి బంధువులుగా ఉండాల్సిన డాక్టర్‌ల కోపానికీ తేడా ఏముంటుంది?' అని అన్నాను" అన్నారు చంద్రిమ.

"ఏమంటారు ఆ మాటకు?" అన్నాను.

"వాళ్లకు గానీ, నాకు గానీ ఏమాత్రం సంబంధంలేని ఒక మాట అన్నారు దీదీ. అది వాళ్లు అనవలసిన మాట గానీ, అది నేను నా మనసులోనైనా అనుకోవలసిన మాట గానీ కాదు" అన్నారు చంద్రిమ!

"చెప్పండి, పర్వాలేదు" అన్నాను.

"ఆరోగ్యశాఖకు సహాయ మంత్రిగా కాదు, సంపూర్ణ మంత్రిగా ఉన్నప్పుడు వచ్చి చెప్పండి. అంతవరకు మీరు మాకేం చెప్పినా, అది మీకు



మమతా బెనర్జీ చెప్పి పంపినట్లుగానే మేము భావిస్తాం' అన్నారు దీదీ" అన్నారు చంద్రిమ.

బీజేపీ పాలన చంద్రిమ వరకు వచ్చిందని నాకు అర్థమైంది. ముఖ్యమంత్రికి ఆల్రెడీ ముఖ్యమంత్రి పోస్ట్ ఉన్నప్పుడు హెల్త్ మినిస్టర్ పోస్టు కూడా ఎందుకన్న ఆలోచన చంద్రిమలో కలిగిస్తున్నారంటే బీజేపీవాళ్లు కోల్‌కతా వరకు వచ్చేసినట్లే. హౌరా స్టేషన్‌లో దిగితే అక్కడి నుంచి సెక్రటేరియట్‌కి మూడే నిమిషాలు!

ఇప్పటికే నా మేనల్లుడు వెళ్లి డాక్టర్‌ల మధ్య కూర్చొని ప్లకార్ట్ పట్టుకున్నాడు. 'యు సే వియ్ ఆర్ గాడ్స్. వై ట్రీట్ అజ్ లైక్ డాగ్స్' అని అడుగుతున్నాడు! మోదీకి ఐడియా వచ్చినట్లు లేదు. లేకుంటే ఇవే మాటల్ని నా మేనల్లుడి చేత నాన్ బెంగాలీ భాషలో అడిగించేవారు.

మతమార్పిడిలా బెంగాలీలను నాన్ బెంగాలీలుగా మార్చే టీమ్ ఒకటి ఢిల్లీ నుంచి వచ్చి పశ్చిమ బెంగాల్‌లో తిరుగుతోంది.

సమ్మె చేస్తున్నవాళ్లలో బెంగాలీలు ఎంత మంది ఉన్నారని చంద్రిమను అడిగాను. 'ఒకరిద్దరు ఉన్నట్లున్నారు దీదీ' అన్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌కి ఫోన్ చేసి అడిషనల్ చీఫ్ సెక్రటరీని అడిగాను. 'ఒకరా ఇద్దరా అన్నది లెక్క తేలడం లేదు మేడమ్' అన్నారు. పోలీస్ కమిషనర్‌కి ఫోన్ చేశాను. 'ఒకరా ఇద్దరా అన్నది లెక్క తేలుస్తున్నాం మేడమ్' అన్నారు.

"తేల్చేయండి త్వరగా" అన్నాను.

వెంటనే కేసరినాథ్ త్రిపాఠి నుంచి ఫోను! "నా రాష్ట్రంలో ఏం జరుగుతోందో ఒక గవర్నరుగా నేను తెలుసుకోవచ్చా మమతాజీ" అంటున్నారు!

ఆ వెంటనే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి! "మమతాజీ నేను హర్షవర్ధన్. డాక్టర్‌ల సమ్మెను మేము జోక్యం చేసుకుని ఆపించే అవసరాన్ని మీరు మాకు కలగనివ్వరనే ఆశిస్తున్నాను" అన్నారు!

ఫోన్ పెట్టేయగానే, హైకోర్టు నుంచి ఆదేశం.. డాక్టర్‌లకు నచ్చజెప్పి, తిరిగి విధుల్లోకి పంపమని!

బీజేపీని ఇలాగే వదిలేస్తే బెంగాల్‌లో ఒక్క బెంగాలీ మిగలరు. మిగిలినా ఆ ఒక్క బెంగాలీ కూడా బెంగాలీ భాష మాట్లాడరు.

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### వివక్ష



"డాక్టర్లు తమ సొంత వృత్తిలోని వారిపట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. మొన్న పాయల్ తాడ్వీ, ఇప్పుడు ఓంకార్.. తోటివారి వేధింపుల్ని తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారు. కానీ మీరంతా బెంగాల్‌పైనే దృష్టి పెడతారు. రోహ్‌తక్ పీజీఐలోని పీడియాట్రిక్స్ విభాగంలో రెసిడెన్సీ కోసం ఓంకార్ చేరినప్పుడే వివక్ష గురించి తెలిసివచ్చింది. ఒక్క విషయం ఏమిటంటే, ఆగ్రహంతో ఎదురుగా వచ్చి మీద పడే మూకను ఎదుర్కోవచ్చు. కానీ, అంతర్గతంగా కొనసాగే దాడిని తట్టుకోలేం"

– జైనాబ్ సికిందర్, రచయిత్రి

### గౌరవం



"డాక్టర్లు వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలి. వాళ్ల డిమాండ్లు అన్నీ అంగీకరిస్తున్నాం. డాక్టర్ల బృందాన్ని కలవడానికి మా మంత్రినీ, ముఖ్యకార్యదర్శినీ పంపా. వాళ్లు నిన్న, ఇవాళ కూడా చాలాసేపు వేచి ఉన్నప్పటికీ డాక్టర్ల బృందం కలువలేదు. రాజ్యాంగబద్ధ సంస్థలను డాక్టర్లు గౌరవించాలి"

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

### హింస



"హోంమంత్రిత్వ శాఖ రాజకీయ హింసపై డేటా సేకరించి, భద్రపరుస్తోందని తెలిసి ఆశ్చర్యపోయా. ఒక్క పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి మాత్రమే ఈ విధమైన డేటాను సేకరిస్తున్నారా? లేక అన్ని రాష్ట్రాల్లోని రాజకీయ హింసకు సంబంధించిన సమాచారం వీరి వద్ద ఉంటుందా?"

– విజేతా సింగ్, జర్నలిస్ట్

### చోర్



"ఢిల్లీ వీధుల్లో నిన్న సాయంత్రం నాకు ఓ భయంకరమైన అనుభవం ఎదురైంది. నలుగురు దుండగులు బైక్‌పై వచ్చి కారులో నా పక్కనున్న హ్యాండ్ బ్యాగ్ తీసుకుని పారిపోయారు. సీసీ కెమెరాలు ఉండే ఆ ప్రాంతంలో వారి తెగింపును చూస్తే ఆశ్చర్యం వేసింది. వెంటనే పోలీసులు దుండగులను పట్టుకుంటారని ఆశిస్తున్నా"

– అమిత్రా ధావన్, కాంగ్రెస్ నేత

### ఇక చాలు



"జరిగింది చాలు, మానవ జీవితపు విలువను ఇంతకంటే దిగజార్చవద్దు. ద బేండికూట్ అనే ఆటోమేటిక్ స్కావేంజింగ్ మిషన్ గురించి గతంలో ట్వీట్ చేశా. వాటిని కొనుగోలు చేసి, వినియోగించడంలో ఉన్న అడ్డంకులేంటి? విరాళాలు అవసరమైతే, ఆ జాబితాలో నన్ను కూడా చేర్చుకోండి. గుజరాత్‌లోని ఒక హోటల్‌లో సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తూ నలుగురు పారిశుధ్య కార్మికులు సహా ఏడుగురు చనిపోవడం విషాదకరం"

– ఆనంద్ మహీంద్ర, మహీంద్ర గ్రూప్ ఛైర్మన్

---

## మాండరీన్ వేలంవెర్రి

మన పొరుగునున్న నేపాల్‌లో చైనా ప్రభావం నానాటికీ పెరుగుతోంది. అక్కడి ప్రైవేటు పాఠశాలలు తమ దగ్గర చేరే విద్యార్థులకు చైనా వాడుక భాష మాండరీన్‌ను తప్పనిసరి చేస్తున్నాయి. 'మా అనుమతి లేనిదే దేన్నీ తప్పనిసరి చేయకూడద'ని ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠ్యాంశాల అభివృద్ధి కేంద్రం చెబుతున్నా వినిపించుకునేవారు లేరు. ఈ వేలం వెర్రికి చైనా ప్రభుత్వమే కారణం. 'మీరు మాండరీన్ భాష తప్పనిసరి చేయండి. అందుకవసరమైన ఉపాధ్యాయుల్ని పంపుతాం. వారి జీతాలు మేమే భరిస్తాం. వారి తిండికి, ఆవాసానికి అయ్యే ఖర్చు మీరిస్తే చాల'ని చైనా ప్రభుత్వం ఆఫర్ ఇచ్చింది. చదువుకుందామని వచ్చిన పిల్లలకు ఇలా మాండరీన్‌ను తప్పనిసరి చేయడమేమిట'ని అడిగితే అది తప్పేనని పాఠశాలల నిర్వాహకులు అంగీకరిస్తున్నారు. 'అది నిజమే. కానీ మాకు వేరే దారి లేదు. నచ్చిన భాష ఎంపిక చేసుకునే అవకాశం పిల్లలకు ఇవ్వాలని మాకూ ఉంది. చైనా తరహాలోనే జపనీస్, జర్మన్ భాషలు నేర్పడానికి ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకొస్తే వాటిని కూడా ఈ మాదిరే పిల్లలకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని ఒక పాఠశాల ప్రిన్సిపాల్ చెప్పుకొచ్చారు. మాండరీన్ వేలం వెర్రిని ఎలా ఆపాలో తెలియక నేపాల్ ప్రభుత్వం తల పట్టుకుంది.

---

# పోలీస్ సంస్కరణ సాధ్యమా?

సందర్భం



రావులపాటి సీతారామారావు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి పదవీ స్వీకారం చేయగానే రాష్ట్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు చెప్పారు గానీ ఒక మాజీ పోలీసు అధికారిగా నాకు రెండు విషయాలు నచ్చాయి. బహుశా ఏ ముఖ్యమంత్రీ ఆ రెండు విషయాలూ మొదట్లోనే ప్రస్తావించిన దాఖలాలు నాకైతే జ్ఞాపకం లేవు. యాధృచ్ఛికంగా అని ఉండరని నేను దృఢంగా నమ్ముతున్నాను. అందుకే కొన్ని సంబంధిత విషయాలను ఈ విధంగా ప్రస్తావించదల్చుకున్నాను.

మొదటగా చెప్పాల్సింది పోలీసుల పనిగంటల విషయం. నిజానికి పోలీసులు ప్రజలకు ఎంత దగ్గరగా రావాలని ప్రయత్నించినా రాలేకపోతున్నారని అందరికీ తెల్సిన విషయమే! దానికి కారణం కింది స్థాయిలో ఉన్న పోలీసులను నిరంతరం వెంటాడే సమస్య పని ఒత్తిడి. మొదట్లో పోలీసు శాఖలో ప్రవేశించినప్పుడు ట్రైనీలకు చెప్పే మొదటి మాట– 'మీరు తతిమ్మా ఉద్యోగస్తుల్లా కాదు! ఇరవై నాలుగు గంటలూ డ్యూటీలో ఉండాల్సిందే'. ఆ క్షణాన, ఆ విధంగా శిక్షణ ఇచ్చేవారు చెబుతున్నప్పుడు ప్రతి ట్రైనీ గర్వంగా ఫీలవకుండా ఉండలేకపోయేవాడు! దానికి కారణం తనది ఎంత గొప్ప డ్యూటీనో అనే భావం అనుకోకుండానే ఏర్పడటం వల్లే!

తర్వాత్తర్వాత పోలీసులకు తెలిసివచ్చే మొదటి విషయం, రెస్టు లేకుండా డ్యూటీ నిరంతరం మనిషన్నవాడు ఏవిధంగా చేయగలడనే! ఆ ఎరుక మానసికంగా కిందిస్థాయిలో ప్రతి పోలీసునూ కుంగదీసే పరిస్థితి. అక్కడినుంచే మానసిక ఒత్తిడి, క్రమేపీ పని ఒత్తిడి కలిగించడం వల్ల సమన్వయం కోల్పోయే పరిస్థితులు ఏర్పడటం!

ఏపీ సీఎం జగన్, పోలీసులకు కలిగే ఈ ప్రాథమిక ఇబ్బందిని గ్రహించి మొదట్లోనే వెసులుబాటు సౌకర్యం కలిగించడం కోసం నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడానికి సంకల్పించడం చాలా స్వాగతించాల్సిన విషయం! అయితే కమిటీ ఎంత త్వరగా రిపోర్టు ఇచ్చినా అన్ని విషయాలు సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని పరిష్కారమార్గాలు కనుగొనడం కొంచెం కష్టమైన పనే!

ఇంగ్లండ్‌లో పోలీసు వ్యవస్థను, డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నప్పుడు దగ్గరనుంచి చూసే అవకాశం మాలాంటి కొంతమంది ఆఫీసర్లకు లభించింది. అక్కడ, క్రమశిక్షణను పాటిస్తూనే పోలీసులందరూ ఆత్మాభిమానం కోల్పోకుండా పనిచేసే వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది.

ఎనిమిది గంటలు కాగానే ఏ పనిలో ఉన్నా డిగ్నిఫైడ్‌గా సెల్యూట్ చేసి మై డ్యూటీ ఈజ్ ఓవర్ ఫర్ టుడే అని చెప్పిపోవడం కళ్లారా చూశాను. ఎంతో తృప్తి కలిగించే దృశ్యం అది! ఇవ్వాల్టికీ ఆ విధంగానే ఆ సౌకర్యం ఉందో లేదో తెలియదు కానీ, పోలీసుల నైతిక స్థైర్యాన్ని ఉన్నత స్థాయిలో ఉంచే ఆ విధానం పాటించడం చాలా గొప్ప విషయంగా మాకు కనబడింది. అందుకే అక్కడి ప్రజలకు పోలీసు ప్రీతిపాత్రుడైన 'బాబీ'గా మారిపోయాడు.

వారానికి నలభై గంటలు చేయాల్సిన పనిగా అక్కడి పోలీసు డ్యూటీ రూపుదిద్దుకుంది. రోజుకు ఎనిమిది గంటల పరిమితితో ఉండటంతోపాటు అవసరమైతే ఎమర్జెన్సీ విధులకు వచ్చే విధానం కూడా అక్కడి పోలీసులు పాటించక తప్పదు. ఆవిధంగా పని చేయాల్సి వచ్చినప్పుడు తగు విధంగా డ్యూటీలో వెసులుబాటును పొందే అవకాశం కూడా ఉంది. ఇక్కడ వ్యవస్థలోకి రావాలంటే మూడంచెలుగా రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. కానిస్టేబుల్‌గా, ఎస్ఐగా, డీఎస్పీ/ఏఎస్పీగా ప్రవేశం మనదేశంలో జరుగుతుంది. అక్కడ కానిస్టేబుల్‌గానే రిక్రూట్ అయిన వాడు చీఫ్ కానిస్టేబుల్‌గా (డీజీపీ) ఎదిగే అవకాశం ఉంది.

ఇవన్నీ ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే మేము అక్కడి పోలీసులను 'మాకేమో లొసుగుల వ్యవస్థను రూపొందించారు. మీరేమో మరోవిధంగా రూపకల్పన చేసుకున్నారు. ఎందుకని?' అని అడిగినప్పుడు– 'పాలనాపరంగా, మా చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి, మిమ్మల్ని పాలించే విధంగా పోలీసు శాఖను ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పుడు మీరు స్వతంత్రులు కదా! ఎందుకు మార్చుకోలేదు?' అని సూటిగా జవాబిచ్చారు.

నిజానికి అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలను తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంలో మనదే కదా! అందుకనే ముఖ్యమంత్రి ఆలోచనకు సరైన రీతిలో ఈ కమిటీ స్పందించాల్సిన అవసరం ఉంది. ఏదో అన్ని కమిటీల మాదిరి మొక్కుబడి రిపోర్టు ఇస్తే పరిస్థితి యథాతథంగానే ఉంటుంది.

ప్రజలకు పోలీసులను దగ్గర చేయాలంటే పని విధానంతోపాటు వారి ఆలోచనా విధానాన్ని కూడా మార్చాలి.

చట్టంప్రకారం కానిస్టేబుల్ స్థాయి పోలీసుకు ఎన్నో అధికారాలు ఉన్నాయి. కానీ గౌరవం ఏది? జీతభత్యాలు ఈ మధ్య పెరిగినా ఇంకా చేయి చాచే పరిస్థితి నుంచి వారు ఎందుకు విముక్తులు కాలేకపోతున్నారు?

కేవలం ట్రయినింగ్ ద్వారానే పోలీసుల పనితీరులను చక్కదిద్దొచ్చని అనుకోవడం భ్రమగానే మిగిలిపోతుంది. ఎందుకంటే ట్రయినింగ్ ఇచ్చేవారు చాలావరకు ఆ పనికి, పనికిరానివారినే నియమించే అలవాటు పోలీసు శాఖలో ఉంది కాబట్టే! కేవలం శారీరక పరిశ్రమ, చట్టాల అవగాహన కల్పించడంతో పోలీసును ప్రజలకు పనికివచ్చే పోలీసుగా తీర్చిదిద్దలేము.

మొదటినుంచీ ప్రజల సేవలో ఉండటం కోసం ఈ అధికారం ఇచ్చారు. వారిని గౌరవించడం మన ప్రథమ కర్తవ్యం అన్న ఆలోచన ప్రతి పోలీసుకూ నూరిపోయక తప్పదు. ట్రయినింగ్‌లో ఉన్నప్పుడే ఆ దృక్పథం లేని వారిని ఏరివేయక తప్పదు. ఆ సాహసం ఈ ప్రజాస్వామ్యంలో ఏర్పడిన ప్రభుత్వాలు చేయగలవా?

ప్రతి పోలీసూ ఒక సూత్రాన్ని నిరంతరం అధ్యయనం చేయటంతోపాటు ఆచరిస్తూనే ఉండాలి. ఈ ఉద్యోగంలో ఉన్న నేను ప్రభుత్వానికి విధేయుడిగా ఉండకతప్పదు. అయితే ఆ విధేయత చట్టం అనుమతించిన మేరకే అన్న ఎరుక ఉన్నప్పుడే పోలీసు ప్రజలకు దగ్గరవుతాడు. చట్టానికి మాత్రమే నేను బాధ్యుడిని అన్న ప్రాథమిక సూత్రాన్ని మనసావాచా కర్మణా ఆచరించే మానసిక ధైర్యం ప్రతి పోలీసుకూ ఉండకతప్పదు.

ఈ సమాజంలో ప్రతివాడూ నేరస్థుడే అనే అహంభావపు, అనాగరిక ఆలోచనను పోలీసు మనసు నుంచి తీసేయాలి. సొసైటీలో నేరస్థుల సంఖ్య కేవలం 10 శాతం కంటే మించదు. వారి పట్లనే చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలి. మిగతా వారంతా స్నేహితులే! వారికి హితమైన పని చేయడమే మన డ్యూటీ అని పోలీసు అనుకుంటే ప్రజలే కాలక్రమేణా అక్కున చేర్చుకుంటారు. అప్పుడే పోలీసు ప్రజలకు హితుడిగా, స్నేహితుడిగా సహాయకుడిగా రూపుదిద్దుకుంటాడు.

ఇవన్నీ చెప్పటం తేలికే! ఆచరణ యోగ్యం కావాలంటే యూనిఫారం ఇచ్చే రెపరెపనూ ఆనందిస్తూనే, డ్రెస్ ఇచ్చే దర్పాన్నీ, ఆడంబరాన్నీ, నిరాడంబరతగా మార్చుకునే ప్రవృత్తినీ అలవర్చుకోవాలి! అలా సాధ్యపడిననాడు 'ప్రజాపోలీసు'గా మారిపోతాడు. పోలీసు సంస్కరణల రిపోర్టుల గురించి ఇక్కడ ప్రస్తావించదల్చుకోలేదు. అవి అరిగిపోయిన రికార్డులుగా మారిపోయి అటకెక్కాయి. పోలీసు తనను తాను సంస్కరించుకునే విధానాన్ని అవలంబించడం అలవర్చుకోక తప్పదు. అదీ తన అస్తిత్వం కోసమే!

సీఎం గారు ప్రస్తావించిన మరో విషయం. హోంగార్డ్స్‌ను గురించి. జీతాలు పెంచడం సంతోషించదగ్గ విషయమే కానీ వారికి ఒక హోదా అవసరం. పోలీసులకు సమానంగా కాకపోయినా పోలీసు వ్యవస్థలో ఇది నీ స్థానం అని గౌరవప్రదంగా వారికి అధికారికంగా తెలియచేయడం! అన్నిటికీ కావాలి గానీ, అవసరం తీరింతర్వాత ఎవరికీ అక్కర్లేదు అన్న తృణీకార భావన నుంచి వారిని విముక్తులను చేసే విధానాన్ని అమలుపరిస్తే బాగుంటుంది.

ఏది ఏమైనా సీఎం అయిన తర్వాత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పోలీసులకు, హోంగార్డ్స్‌కు సంబంధించిన ప్రాథమిక అవసరాలను, పాలకుడిగా గుర్తించినందుకు సంతోషిస్తూనే, ఆయన పని ఒత్తిడిలో పోలీసుల పని ఒత్తిడిని తొలగించడం మర్చిపోరని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త ఐపీఎస్ అధికారి (రిటైర్డ్)
మొబైల్ : 80080 02909

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
16-6-2019



● చంద్రబోస్ తండ్రి నర్సయ్య



● చంద్రబోస్

# నాన్నా! నేనున్నాను

అమ్మ పాలు పడితే
నాన్న జీవితాన్ని పిండి చెమట చిందిస్తాడు.
పాలు తియ్యగా ఉంటాయి.
చెమట ఉప్పగా ఉంటుంది.
ఇవాళ తిన్న ఆ ఉప్పుకి రుణం తీర్చుకోవాలి.
'నాన్నా! నేనున్నాను' అని అయినా చెప్పండి.

ఎడిటర్, ఫీచర్స్

**● జనరల్‌గా అమ్మ గురించి ఎక్కువగా మాట్లాడతాం.. నాన్న గురించి తక్కువ మాట్లాడినట్లనిపిస్తుంటుంది. ఎందుకు అమ్మ గురించే ఎక్కువ మాట్లాడతాం?**

నిజమే. సమాజంలో అమ్మ గురించి మాట్లాడినంత ఎక్కువగా నాన్న గురించి మాట్లాడం. అలాగని నాన్నను తగ్గించినట్లు కాదు. నాన్నను అర్థం చేసుకోవడంలో మనదే లోపం. సత్యం మాతా; పితా జ్ఞానం అన్నారు. సత్యం తల్లి. జ్ఞానం తండ్రి. కానీ నా దృష్టిలో ఇది సత్యం... ఇది అసత్యం అని తెలుసుకోవడానికి కూడా జ్ఞానం కావాలి. కాబట్టి నాన్న ఎప్పుడూ గొప్పవాడే. నాన్నను తక్కువ చేసినా అది తక్కువయ్యేది కాదు. ఎందుకంటే ''కని పెంచిన మా అమ్మకే అమ్మయ్యానుగా.. నడిపించిన మా నాన్నకు నాన్నయ్యానుగా'' అని 'మనం' సినిమా కోసం పాట రాశాను. చెడ్డ ప్రియురాలు ఉండొచ్చు. చెడు స్నేహితురాలు ఉండొచ్చు. కానీ చెడ్డ తల్లి ఉండదు అంటారు. అమ్మ కని పెంచుతుంది. అసలైన జీవన మార్గంలో మనం ముందుకు వెళ్లడానికి, మన లక్ష్యం వైపు వెళ్లడానికి శక్తిని, సామర్థ్యాన్ని, తెలివిని, విద్వత్తును ఇచ్చి దారిని చూపించి .. ఇలా వెళ్లు నీ గమ్యం వస్తుంది అని ఒక సద్బుద్ధిని, సన్మార్గాన్ని చూపించేవాడు నాన్న. నా దృష్టిలో కని పెంచడం కన్నా.. నడిపించేవాడు ఇంకా గొప్ప. ఎందుకంటే... తల్లి కన్న తర్వాత వాడు మంచివాడు కావొచ్చు. చెడ్డవాడు కావొచ్చు. కానీ నడిపించేవాడు.. నడిపించే శక్తి లేకపోతే వారు దుర్మార్గులు కూడా అవొచ్చు. రాక్షసులు కావొచ్చు. నడిపించేవాడు సరిగ్గా ఉంటేనే కని పెంచినదానికి ఓ అర్థం.

**● నాన్న గురించి ఇంత బాగా చెప్పారు. అమ్మ గొప్పతనం గురించి 'పెదవే పలికిన మాటల్లోనే తియ్యని మాటే అమ్మ' అని రాశారు. ఆ పాట రాసిన క్షణాలను గుర్తు తెచ్చుకుంటారా?**

మా అమ్మగారిని ఊహించుకునే ఆ పాట రాశాను. ఎందుకంటే ఆ ట్యూన్ నా దగ్గరకు వచ్చేసరికి రాత్రి 11 అయ్యింది. నేను భోజనం చేసి అంతా సిద్ధం చేసుకునే సరికి 12 అయ్యింది. పాట రాయడానికి అప్పుడు కూర్చున్నాను. ఆ ట్యూన్ కొత్తగా ఉంటుంది. ఆస్వాదించి రాయాలి. ఒంటి గంటకు ఆ ప్రవాహం ప్రారంభమైంది. రాసే ముందు మా అమ్మను ఓసారి తలుచుకున్నాను. ఆమె పడ్డ కష్టాన్ని, చేసిన త్యాగాన్ని, శ్రమను గుర్తు చేసుకున్నా. అలాగే నా పిల్లలకు తల్లి అయిన నా భార్య గురించి ఆలోచించాను. అలా నాకు ఇద్దరు అమ్మలు. వారిద్దరినీ నా మనో ఫలకంపై గుర్తు చేసుకున్నాను. నాకు తెలియకుండానే, నాలో ఏదో శక్తి ప్రవేశించి ఆ పాట రాయించిందని నా అభిప్రాయం. ఆ రోజు ఆ పాటను నేను రాశానా? లేక మా అమ్మ రాయించిందా. నా భార్య రాయించిందా? లేక పైన ఉన్న ముగ్గురమ్మల మూలపుటమ్మ రాయించిందా? తెలియదు. ప్రపంచంలోని అమ్మలందరికీ చెందుతుంది ఈ పాట. ఎందుకంటే మనలోని ప్రాణం అమ్మ. మనదైన రూపం అమ్మ. ఎనలేని జాలిగుణమే అమ్మ. నడిపించే దీపం అమ్మ. కరుణించే కోపం అమ్మ. వరమిచ్చే తీపి శాపం అమ్మ. అమ్మ కోప్పడినా అది కోపం కాదు కరుణ. కరుణకు మరో రూపం. అమ్మ శాపనార్థాలు పెట్టినా అవి మనకు దీవెనలే. అమ్మ మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహిస్తే మనకు అది అర్థం అవుతుంది. ఆ దూషణలే తర్వాత భూషణలు అవుతాయి అని. ఆ ఆంతర్యాన్ని మనం అర్థం చేసుకుని మనల్ని మనం మార్చుకుంటే..మనల్ని మనం మలుచుకుంటే ఆ తిట్లు మనం జీవితంలో పైకి రావడానికి మెట్లుగా వాడుకోవచ్చు. ప్రతి తిట్టు మనం పైకి ఎదగడానికి దోహదపడటానికి మెట్టు.

**● నాన్న గురించి పాట రాయలేదేమో?**

ఆ అవకాశం నాకు 'శత్రువు' అనే చిన్న సినిమాకి వచ్చింది. అయితే 'మనం' సినిమాలో అమ్మ గురించి, నాన్న గురించి ఒకే పాటలో రాసే అవకాశం వచ్చింది. ఆ సినిమాలో 'ఒకరిది కన్ను.. ఒకరిది చూపు' అని రాశాను. కన్ను అమ్మ అయితే చూపు నాన్న. కన్ను మూసుకుంటే లాభం ఏముంది? తెరిచి చూడాలి. కంటికి ప్రయోజనం చూపు. చూపుకి ఎంత ప్రయోజనం ఉందో చెబుతున్నాం. అలాగే 'ఒకరిది మాట ఒకరిది భావం' అని రాశాను. అంటే మాట ఒకరు.. అర్థం ఒకరు అని. మాట లేనిదే అర్థం లేదు. అలాగే మాటల్లేని భావం కూడ వ్యర్థమే. మాట, అర్థం రెండూ ఉండాలి. తల్లిదండ్రుల్లో ఎవరు గొప్పవారు అనే విషయం పక్కనపెడితే ఇద్దరి కలయికలోనే మనం వచ్చింది. మన శరీరంలోని ప్రతి కణంలో వారి తాలుకూ అంశలు ఉంటాయి. అమ్మలోని ఓర్పు... నాన్నలోని చాకచక్యం. తెలివి ఇలా అన్నీ ఉంటాయి. బీజం, క్షేత్రం రెండూ ఉంటేనే కదా ఫలం వచ్చేది. వారిద్దరికీ సమప్రాధాన్యం ఉంది కాబట్టే మనం ఈ రోజు ఇలా ఉన్నాం.

**● రచయితగా మీరు సంపాదించిన కీర్తి ఎంతో. ఆ విజయానికి మీ నాన్న వ్యక్తపరిచిన ఆనందం గురించి?**

అదో అంతు చిక్కని ప్రశ్న. నేను మా ఊరు వెళుతుంటాను. నా చిన్నప్పుడు ఎలా ఉండేవారో నాతో నాన్న ఇప్పుడూ అలానే ఉంటారు. వేరేవాళ్లతో అలానే ఉంటారు. నా గురించి గొప్పగా మాట్లాడినా అలానే ఉంటారు. అదే ఆశ్చర్యం వేస్తుంది. చిన్నప్పుడు సైకిల్ మీద 20 కిమీ వెళ్లినప్పుడు ఎలాంటి వ్యక్తిత్వం ఉందో ఇప్పుడు బెంజి కారులో తీసుకెళ్లినా అదే వ్యక్తిత్వం. మట్టిని వదలని మనస్తత్వం ఆయనది. పిల్లల విజయాన్ని బయటకు వ్యక్తపరచకుండానే ఆస్వాదిస్తారు.

**● అమ్మానాన్నను పాటల రూపంలో కీర్తించడం బాగుంది. కానీ మనం వారిని ఎలా చూసుకోవాలి?**

మన కోసం ఎన్నో కష్టనష్టాలు, వ్యయప్రయాసలను ఓర్చుకుంటారు. త్యాగాలు సపర్యలు, సేవలు చేసీ చేసీ వాళ్ల యవ్వనాన్నంతా మనకోసం ధారపోస్తారు. వాళ్లు తాజాగా ఉన్నప్పుడు మన కోసం కరిగిపోతారు. వారి శరీరం వంగిపోయినప్పుడు, ముడతలు పడేలా కష్టపడినప్పుడు, వారి వృద్ధాప్యంలో మనం వారికి ఏం చేస్తున్నాం? ఏం చేయాలి? అన్నది ముఖ్యం. 'అ ఆ ఇ ఈ నేర్పిన అమ్మకు గురువును అవుతున్నా.. అడుగులు, నడకలు నేర్పిన నాన్నకు మార్గం అవుతున్నా' అని పాటలో రాశాను. చిన్నప్పుడు మనకు అడుగులు, నడకలు నేర్పించిన నాన్నకు మనం నేడు మార్గం కావాలి. దారి చూపించాలి. ఇప్పటి కాలంలో మనం సాంకేతికంగా చాలా ముందు ఉన్నాం. ఇదంతా నాన్నకు తెలియదు. మనం నాన్నకు తెలియజెప్పాలి. చెప్పడానికి విసిగించుకోకూడదు. చీదరించుకోకూడదు. నాన్నకు అన్నీ బోధపడేలా చెప్పాలి. ఆయన మనకోసం చేసిన త్యాగాలకు ప్రతిఫలంగా మనం ఏం ఇస్తున్నాం? ఆ వయసులో వారు కోరుకునేదేంటి? కాస్తంత ప్రశాంతత. వాళ్లు ప్రశాతంగా ఉండేలా చూడాలి. మన పిల్లలతో ఆడుకునే సమయాన్ని ఇవ్వాలి. ఆయన తన అనుభవాలను చెబుతుంటే శ్రద్ధగా వినాలి. విని వారిని సంతోషపెట్టాలి. వారి మాటల్లోని అనుభవసారాన్ని గ్రహించి మన జీవితాన్ని చక్కదిద్దుకోవాలి. అప్పుడు వారి వృద్ధాప్యం కూడా బాగుంటుంది. వృద్ధాప్యం వారికి శాపంలా అనిపించకూడదు. స్వామి వివేకానంద 'భరత భూమి నా బాల్యడోల. నా యవ్వన నందనవనం. నా వార్ధక్యం వారణాసి' అన్నారు. వారణాసి అంటే పుణ్యక్షేత్రం. వృద్ధాప్యం అంత పవిత్రమైనది అని అర్థం. మనం అంత పవిత్రంగా వారిని చూసుకోవాలి. వారు ఉండే వాతావరణం కానీ ప్రదేశాన్ని బాగా ఉంచాలి. తల్లిదండ్రులను బాగా చూసుకుంటే వారి రుణం తీర్చుకున్నట్లే అంటారు. కానీ ఆ రుణం తీరనిది. మనం దయా రుణాన్ని మాత్రమే తీర్చుకుంటాం. అది ప్రయత్నం. మనకు ఇంత గొప్ప శరీరాన్ని, మనస్సును, జ్ఞానాన్ని అందించారు. ప్రపంచంలోకి తెచ్చారు. ఇన్ని ఇచ్చిన తల్లిదండ్రులు అడుగులు తడబడే వయసులో ఉన్నప్పుడు వారికి మనం ఊతకర్ర అవ్వాలి.

**● తల్లి ఎక్కువా? తండ్రి ఎక్కువా?**

ఇద్దరూ సమానమే. మనకు తల్లి అందించే చనుబాలు ఎంత గొప్పవో తండ్రి చిందించే చమట నీళ్లు కూడా అంతే గొప్ప. రెండిటికీ ఒకటే విలువ అని అంటాను. తల్లి 9 నెలలు మోస్తుంది. తండ్రి తాను బతికున్నంత కాలం మనల్ని మోస్తూనే ఉంటాడు. తన ఊహల్లో, జ్ఞాపకాల్లో తన ఆలోచనల్లో తన కలల్లో నిరంతరం మోస్తూనే ఉంటాడు.

**● మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్న విషయాలు?**

పిల్లలం ఒక్కోసారి తల్లి చెప్పింది చేస్తాం. ఒక్కోసారి చేయం. కానీ తండ్రి చేసేది మాత్రం కచ్చితంగా వింటాం. అంటే ఆచరిస్తాం అని అర్థం. మా అమ్మ మాకు రకరకాల విషయాలు చెబుతుండేది. జీవితం అంటే ఏంటి? కష్టం, సుఖం ఇలా తనకు తెలిసిన మాటల్లో చెప్పేది. కానీ నాన్న మాత్రం చేస్తుండేవారు. మా నాన్నను చూసి ఒకటే నేర్చుకున్నాం. అది చాలా గొప్ప విషయం. అది గొప్పదని ఎలా తెలిసిందంటే... నాకు జ్ఞానం కలిగాక, చాలా అధ్యయనం చేశాక తెలిసిందే. ఒక శ్లోకం చదివాను. 'శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిబిం పరోపకారం పుణ్యాయ పాపాయ పరపీడనం'. దీని అర్థం ఏంటంటే.. కోటి గ్రంథాలను కాచి వడపోసి ఒక సగం శ్లోకంలో ఇమిడిస్తే 'పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం అయింది'. గ్రంథాలు, పురాణాలు, ఉపనిషత్తులు.. అన్నింటి సారాంశం ఇదే. ఈ విషయాన్ని మా నాన్న అమలు చేశారు. నేను విన్నాను, చూశాను. నాన్న పరోపకారం చేశారు. పరపీడన చేయలేదు. ఆయన చర్యలు, ఆయన చేష్టలు, ఆయన క్రియల ద్వారా ఇది తెలుసుకున్నాను. పరులను ఇబ్బంది పెట్టడం, ఇతరుల సొమ్ము ఆశించడం ఎప్పుడూ చేయలేదు. దీన్నంతా నేను చిన్నప్పటి నుంచి గమనిస్తున్నాను. మా నాన్నగారి దగ్గర నేర్చుకున్న ఒకే ఒక్క విషయం అది. దాన్ని పాటిస్తున్నాను. కుదిరితే సాయం చేయాలి కానీ ఇతరులను ఇబ్బంది పెట్టకూడదు.

కపిల్ చిట్స్ మీ వెంట
ఆనందం మీ ఇంట
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం
sricharanamedia.com

**● మీ నాన్నకు, నాన్నగా మీకు ఉన్న తేడా లేంటి?**

అప్పట్లో మా నాన్నకు ఉన్న పరిధులు వేరు. మేం నలుగురు సంతానం. ఆయనకు సంపాదన అంతగా లేదు. మాది పల్లెటూరు. మమ్మల్ని పెంచడానికి వాళ్లు చాలా కష్టపడ్డారు. మేం కూడా వాటిని అర్థం చేసుకొని పెరిగాం. నేను నాన్న అయ్యేసరికి ఆ కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు లేవు. కాబట్టి పిల్లల్ని పెంచడానికి కష్టపడలేదు. అయితే సాధారణంగా కష్టాల నుంచి సగం నేర్చుకుంటారు. మేం నేర్చుకున్నాం. జీవితం గురించి తెలుసుకున్నాం. నా పిల్లలకు నేర్చుకునే అవకాశం పోయింది. అన్ని సదుపాయాలు కల్పించి, అందించి పిల్లల్ని పెంచడానికి మించిన దురదృష్టం ఇంకోటి లేదు. దాని వల్ల వాళ్లు చాలా కోల్పోతారు. ఇప్పుడు వాళ్లని పెంచడానికి ఇంకా ఎక్కువ కష్టపడుతున్నాను. మంచి మార్గంలో నడపడానికి, బోధించడానికి కష్టపడుతున్నాను. మా నాన్న జీవించడానికి కష్టపడారు. నేను జీవితాన్ని బోధించడానికి కష్టపడుతున్నాను.

**● పాటల్లో మీకు నచ్చినవి?**

నాన్న మీద చాలా తక్కువ పాటలు వచ్చాయి. కవులందరూ అమ్మల్నే కీర్తించారు. ఈ మధ్య నాన్న గురుంచీ రాస్తున్నారు. విన్నారో లేదో కానీ ఈ మధ్య ఓ గజల్ బాగా ఫేమస్ అయింది. 'నాన్న నాకు చొక్కా తొడుగుతున్నాడు అనుకున్నాను. కానీ కనిపించని ఒక కవచం అది. నన్ను గాల్లో ఎగరేస్తున్నాడు అనే అనుకున్నాను కానీ నాలో ధైర్యాన్ని నింపుతున్నాడు' అంటూ ఆ గజల్ సాగుతుంది. అది విన్నప్పుడల్లా నాకు చాలా సంతోషం కలుగుతుంది. 'నాన్నకు ప్రేమతో' సినిమాలో నాన్న పాట కూడా బావుంటుంది.

**● ఇప్పటి పిల్లలకు ఎక్కువ స్వేచ్ఛనిస్తున్నాం కదా?**

అవును. ఇప్పుడు నా పిల్లలకు వారు ఎంచుకునే మార్గంలో నడిచే స్వేచ్ఛ ఉంది. చిన్నప్పుడు నాకు అది లేదు. పాటలు పాడకుండా మంచి ఉద్యోగం చేయి అంటూ అప్పుడప్పుడు కోప్పడేవారు నాన్న. మనకు అవి తిండిపెట్టవు, చదువుకోమని చెప్పేవారు. అలా నా చేతికి సంకెళ్లు ఉండేవి. ఆ సంకెళ్లతోటే నేను స్వేచ్ఛగా ఎగరగలిగాను. ఆ సంకెళ్లు వేసుకునే ఎగిరే విద్య నాకు అబ్బింది. ఆ సంకెళ్లు నాకు వరం అయ్యాయి. విహరించే శక్తి, ఓర్పు నేర్చుకున్నాను. ప్రతికూల పరిస్థితులలో కూడా నన్ను నేను మలుచుకున్నాను, చెక్కుకున్నాను. దానివల్ల ఏ పరిస్థితిని అయినా ఎదుర్కొనే శక్తి ఏర్పడింది. ఇప్పటి తరానికి ఆ అవకాశం తక్కువ. ఇప్పటి పిల్లలకు సంకెళ్లు లేవు. పూర్తిగా స్వేచ్ఛ ఉంది. ఆ స్వేచ్ఛ దుర్వినియోగం అవ్వకుండా ఏం చేయాలో మనం చెప్పాల్సి వస్తోంది.

**● పిల్లల్ని ఒకప్పుడు అమ్మే ఎత్తుకునేది. ఇప్పుడు నాన్న కూడా పిల్లల్ని ఎత్తుకుంటారు. ఈ మార్పు గురించి చెప్పండి? నాన్నకు అమ్మతనం వచ్చిందా?**

ఈ విషయాన్ని మనం రెండు కోణాల్లో చూడొచ్చు. చిన్నప్పుడు మా నాన్న దర్జాగా ముందుకు నడుచుకుంటూ వెళ్లారు. మా అమ్మ మమ్మల్ని ఎత్తుకొని వెళ్లేది. ఇప్పుడు నాన్న ఎత్తుకుంటున్నారు. వంట పని షేర్ చేసుకుంటున్నారు, ఆర్థిక స్వాతంత్ర్యం స్త్రీకి వచ్చింది. ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఆర్థిక భారాన్ని ఇద్దరూ పంచుకుంటున్నప్పుడు, బాధ్యతనూ ఇద్దరూ మోస్తున్నారు. వంటలు అమ్మకే పరిమితం కాదు. స్త్రీకి లభించిన విద్య, ఉద్యోగ అవకాశాలు వల్ల ఆర్థికంగా వాళ్ల భర్తకు తోడు రావడంతో ఇప్పుడు అన్నీ ఇద్దరూ పంచుకునేలా మారాయి. ఇది మంచి పరిణామం.

**● మగవాళ్లు ఇంటి పనులు పంచుకుంటే తక్కువ అయిపోతారనే భావన సమాజంలో పూర్తిగా పోయిందంటారా?**

పూర్తిగా పోయిందని చెప్పలేం. అక్కడక్కడా ఇంకా ఇలాంటి భావాలు ఉన్నాయి. అయితే నేను 'మాతృత్వపు మాధుర్యానికి మగ రూపం నాన్న' అనే వాక్యం ఓ పాటలో విన్నాను. ఇప్పుడు నాన్న కూడా చాలా మెత్తబడిపోతున్నాడు. ఇంతకుముందు అమ్మ మృదువుగా ఉండేది నాన్న కఠినంగా ఉండేవారు. ఇప్పుడు నాన్న కూడా మృదువుగా మారిపోతున్నాడు. ఇంతకుముందు హూంకరించేవాడు, గర్జించేవాడు. ఇప్పుడు లాలించడమే. నాన్న కూడా ఎత్తుకుంటున్నాడు, వంట చేస్తున్నాడు, డైపర్ మార్చడం చేస్తున్నాడు. ఇల్లు శుభ్రం చేస్తున్నాడు. పిల్లల సంరక్షణ భారంలో పాలుపంచుకుంటున్నాడు. ఓ రకంగా చాలా మంచి మార్పు. ఇద్దరు కలసి కన్నారు.. ఇద్దరు కలసి పెంచాలి. ఇద్దరూ కలసి తీర్చిదిద్దాలి. ఇలా చేయడం హర్షణీయం.

**● మీ చిన్నతనంలో పేదరికం అనుభవించారు. ఇప్పుడు పరిస్థితి వేరు. మరి మీ నాన్న కోసం మీరు ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి?**

చిన్నప్పుడు పాటలు వినడానికి మాకు రేడియో లేదు. ఒక కరెంట్ బల్బ్ ఉండేది. పాటలు ఎలా వినేవాడిని అంటే.. అప్పట్లో రేడియోలో జనరంజని ప్రోగ్రామ్ వచ్చేది. మా చుట్టుపక్కల చాలా మందికి రేడియో ఉండేది. పక్క వాళ్ల ఇంట్లో పల్లవి వచ్చేది. ఆ ఇల్లు దాటే లోపే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్. ఇంకో ఇంటికి చేరుకునే సరికి చరణం వచ్చేది. అలా పాటలు వినేవాణ్ణి. రేడియో లేదు అని నిరాశ చెందకుండా వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకోవాలి అనుకునేవాణ్ణి. ఏకసంథాగ్రాహిత్వం ఆ పేదరికం నుంచే వచ్చింది. రేడియో లేకపోవడం నుంచి వచ్చింది. ఫ్యాను, కనీస వసతులు లేకపోవడం వల్ల ఏ చిన్న అవకాశం దొరికినా కూడా చాలా జాగ్రత్తగా పట్టుకోవాలి. ఓ రూపాయి, పాటల పుస్తకం దాచుకోవడం లాంటి లక్షణాలు వచ్చాయి. మా ఊళ్లో మా నాన్నకు మేం పిల్లలందరం కలసి ఇల్లు కట్టాం. కలర్ టీవీ, ఫ్రిజ్, గీజర్ ఇలా అన్నీ పెట్టాం. అన్ని సౌకర్యాలతో కట్టాం. మేమెలా ఉన్నామో వాళ్లు అలానే ఉండాలని అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. మా అమ్మగారు ఈ మధ్య చనిపోయారు. అది పెద్ద బాధ.

**● మరి.. వృద్ధాప్యంలో ఉన్న నాన్న ఒంటరి జీవితం గడపబోతున్నారా?**

ఇప్పుడు మా నాన్న ఒక్కరే ఉంటున్నారు. అయితే నాన్నని ఇకనుంచి నా దగ్గరే పెట్టుకుంటాను. నాతోపాటే మా నాన్న ఉంటారు. నా పెళ్లయిన తర్వాత పదేళ్ల వరకూ కూడా నాతోనే ఉన్నారు. ఇల్లు కట్టాక సరదాగా ఉందాం అని అక్కడ ఉన్నారు.

**● సో.. ఈ ఫాదర్స్ డే తర్వాత మీ నాన్న ఇక మీతోనే ఉంటారన్న మాట..**

అవును. నేనున్నంతవరకూ నాన్న నాతోనే ఉంటారు.

– డి.జి. భవాని

నాన్న అన్న పిలుపు

# పురుషులలో సంతాన లేమి సాఫల్యానికి మార్గాలు



ఫాదర్స్‌డేకి కాస్త ముందు వెనకలుగా కొన్ని దేశాలలో మెన్స్ హెల్త్ వీక్ జరుపుకుంటాయి. ఈ సంవత్సరం మెన్స్ హెల్త్ వీక్ ఈ నెల 10న ఆరంభం అయింది. నేటితో ముగుస్తోంది. పురుషులు తమ ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టి, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన సరైన సమయమిది.

బిడ్డకు తల్లి లేదా తండ్రి కావడమనేది ఎంతో ఆనందించదగ్గ విషయం. దురదృష్టవశాత్తూ ప్రస్తుత జీవనశైలిని బట్టి ఇటీవలి కాలంలో చాలా దేశాలలో అదొక పెద్ద సవాలుగా మారింది భారతీయ జనాభాలో వంధ్యత్వం దాదాపు 10 నుంచి 14 శాతం మందిపై ప్రభావం చూపుతోంది. ఎటువంటి గర్భనిరోధక సాధనాలు వాడకుండా ఏడాది పాటు సంసార జీవితం గడుపుతున్నా సంతానం కలగకపోవడాన్ని వంధ్యత్వం అనవచ్చు.

ఇంచుమించు అన్ని వంధ్యత్వ కేసులలోనూ, 40 నుంచి 50 శాతం వరకు పురుషులలో వంధ్యత్వానికి సంబంధించినవే. సంతాన లేమితో బాధపడుతున్న చాలామంది పురుషులు దాంపత్య జీవనంలో తమకు ఎదురవుతున్న సవాళ్లను, సమస్యలను ఎవరికీ చెప్పుకోకపోవడం దురదృష్టకరం..

లైంగికపరమైన స్తబ్ధత, తక్కువస్థాయిలో వీర్యం ఉత్పత్తి కావడం. వీర్య ఉత్పత్తిలో అసాధారణ పరిణామాలు, లేదా వీర్యనాళాలలో బ్లాకేజీలు వంటివి వంధ్యత్వానికి ప్రధాన కారణాలు. జబ్బుపడటం, తీవ్ర గాయాల పాలుకావడం, అసాధారణమైన ఆరోగ్య సమస్యలు, జీవనశైలి లక్షణాలు, తదితరమైనవి పురుష వంధ్యత్వానికి దారితీసే మౌలికాంశాలు.

## సంతానలేమికి ఇతర కారణాలు

**తక్కువ వీర్యకణాలు ఉండటం:** వీర్యంలో మిల్లీలీటరుకు 15 మిలియన్ల కణాలకన్నా తక్కువ ఉండటాన్ని తగినన్ని వీర్యకణాలు లేకపోవడంగా పరిగణింపవచ్చు. సంతానం లేని దంపతులలో దాదాపు మూడవ వంతుమంది జంటలకు తక్కువ వీర్యకణాల వల్లనే సంతానం కలగడం లేదు.

**వీర్యకణాల కదలిక తక్కువగా ఉండడం:** వీర్యంలోనుంచి వీర్యకణాలు అండాన్ని చేరి, ఫలదీకరణ చెందాలంటే కణాలు చురుకుగా కదలాలి. కణాలు ఈదలేకపోతే ఫలదీకరణ జరగదు.

**అసాధారణమైన వీర్యం:** వీర్యకణాలకు సరైన ఆకారం లేకపోవడం వల్ల అండంలోనికి చొచ్చుకు పోలేకపోవడాన్ని అసాధారణమైన వీర్యంగా చెప్పవచ్చు.

పురుషులలో వంధ్యత్వానికి దారితీసే ఇటువంటి పరిణామాలకు వృషణాలకు ఇన్ఫెక్షన్ సోకడం లేదా విపరీతమైన వేడిమికి గురవడం, వెరికోసిల్, హార్మోన్ల అసమతుల్యత, జన్యుపరమైన కారణాలు, క్యాన్సర్, శస్త్రచికిత్సలు మొదలైన కారణాలు ఉండవచ్చు.

## వంధ్యత్వానికి దారితీసే కారకాలు

ధూమపానం, మద్యపానం, యాంటిబయొటిక్ స్టెరాయిడ్ల వాడకం, అధికంగా చక్కెర కలిపిన శీతల పానీయాలు సేవించడం, రసాయనాల ప్రభావానికి గురికావడం, అధికబరువు లేదా స్థూలకాయం, మానసిక ఒత్తిడి, అధికంగా వ్యాయామం చేయడం. రోజుకు మూడుగంటల కన్నా ఎక్కువసేపు టీవీ చూడటం, రెండుగంటల కన్నా ఎక్కువగా మొబైల్ ఫోన్లను వాడటం, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఉన్న ప్రదేశానికి కి.మీ. పరిధిలో నివసించడం వల్ల కూడా వీర్యం తగిన పరిణామంలో ఉత్పత్తి కాదు.

## వీర్యకణాలలో డి.ఎన్.ఎ. విచ్ఛిత్తి చెందడం

ఒక్కోసారి వీర్యకణాలలో డిఎన్ఎ విచ్ఛిత్తి చెందడం వల్ల కూడా పురుషులలో వంధ్యత్వానికి దారితీసే అవకాశం ఉంది. పరిసరాల ప్రభావం, కొన్ని రకాల జీవనశైలి అలవాట్ల వల్ల డిఎన్ఎ విచ్ఛిత్తి చెందుతుంది. రసాయనాల ప్రభావానికి గురికావడం, తీవ్రమైన వేడిమి ఉన్న ప్రదేశాలలో పని చేయడం, ధూమపానం డిఎన్ఎ విచ్ఛిత్తికి దారితీస్తాయి.

## సాఫల్యానికి సలహాలు

తగినంత నీటిని తాగడం, పిల్లలకోసం ప్రయత్నించడానికి కనీసం రెండు మూడు నెలల ముందు నుంచి ధూమపానాన్ని మానివేయడం, పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే టొమాటో, చిలకడ దుంపలు, పుచ్చ, గుమ్మడి, క్యారట్లు, చేపలు, వాల్‌నట్స్, బ్లూ బెర్రీస్, దానిమ్మ, డార్క్ చాకొలేట్స్ వంటి వాటిని తినడం మంచిది.

డాక్టర్ స్వప్నాశ్రీనాథ్
ఎఫ్ఎన్‌బి రిప్రొడక్టివ్ మెడిసిన్,
ఫెర్టిలిటీ స్పెషలిస్ట్
కోమలి ఫెర్టిలిటీ సెంటర్ (ఏ యూనిట్ ఆఫ్ రమేష్ హాస్పిటల్స్)
గుంటూరు – విజయవాడ;
ఈమెయిల్:
drswapnasrinath@gmail.com

మంచి విషయం

## గ్రిడ్ గర్ల్స్



● గ్రిడ్ గర్ల్స్



● రాయ్ వాన్ ఆల్స్ట్

క్రికెట్‌లో చీర్‌గర్ల్స్ ఉన్నట్లే ఎఫ్1 రేస్‌లో గ్రిడ్ గర్ల్స్ ఉంటారు. రేస్ ఈవెంట్స్‌ని ఉల్లాస పరిచేందుకు మధ్య మధ్య మెరుపుల్లా కనిపించి పోతుంటారు. అయితే విజేతలు అత్యుత్సాహంతో వీళ్లపై షాంపెయిన్ చల్లడం, వాళ్లను హత్తుకోవడం వంటి పనులు చేస్తుండడంతో చాలా దేశాల్లో గ్రిడ్ గర్ల్ సంప్రదాయాన్ని నిషేధించారు. ఇప్పుడు నెదర్లాండ్స్ ఎంపీ రాయ్ వాన్ ఆల్స్ట్ ఈ నిషేధం తెలివితక్కువ పని అని సంచలనాత్మక వ్యాఖ్య చేశారు. శనివారం ఓ ఈవెంట్‌లో గ్రిడ్ గర్ల్స్‌ని రీ–ఇంట్రడ్యూస్ చేస్తూ వాళ్లతో కలిసి ఫొటోలు కూడా దిగారు! ''బుద్ధిహీనుడికి మాత్రమే అందమైన మహిళ సమస్యగా కనిపిస్తుంది'' అని రాయ్ అన్నారు.

## భారీ నిరసన

లైంగిక వివక్షకు, అనేక విధాలైన అసమానతలకు వ్యతిరేకంగా స్విట్జర్లాండ్‌లో వేలాది మంది మహిళలు శనివారంనాడు వీధులలోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. ఒంటిపై 'బ్రా'లను తీసి మంటల్లో కాల్చేశారు. సమాన పనికి సమాన వేతనం, సమాన శ్రమకు సమాన హోదా ఇవ్వాలని వారంతా నినదించారు. ఉద్యోగినులు ఆఫీసుల నుంచి బయటికి వచ్చి మూకుమ్మడిగా ప్రదర్శన జరపడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించి పోయింది. సమాన హక్కుల కోసం ఇంత పెద్ద ఎత్తున స్విట్జర్లాండ్ మహిళలు జాతీయస్థాయి ఉద్యమాన్ని లేవదీయడం ఈ 28 ఏళ్లతో ఇదే మొదటిసారి.



● స్విట్జర్లాండ్ మహిళలు

## హుషార్ కపూర్



● కొడుకు లక్ష్యతో తుషార్ కపూర్

ఇవాళ ఫాదర్స్ డే కదా.. తుషార్ కపూర్ హుషారుగా ఉన్నాడు! అయన పెళ్లి చేసుకోలేదు కానీ సింగిల్ పేరెంట్. అద్దెగర్భంతో ఒక బిడ్డకు జన్మనిచ్చి, వాడికి లక్ష్య అనే పేరు పెట్టుకుని తన జీవితాన్ని క్రమబద్ధం చేసుకున్నాడు ఈ బాలీవుడ్ నటుడు, నిర్మాత. ''లక్ష్య అవసరాలకు అనుగుణంగా నేను నా టైమ్‌ని సెట్ చేసుకున్నాను. దీనివల్ల నా జీవితం కూడా గాడిలో పడింది'' అంటున్నారు తుషార్.


● అర్జున్, ఐశ్వర్య

# సంపద కాదు.. సంస్కారం ఇచ్చారు

**'మీరెలాంటి ఫాదర్' అంటే 'మా నాన్నంత బెస్ట్ నేను కాదు' అంటారు అర్జున్. ఒక మంచి తండ్రి ఎలా ఉండాలో తన తండ్రిని చూసి నేర్చుకున్నాను అంటున్నారు. ఇంకా అర్జున్ చెప్పిన విశేషాలు.**

**➡ ఒక మంచి తండ్రి అనిపించుకోవాలంటే ఎలా ఉండాలి?**

ఒక మంచి తండ్రి అనిపించుకోవాలంటే మా నాన్నలా ఉండాలి. ఏ తండ్రి అయినా పిల్లలకు కొంచెం సంస్కారం ఇవ్వాలి. అది నా తండ్రి నాకు ఇచ్చారు. పిల్లలకు ఆస్తులు కూడబెట్టి ఇస్తారు కొందరు. లేనివాళ్లు ఇవ్వలేరు. అయితే సంస్కారం అనేదానికి డబ్బు అక్కర్లేదు. ఆ తండ్రి సంస్కారవంతుడు అయితే బిడ్డలకు కూడా అదే నేర్పిస్తాడు. నా తండ్రి (అర్జున్ తండ్రి జేసీ రామస్వామి నటుడు – ఆయన స్క్రీన్ నేమ్ శక్తిప్రసాద్) మాకు సంపద కాదు.. సంస్కారం ఇచ్చారు.

**➡ సంస్కారం ఉన్నవాళ్లు తమ సంసారం విషయంలో చాలా బాధ్యతగా కూడా ఉంటారు. కుటుంబం విషయంలో మీ తండ్రి తీసుకున్న కేర్ గురించి?**

పెళ్లి చేసుకుని పిల్లల్ని కంటే తండ్రి అయిపోడు. పెళ్లంటే పెద్ద బాధ్యత. భార్యని తన తల్లిలా చూసుకునేవాడే నిజమైన తండ్రి.. బిడ్డల్ని కూడా తల్లిలా చూసుకోవాలి. భార్యని, పిల్లలను సరిగ్గా చూసుకోలేనివాళ్లు పెళ్లి చేసుకోకూడదు. అలాంటి మగవాళ్లకు పెళ్లి చేసుకునే అర్హత లేదని నా అభిప్రాయం. ఎఫెక్షన్, కేరింగ్ అనేవి చాలా ముఖ్యం. మా నాన్న చనిపోయి దాదాపు 30 ఏళ్లు అయింది. ఇప్పటికీ ఆయన తాలూకు జ్ఞాపకాలు నాలో సజీవంగా ఉన్నాయి. అంతలా మీ నాన్నగారు మీకోసం ఏం చేశారంటే ఒకటి, రెండు, మూడు... అని లెక్కేసి ఇన్సిడెంట్స్ చెప్పలేను. అదొక ఫీలింగ్. నేను స్కూల్ నుంచి ఇంటికి రావడానికి అరగంట లేటైతే చాలు కంగారుపడేవారు. 5:30 గంటలకు రావాల్సింది 6 గంటలకు వస్తే నేను వచ్చేవరకూ బయట నిలబడి వెయిట్ చేస్తుండేవారు. అంత కేరింగ్. ఇంకా ఇలా చాలా ఉన్నాయి. అయితే చెప్పాను కదా.. నాన్న అంటే ఓ ఫీలింగ్ అని. ఆ ఫీలింగ్ ఎలా చెప్పాలో తెలియడంలేదు.

**➡ జనరల్‌గా అమ్మ దగ్గర చనువు ఉంటుంది. నాన్నకు భయపడతాం. మరి మీరు?**

మా నాన్న అంటే నాకు భయం. అయితే నేను తప్పు చేసినప్పుడు మాత్రమే భయపడేవాడిని. లేకుంటే ఆయన మెడపై కూర్చునేటంత చనువు ఉంది. ఎప్పుడూ నన్ను భయపెట్టాలని ఓ టీచర్‌లాగా 'ఏయ్' అంటూ అరిచేవారు కాదు. నాతో మామూలుగా మాట్లాడేవారు. అయితే తప్పు చేస్తే నాన్నకు కోపం వస్తుంది అనే ఫీల్‌ని పిల్లలకు కలిగేలా చేయగలిగారు.

**➡ మీ నాన్నగారు మీకు నేర్పించిన విషయాల్లో ముఖ్యమైనవి ఏమైనా?**

దేశభక్తి, దైవభక్తి... రెండూ నేర్పించారు. ఈరోజు ఆధ్యాత్మికంగా ఓ గుడి (ఆంజనేయ స్వామి) కడుతున్నానంటే భక్తి అనే విత్తనాన్ని నా మైండ్‌లో చిన్నప్పుడే నాటారు నాన్న. దేశం పట్ల ప్రేమ, భక్తి ఉండాలని నా గుండెల్లో పెట్టుకునేలా చేసింది కూడా ఆయనే. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల గురించి చెప్పారు. వారి త్యాగాల గురించి చెప్పారు. ఆయన చెప్పినప్పుడు తెలియకుండానే 'ఓహో... దేశం అంటే ఇది. మన స్వాతంత్ర్యం వెనక ఇంతమంది త్యాగం ఉంది' అనేది మనసులో నాటుకుపోయింది. దేశభక్తి భావం పెంపొందింది. దేశాన్ని నువ్వు ఎంతో ప్రేమించాలని చెప్పేది కూడా నాన్నే అయ్యుండాలి. ఇలాంటి అర్హతలన్నీ ఉంటేనే ఫాదర్.. లేకుంటే పెళ్లి చేసుకోకూడదు. ఎందుకంటే పెళ్లనేది ఓ బాధ్యత.. ఓ కర్తవ్యం.

**➡ అర్జున్ వాళ్ల తండ్రి గొప్పా? లేక ఐశ్వర్య (అర్జున్ కూతురు) తండ్రి గొప్పా?**

ప్రపంచంలో నా తండ్రే గొప్ప అని ప్రతి పిల్లలు చెప్పుకుంటారు. నిజంగా నేను కూడా అలాగే ఫీలవుతాను.. అలాగే నేను గొప్ప తండ్రిని అనుకుంటున్నాను. మా అమ్మాయిని చాలా బాగా చూసుకుంటా, చాలా సెక్యూర్డ్ ఫాదర్‌ని.. నా కూతురు పక్కన నేనుంటే తనని చూడటానికి కూడా భయపడతారు. ఇవన్నీ ఓకే.. కానీ మనం ప్రేమ ఇవ్వాలి. ప్రతి తండ్రీ 'ఐ యామ్ ది బెస్ట్' అంటుంటారు. మా అమ్మాయి 'మా నాన్న బెస్ట్' అంటుంది. అప్పుడు నేనేమన్నానంటే.. 'నీకు నేను బెస్ట్ అయితే.. మా నాన్న నీ బెస్ట్ ఇంటూ వెయ్యిరెట్లు' అన్నాను. మా నాన్న అంత గుడ్ ఫాదర్‌లా ఉండటానికి ట్రై చేస్తున్నాను.

**➡ హీరోగా మీ విజయాన్ని మీ నాన్నగారూ చూశారా?**

చూశారు. పిల్లల సక్సెస్‌ని తల్లిదండ్రులు తమ విజయంగా భావిస్తారు. నేను హీరోగా నటించిన సినిమాల వంద రోజుల వేడుకలకు నాన్న వచ్చారు. వాటిలో తెలుగు సినిమా 'మా పల్లెలో గోపాలుడు' సినిమా ఫంక్షన్ ఒకటి. మరణం మన చేతుల్లో లేదు. నాన్న చనిపోయినప్పుడు నాకు పాతికేళ్లు కూడా ఉండవనుకుంటా. ఆయన జ్ఞాపకాలు పదిలంగా మనసులో దాచుకున్నాను.


● కుమార్తె ఐశ్వర్య, భార్య నివేదితాతో అర్జున్

**➡ మీ నాన్నగారు సంస్కారం ఇచ్చారు. మీ పిల్లలకు మీరు అది ఇవ్వడంతోపాటు బాగా ఆస్తులు కూడా ఇచ్చారు కదా?**

యస్. నా వద్ద డబ్బు ఉంది.. స్టేటస్ ఉంది. బాగా ఖర్చు పెట్టగలుగుతాను.. మా అమ్మాయి ఏది అడిగినా కాదనకుండా ఇవ్వగలను. ఫారిన్ పంపించగలను. అప్పట్లో మా నాన్నకి అంత స్తోమత లేదు.. అయినా మా నాన్నగారు బెస్ట్. ఇట్ ఈజ్ నాట్ ఎబౌట్ మనీ, నాట్ స్టేటస్.. ఇట్స్ ఎ ఫీలింగ్. మనం పిల్లలకి ఎంత ఆస్తి ఇస్తున్నామన్నది ముఖ్యం కాదు. సమాజంలో వాళ్లు ఓ మంచి వ్యక్తిగా బతికేలా తీర్చిదిద్దుతున్నామా? లేదా? అన్నదే ముఖ్యం.

**➡ ఇంతకీ మీ నాన్నగారు మీకు జీవితం గురించి పదే పదే చెప్పేవారా? జస్ట్ ఆయన్ని చూసి నేర్చుకోమనేవారా?**

లైఫ్ అంటే ఒక 'ఫ్లేవర్'. ఆ సువాసనను మనం ఆస్వాదించగలుగుతాం తప్ప చూడలేం. వేరేవాళ్లు అడిగేటప్పుడే ఆ ఫ్లేవర్ మనకి తెలుస్తుంది. మీ ఫాదర్‌తో ఎప్పుడెప్పుడు మీకు అలా అనిపించింది? అని అడిగితే.. ఉదాహరణకి.. చిన్నప్పుడు హెయిర్ కటింగ్ షాప్‌కి నాన్న తీసుకెళ్లారు. అక్కడ కుర్చీలో ఎత్తు కోసం మరొక స్పాంజ్ సీట్ వేశారు. కటింగ్ చేసేటప్పుడు అలా నిద్రపోతూ తల కిందికి ఓ వైపు వాల్చేసేవాడిని. అప్పుడు కటింగ్ చేసే ఆయన తలని సరిగ్గా పెడతాడు. అయితే అతని చర్య సున్నితంగా ఉండదు. తలను అలా లాగి పక్కకి పెట్టినట్లు పెడతాడు. అది మా నాన్నకు నచ్చేది కాదు. అందుకని నా పక్కనే కూర్చుని నేను నిద్రపోకుండా కథలు చెబుతూ కటింగ్ చేయించేవారు.. ఇదొక సంఘటన. ఈ విషయంలో మీకు ఏం తెలుస్తుంది.. కేరింగ్, అఫెక్షన్ తెలుస్తున్నాయి కదా. ఇంకొక్కటి చెబుతా.. ఇవన్నీ నిజాలు.. ఒకరోజు నాన్న నన్ను ఎత్తుకుని రోడ్డు మీద వెళుతున్నప్పుడు పెద్ద ఎద్దు మీదకు వచ్చేసింది.. మా నాన్న పహిల్వాన్.. అంత స్ట్రాంగ్‌గా ఉండేవారు. కొంచెం అయ్యుంటే అది పొడిచేసేది. దాని ముక్కుతాడుని పట్టుకుని కంట్రోల్ చేశారు.. దాని యజమాని వచ్చేవరకూ అలాగే పట్టుకుని ఉన్నారు. ఇదంతా ఒక సినిమాటిక్‌గా ఉంటుంది.

**➡ అప్పుడు మీ నాన్నని హీరో అనుకున్నారా?**

అంతేకదా! ఆయన కాకుంటే ఇంకెవరుంటారు? మా నాన్నది పల్లెటూరు. నాకూ చాలా ఇష్టం. అక్కడికి వెళ్లాలనిపిస్తుంటుంది? చెట్లు పెంచాలనిపిస్తుంది.. ఆవులు ఉండాలనిపిస్తుంటుంది. ఎందుకంటే అది నా రక్తంలోనే ఉంది. పనసపండు ఉంటుంది కదా.. దాన్ని మా నాన్నే కోసి మా అందరికీ ఇచ్చేవారు. పిల్లలందరం కావాల్సినవి తీసుకునేవాళ్లు. మా నాన్నకి ఒక్కటే మిగిలేది. ఏమీ అనేవారు కాదు. అదే తినేవారు. అప్పుడు ఏమీ అనిపించలేదు. ఇప్పుడు ఆలోచిస్తే.. ఇలాంటి ఎన్నో త్యాగాలు చేశారాయన. అందుకే 'మై డాడ్ ఈజ్ మై హీరో'.

# అప్పుడు ఎంత అంటే అంత!

**» హీరోగా పరిచయమవుతున్న ఈ సమయంలో నాన్న పక్కన ఉంటే అనే ఫీలింగ్ రాక మానదు..**

**మేఘాంశ్:** కచ్చితంగా. నాన్న ఉండి ఉంటే పక్కనే ఉండి నడిపించేవారు. ఒక భరోసా ఉండేది. అది మిస్సవుతున్నాం. సినిమా కమిట్ అయ్యే ముందు ఆర్టిస్ట్‌గా నాన్నకు వచ్చిన దాంట్లో ఓ 5 శాతం వచ్చినా చాలు అనుకున్నాను. నాన్న పేరు చెడగొట్టకూడదు అనే బాధ్యతతో చేశాను.

**శశాంక్.. మేఘాంశ్.. 'రియల్ స్టార్'గా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన శ్రీహరి కుమారులు. 'రాజ్‌దూత్' చిత్రం ద్వారా మేఘాంశ్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. శశాంక్‌కి డైరెక్టర్ అవ్వాలనే ఆశయం ఉంది. ఈ ఇద్దరూ తమ తండ్రి శ్రీహరి గురించి పంచుకున్న విశేషాలు.**


● శశాంక్, మేఘాంశ్

**» నాన్న ఉన్నప్పుడే హీరో అవ్వాలనే టాపిక్ మీ మధ్య వచ్చిందా?**

**మేఘాంశ్:** మేం ఇద్దరం సినిమా ఇండస్ట్రీలోనే ఉండాలనుకున్నారు. కానీ హీరోనా? డైరెక్టర్‌గానా? అనే డిస్కషన్ అయితే ఎప్పుడూ రాలేదు. అప్పుడు చిన్నపిల్లలం కదా.

**» మీ నాన్నగారు ఫిట్‌గా ఉండేవారు. మీరు కూడా అదే అలవర్చుకున్నట్టున్నారు?**

**మేఘాంశ్:** ఆయన్ను చూసే జిమ్ చేయడం స్టార్ట్ చేశాం. నాన్నకి ఫిట్‌గా ఉండటం అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు మాకది ఇన్‌స్పైరింగ్‌గా ఉండేది. మా జిమ్‌లో నాన్న ఫొటోలు ఉంటాయి. జిమ్ చేస్తున్నప్పుడు మధ్య మధ్యలో ఆ ఫొటోలు చూస్తుంటాం.

**» శ్రీహరిగారి నుంచి మీరు నేర్చుకున్న విషయాలు..**

**మేఘాంశ్:** అందరికీ హెల్ప్ చేయడం.

**శశాంక్:** హంబుల్‌గా ఉండటం.

**మేఘాంశ్:** హంబుల్‌గా ఉంటూనే రాయల్‌గా ఉండటం.

**» ఫాదర్స్ డే సెలబ్రేట్ చేసుకునేవారా? ఏదైనా గిఫ్ట్ ఇచ్చేవారా?**

**ఇద్దరూ:** ఆయన ఉన్నప్పుడు ప్రతిరోజూ మాకు సెలబ్రేషనే.

**శశాంక్:** ఓ రోజు ఆమ్లెట్ చేసి ఇచ్చా. మస్త్ ఉంది అన్నారు.


● శశాంక్, శ్రీహరి, శాంతి, మేఘాంశ్

**మేఘాంశ్:** నేను నాన్నతో చాలా క్లోజ్‌గా ఉండేవాడిని.

**శశాంక్:** వీడు డాడీ పెట్.

**» నాన్న వెళ్లిపోయిన తర్వాత మీ లైఫ్‌లో వచ్చిన మార్పులేంటి?**

**శశాంక్:** లైఫ్‌స్టైల్ మారిపోయింది. అప్పుడు బాధ్యతలు లేవు. ఇలా అంటే (చిటికేస్తూ) అన్నీ వచ్చేసేవి. ఇప్పుడు కొంచెం చూసి ఖర్చు పెడుతున్నాం. ఫైనాన్షియల్‌గా చాలా రెస్పాన్సిబుల్ అయిపోయాం.

**» స్కూల్‌కి వెళ్లను అన్నప్పుడు నాన్న కొట్టిన సందర్భాలు ఏమైనా ఉన్నాయా?**

**మేఘాంశ్:** మమ్మీ కొట్టేది. కానీ డాడీ ఎప్పుడూ కొట్టలేదు. స్కూల్ బంక్ కొడితే డాడీ దగ్గరకు వెళ్లిపోయేవాళ్లం.

**» డాడీ ఏ విషయంలోనూ కోప్పడలేదా?**

**మేఘాంశ్:** ఎప్పుడూ లేదు.

**శశాంక్:** ఒకే ఒక్కసారి నన్ను కోప్పడ్డారు. ఆయన్ను చూడటానికి ఫ్యాన్స్ వచ్చారు. నేను పటాసులు కాలుస్తున్నాను. గేట్ దగ్గర రాకెట్ పేలిస్తే ఓ అభిమాని మీదకు వెళ్లింది. అప్పుడు కోప్పడ్డారు. ఇంకోసారి కార్ విండోలో నుంచి మేఘాంశ్ చేయి బయటపెడితే అద్దం పైకి ఎత్తేశా. అప్పుడు తిట్టారు.

**» బిజీ ఆర్టిస్ట్ అయినా మీతో టైమ్ ఎక్కువ టైమ్ స్పెండ్ చేసేవారా?**

**ఇద్దరూ:** రోజూ కలసి భోజనం చేసేవాళ్లం. అప్పుడు మమ్మీ మా అల్లరి గురించి చెబుతుండేది. వాళ్ల గురించి ఇప్పుడెందుకు? హ్యాపీగా తిననివ్వు అని మమ్మీనే తిట్టేవాళ్లు. మాకు ఒక్క తిట్టు కూడా పడేది కాదు.

**» మీ ప్రోగ్రెస్ కార్డ్ ఎవరు సైన్ చేసేవాళ్లు?**

**మేఘాంశ్:** మమ్మీనే. అప్పుడప్పుడు పాస్ అయ్యేవాణ్ణి, అప్పుడప్పుడు ఫెయిల్ అయ్యేవాణ్ణి.

**శశాంక్:** కానీ వాడి తిట్లన్నీ నాకు పడేవి. ఎందుకంటే ముందు నా ప్రోగ్రెస్ కార్డ్ చూసి నన్ను తిట్టేది. మళ్లీ వాడిని ఏం తిడతాంలే అనుకునేదేమో. నన్ను తిడుతూనే ఉండేది.

**» మీ ఇద్దర్లో టామ్ ఎవరు? జెర్రీ ఎవరు?**

**మేఘాంశ్:** వాడే. (శశాంక్‌ని చూపిస్తూ) వాడు కొట్టేటోడు.. నేను పడేటోడ్ని. (నవ్వుతూ )

**» మీ తమ్ముడు హీరో అవుతున్నాడు కదా. ఏమనిపిస్తుంది?**

**మేఘాంశ్:** మంచిగా చెప్పురా ప్లీజ్.

**శశాంక్:** అలా చెప్పాలనే ఆలోచిస్తున్నా. ఫస్ట్ నాకు నవ్వొచ్చింది. బచ్చాగాడు హీరో అయిపోయాడు అనుకున్నాను. అయితే నేను చెప్పేదొక్కటే. హిట్ అయినా ఫట్ అయినా హంబుల్‌గా ఉండాలి.

**» మీ నాన్నగారు ఉన్నప్పుడు ఓసారి పదివేలకు చాక్లెట్లు కొన్నారట?**

**శశాంక్:** నాన్నగారి కార్డ్ తీసుకెళ్లాడు. అక్కడున్న చాక్లెట్లు అన్నీ కొన్నాడు. రేయ్.. మేఘాంశ్ పదివేలు అయిందీ అంటే ఓ చాక్లెట్ పక్కన పెట్టి ఇప్పుడు 9 వేలే కదా తీసుకో అన్నాడు (నవ్వుతూ).

**మేఘాంశ్:** మాకు రిస్ట్రిక్షన్స్ ఉండేవి కావు. పాకెట్‌మనీ ఇచ్చేవాళ్లు కాదు. ఎవరికైనా డబ్బులిచ్చి మాతో పాటు పంపేవాళ్లు. మేం కొనుక్కునేవాళ్లం. అప్పుడు ఎంత అంటే అంత. ఇప్పుడు ఎంత అవసరం ఉంటే అంత.

**» యాక్టర్ అవుతున్నారు. హోమ్ వర్క్ కోసం నాన్న సినిమాలేమైనా చూశారా?**

**మేఘాంశ్:** అలా ఏం చూడలేదు. అయితే నాన్నని చూడటం కోసమే ఆయన సినిమాలు చూస్తుంటాను.

**» మీ నాన్నగారికి తీరని కోరిక ఏదైనా మిగిలిపోయిందా?**

**శశాంక్:** పాలిటిక్స్. ఇంకో సంవత్సరం ఉండి ఉంటే కచ్చితంగా పాలిటిక్స్‌లోకి ఎంటర్ అయ్యేవారు. ఆయనకు బాగా ఇంట్రెస్ట్. సహాయం చేయాలని అనుకుంటారు.

**» మరి మీలో ఎవరికైనా ఆ ఇంట్రెస్ట్ ఉందా?**

**మేఘాంశ్:** ఇంట్రెస్ట్, నాలెడ్జ్ రెండూ లేవు.

**» నాన్న యాక్ట్ చేసిన సినిమాల్లో బాగా నచ్చినవి?**

**ఇద్దరూ:** కింగ్, ఢీ, భద్రాచలం, విజయరామరాజు... ఇలా చాలా ఉన్నాయి.

**» తమ్ముడు హీరో అయ్యాడు.. మరి అన్న డైరెక్టర్ ఎప్పుడు అవుతాడు?**

**శశాంక్:** షార్ట్ ఫిల్మ్స్ తీస్తున్నాను. ఇంకా ఏమీ అనుకోలేదు.

# అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉందా?


● సుజై, సాయి రోనక్, ప్రీతి అస్రాని, సుశీల్, అప్పి రెడ్డి

సాయి రోనక్, ప్రీతి అస్రాని హీరో హీరోయిన్లుగా సుజై, సుశీల్ నిర్మించి, రచించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రెజర్ కుక్కర్'. ఎ. అప్పిరెడ్డి మరో నిర్మాత. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను నిర్మాత డి. సురేశ్‌బాబు హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ– ''అన్నదమ్ములైన సుజై, సుశీల్ యూఎస్ నుండి ఇండియాకు సినిమాలు చేయాలనే ప్యాషన్‌తో వచ్చారు. చాలా క్లారిటీతో క్లియర్‌గా సినిమా తీశారు. టిపికల్ థాట్స్‌తో వస్తున్న ఇలాంటి కొత్తవారిని తప్పకుండా ఎంకరేజ్ చేయాలి. డిఫరెంట్ టైటిల్‌తో ఆకట్టుకుంటున్న ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. సుజై మాట్లాడుతూ– ''పిల్లల్ని ఇంజినీరింగ్ చదివించడం, తర్వాత అమెరికా పంపించడం అక్కడ సెటిల్ అయ్యారని చెప్పుకోవడమే పరమావధిగా భావిస్తున్న మధ్యతరగతి తెలుగు కుటుంబాలపై విసిరిన వ్యంగ్యాస్త్రమే ఈ మా 'ప్రెజర్ కుక్కర్'. కిషోర్ అనే కుర్రాడు ఏం చేసి అయినా యూఎస్ వెళ్లాలనుకుంటాడు. అతడు పడ్డ కష్టాలు, ఆ క్రమంలో నేర్చుకున్న కొత్త పాఠాలు, అతనిలో పెరిగిన ఆత్మ విశ్వాసం, కుటుంబ విలువల పట్ల కొత్తగా ఏర్పడ్డ గౌరవం, దీంతో అసలు అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉందా? అని అతనికి కలిగే సందేహం లాంటి అంశాలన్నీ ఈ చిత్రంలో చూపించడం జరిగింది. త్వరలో పాటలను విడుదల చేస్తాం'' అని చెప్పారు. సాయి రోనక్ మాట్లాడుతూ– ''నాకు అవకాశం ఇచ్చిన మధుర శ్రీధర్‌గారికి ధన్యవాదాలు. నేను రియల్ లైఫ్‌లో ఎదుర్కొన్న పరిస్థితులనే ఈ సినిమాలో చూపించారు'' అన్నారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ– ''రెండు సంవత్సరాలుగా కష్టపడి క్లారిటీతో స్టోరీని ప్రిపేర్ చేశారు. మంచి ఔట్ పుట్ ఇచ్చారు'' అన్నారు. ''మొదటిసారి నన్ను నేను సినిమా పోస్టర్‌లో చూసుకోవాలనే నా కల నెరవేరింది'' అన్నారు ప్రీతి.


● మెహరీన్

# ఫుల్ ఫామ్!

వరుస అవకాశాలను దక్కించుకుంటూ హీరోయిన్ మెహరీన్ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. కొంతకాలం డైరీలో ఖాళీ అన్న పదమే లేకుండా కెరీర్‌ను బాగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆల్రెడీ గోపీచంద్ హీరోగా రూపొందుతున్న 'చాణక్య' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారీ బ్యూటీ. ఇటీవల సతీష్ వేగేశ్న దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ హీరోగా సైన్ చేసిన సినిమాలో హీరోయిన్‌గా మెహరీన్ ఎంపికయ్యారు. ఇప్పుడు తాజాగా కోలీవుడ్ హీరో ధనుష్ నటించనున్న సినిమాలో హీరోయిన్‌గా నటించే చాన్స్ కొట్టేశారామె. శనివారం అధికారిక సమాచారం వెల్లడైంది. సత్యజోతి ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ సినిమాకు 'కొడి' (తెలుగులో 'ధర్మయోగి'గా డబ్ చేశారు) ఫేమ్ ఆర్.ఎస్. ధురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. త్వరలో షూటింగ్ ఆరంభం కానుంది. ''ఈ సినిమా షూటింగ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ధనుష్‌తో ... డటం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు మెహరీన్. ఇలా వరుస మెహరీన్ ఫుల్ బిజీగా ఉన్నారు.

# మల్లేశం సినిమాకు ప్రభుత్వ సహకారం ఉంటుంది

**- కె.టి.ఆర్**


● రాజ్, కేటీఆర్, ప్రియదర్శి

''ఇంగ్లీష్‌లో నెసెసిటీ ఈజ్ మదర్ ఆఫ్ ఇన్వెన్షన్' అనే సామెత ఉంది. కానీ ఈ సినిమాలో 'మదర్ ఈజ్ నెసెసిటీ ఆఫ్ ఇన్వెన్షన్' అని చూపించారు. ఎందుకంటే మల్లేశంగారు తన తల్లి కష్టాన్ని చూసి, తన తల్లి సమస్యతో పాటు ఎంతోమంది తల్లుల సమస్యలను తొలగించారు. ఎంతోమంది యంగ్ ఇన్నోవేటర్స్‌కు ఇన్‌స్పిరేషన్ ఇచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించారు'' అన్నారు తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పద్మశ్రీ చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'మల్లేశం'. రాజ్ దర్శకత్వంలో శ్రీ అధికారి, రాజ్. ఆర్ నిర్మించారు. మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటించిన ఈ చిత్రం జూన్ 21న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని శనివారం పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులకు కోసం ప్రదర్శించారు. సినిమా చూసిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ– ''సముద్ర గర్భంలో దాగిన బడబాగ్నులెన్నో, సమాజంలో అజ్ఞాత సూర్యులెందరో, గాయపడిన కవి గుండెల్లో రాయబడని కవితలెన్నో అనే ఓ కవిత సినిమాలోని ఎమోషన్‌ని రెండు గంటలపాటు క్యారీ చేసింది. మనం వెళ్లే దారిలో దారులన్నీ మూసి ఉన్నా ఏదో దారి తెరుచుకుని ఉంటుందనే విషయాన్ని వివరించిందీ చిత్రం. చేనేత కార్మికుల నైపుణ్యానికి పెద్దపీట వేస్తూ వారి కష్ట నష్టాలను ఈ సినిమాలో చూపించారు. ప్రియదర్శి అద్భుతంగా నటించారు. తెలంగాణ యాసను, భాషలోని మాధుర్యాన్ని రైటర్ అశోక్‌కుమార్ చక్కగా రాశారు. ఈ సినిమాకు ప్రభుత్వం నుండి సహకారం అందించాలని గౌరవ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగారితో, గౌరవ ముఖ్యమంత్రిగారితో మాట్లాడతాను. అది ట్యాక్స్ ఎగ్జంప్షన్ అయినా, మరేదైనా నా వంతుగా ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తా. ప్రతి సోమవారం చేనేత వస్త్రాలనే ధరించాలి. చేనేత కార్మిలకు అండగా నిలబడాలనే నినాదంతో యువత ముందుకు అడుగులు వెయ్యాలి'' అన్నారు. డి. సురేశ్‌బాబు, బి. నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంతవరకూ రాని కథతో...


● తరుణ్ తేజ్, లావణ్య

మన జీవితంలోకి ఎంత మంది వచ్చినా మన్ని చివరివరకూ ప్రేమించేది తల్లిదండ్రులే అనే కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'ఉండిపోరాదే'. తరుణ్ తేజ్, లావణ్య హీరోహీరోయిన్లుగా తెలుగు, కన్నడ భాషల్లో నవీన్ నాయని దర్శకత్వంలో లింగేశ్వర్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ చిత్రం ఆడియోను 23న రిలీజ్ చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు సబు వర్గీస్ మాట్లాడుతూ– ''సినిమాలో ప్రతి పాట సందర్భానుసారంగానే వస్తుంది. దర్శక–నిర్మాతలిచ్చిన స్వేచ్ఛ వల్ల మంచి పాటలివ్వగలిగాను'' అన్నారు. ''అవకాశమిచ్చిన నిర్మాతగారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఇదో రియలిస్టిక్ స్టోరీ. కన్నడలో ఆడియో రిలీజ్ చేశాం. మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనుకుంటున్నాం'' అన్నారు నవీన్. ''సినిమాను ప్రత్యేక శ్రద్ధతో తీశాం. ఇంతవరకూ తెరమీద రానటువంటి కథతో సినిమా ఉంటుంది. నాన్నపై రాసిన పాటకు సుద్దాల అశోక్ తేజగారికి కచ్చితంగా అవార్డ్ వస్తుంది. జులై చివర్లో సినిమాను రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత లింగేశ్వర్.


● రవితేజ

# బస్తీ మే సవాల్

పాత బస్తీ వీధుల్లో విలన్లను ఇరగ్గొట్టారు రాజా. మరి..రాజా ఉతుకుడు ఏ లెవల్‌లో ఉందో 'డిస్కోరాజా' సినిమాలో తెలుస్తుంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడ, ఒక్క క్షణం' వంటి చిత్రాలను తెరకెక్కించిన వీఐ ఆనంద్ దర్శకత్వంలో రవితేజ హీరోగా రూపొందుతున్న సినిమా 'డిస్కో రాజా'. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. మరో కథానాయిక ఎంపిక కావాల్సి ఉంది. రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్నారు. ఇటీవల రవితేజ, 'వెన్నల' కిశోర్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరించిన టీమ్ లేటెస్ట్‌గా హైదరాబాద్‌లోని పాత బస్తీలో షూటింగ్‌ను పూర్తి చేశారు. అక్కడ కొన్ని యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. బాబీ సింహా, సత్య, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నారు.



● కుమారుని ఆలింగనం చేసుకుంటున్న దశరథుడు

# నడక... నడత నేర్పిన వాడు నాన్న!

**'ఆత్మా వై పుత్ర నామాసి.' అని పురాణ సిద్ధాంతం. దీని ప్రకారం పుత్రులు తండ్రి ఆత్మను, ఆ ఆత్మ గుణాలను కలిగి పుడతారనీనూ హిందూ ధర్మ శాస్త్ర నానుడి . ఈ నాటి శాస్త్రీయ పదాల, పంథాల ప్రకారం కూడా తల్లితండ్రుల జీన్స్ మిశ్రమం పిల్లలు కలిగి వుంటారు అన్నది వివాదం లేని అంశం...**

పురాణాలను నమ్మినా నమ్మక పోయినా, కేవలం జన్యు శాస్త్ర ఆధారంగా అయినా, తండ్రి పోలికలు, గుణాలు తనయుడిలో కనిపించటం అందరికీ తెలిసిన విషయమే. కూతురులో కూడా వుంటాయి ఇలాగే.

కొడుకు కావాలి అని కోరుకోవటం వంశ వృద్ధి కోసం అంటాము. అంటే తాత ముత్తాతల నుంచీ వస్తున్న ఇంటిపేరు కొనసాగింపు కోసం. ఇది ప్రాథమికం. ఇంకో విషయం, తండ్రి వృత్తిని, ఆశయాలను, ఆదర్శాలను ఇంకా పెంపొందించి ముందుకు తీసుకు వెళతాడు అన్న ఆశ.

ఇదే అప్పటి దశరథ మహారాజులోనూ కనిపించింది. ప్రజారంజకమైన, న్యాయ ధర్మ ఆధారిత పాలన వారిది. ఆ పాలన కొనసాగాలి, ప్రజలు సర్వకాలం సుఖపడాలి అన్నది ముఖ్యకారణం. తనకు కర్మ కాండలు చేసి పుణ్యలోకాలకి పంపటం అన్నది తరువాతి విషయం.

వారిది అటువంటి పరిపాలన కాబట్టే, నారాయణుడు పుత్రుడిగా, శ్రీరాముడిగా పుట్టటానికి వారిని ఎంచుకున్నది. ఇదే వామనావతారంలోనూ, పరశురామావతారంలోనూ, కృష్ణావతారంలోనూ ప్రస్ఫుటమవుతుంది. అంటే ఆ నారాయణుడు కూడా తండ్రిగా తగ్గ గుణగణాలు ఉన్నవారినే ఎంచుకుని ఉద్భవించాడు.

తండ్రికి అంత విశిష్ట స్థానం ఇచ్చింది హిందూ ధర్మంలో అయితే, జీసస్ క్రీస్తు కూడా నా తండ్రి మాట అంటూ దేవుని ప్రబోధాలను ప్రజలలోకి తీసుకు వచ్చాడు.

మనం సాధారణ ఆచరణలో కూడా తండ్రికి తగ్గ తనయుడు అంటాము కానీ తనయుడికి తగ్గ తండ్రి అనము. సాధారణంగా ఏ దేశమైనా, ఏ సంస్కృతిలో అయినా, ఏ సమాజంలో అయినా , తండ్రి అన్నవాడు తన కొడుకు తనకన్నా గొప్ప పేరు తెచ్చుకోవాలని, తను తన జీవితం లో సాధించలేని గొప్పపేరు, విజయాలు తన కొడుకు సాధించాలి అనీ కలలు కంటాడు అన్నది పచ్చి నిజం.

ఇంకో ఉదాహరణ, రావణుడు తన కొడుకు మేఘనాథుడు గొప్ప పరాక్రమవంతుడు కావాలని కోరుకున్నాడు. దేవతల మీద ఆధిపత్యం చేయాలని కోరుకున్నాడు. తనకన్నా ముందే నేల కూలితే అమితంగా విలపించాడు.

జమదగ్ని మహర్షి. పరశురాముడు కారణ జన్ముడు. రాజ్యాధినేతల మితిమీరిన పరిపాలన ముగిసి, సామాన్య ప్రజలు సుఖించాలి అన్న ఆదర్శం కోసం అవతార మెత్తిన వాడు. అతనిలో ఆ కాఠిన్యం, పౌరుషం, కార్పణ్యానికి కారణం కలిగించటం జమదగ్ని పాత్ర.

అంటే, కొడుకు గొప్పవాడు కావటానికి తండ్రి పాత్ర ఎంత వున్నదీ మనకు విశదం అవుతుంది.

పిల్లలకోసం, కొడుకు అయినా కూతురు అయినా, ఒక తండ్రి పడే కష్టాలు ఆ తండ్రి గుండెల్లో నిక్షిప్తమై ఉంటాయి కానీ బయటకి రావు.

దశరథ మహారాజు మాటతప్పిన వాడుగా చరిత్రలో నిలిచి పోవటానికి సిద్ధ పడ్డాడు గానీ, శ్రీరాముడిని వనవాసానికి వెళ్ళమని తన నోటి నుంచి చెప్పలేదు. కైకేయి చెప్పింది శ్రీరామునికి జరిగిన విషయం. చివరకు రాముడు సీతా లక్ష్మణ సమేతంగా వనవాసానికి బయలు దేరేటప్పటికి, భరించలేక ప్రాణమే పోగొట్టుకున్నాడు. అలాగే శంతన మహారాజు ఒక శిశువు కోసం భార్య అయిన గంగను వదులుకున్నాడు. ధృతరాష్ట్రుడు పుత్ర వాత్సల్యంతో కృష్ణుడి రాయబారానికి స్పందించక, దుర్యోధనుని కోరిక ప్రకారం యుద్ధానికి, కురు వంశ నాశనానికి నాంది పలికాడు.



● ధృతరాష్ట్రుని పుత్ర వాత్సల్యం

మన పురాణాలలో కొడుకు పాత్ర గురించి, బాధ్యత గురించి చక్కగా మనకు విశదీకరించినది పాండురంగని కథ. తన తప్పులు తెలుసుకుని, మారి, తండ్రి శుశ్రూష మధ్యలో ఆపను అని విఠలుడినే ఆగమన్నాడు. ఆ దేవుడూ భక్తుడి కోరిక ధర్మ బద్ధమైనది కాబట్టి వేచి వున్నాడు.

ఈ విధంగా చాలా వున్నాయి కొడుకు బాధ్యత తెలియ చెప్పేవి, జననీ జనకులు దేవుని కన్నా ఎక్కువ అని చెప్పేవి. ప్రతి సంవత్సరం వినాయక వ్రతం చేసి, కథ చెప్పుకుంటాము. వినాయకుడు కేవలం శివపార్వతుల ప్రదక్షిణ చేస్తుంటే, కుమార స్వామి వారికి, అన్న గారు మూషిక వాహనం మీద పయనించి, ముక్కోటి నదుల్లోనూ తనకంటే ముందర స్నానం చేసినట్లు కనిపించింది.

ఇంతకన్నా, పుత్రుడుగా తన కర్తవ్యం నిర్వహించటం కోసం, దుష్ట చతుష్టయంలో ఒకడుగా పేరు తెచ్చుకోవడానికి కూడా వెనుకంజ వేయని శకుని. మహాభారత యుద్ధకారకుడు. తనని, తండ్రిని, సోదరులను బావగారయిన ధృతరాష్ట్రుడు చెరసాలలో పెట్టి, సరియైన భోజనం కూడా ఇవ్వకపోతే, తండ్రి కోరిక మీద, వారి మాంసం భుజించి బతికినవాడు. తండ్రి ఎముకలతో మాయా పాచికలను చేసి, పాండవులను ఓడించి, చివరకు మహాభారత సంగ్రామం జరిగి కురు వంశం అంతా నాశనమవటానికి కారణభూతుడు. కేవలం కొడుకుగా తండ్రికి, తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడం కోసం. తన జీవితం ధారపోసిన వ్యక్తి కొడుకుగా; అదీ ఎంతో పాపం మూటగట్టుకుంటూ... చెడ్డ పేరుతో చరిత్రలో మిగిలిపోతూ. ఇంతకన్నా పెద్ద ఉదాహరణ ఏముంది, పుత్రుడుగా ఒక బాధ్యత నెరవేర్చడానికి.

గమనించ వలసిన పెద్ద పాఠం మనకు ప్రహ్లాదుని చరిత్రలో తెలుస్తుంది. హిరణ్యకశిపుడు రాక్షసుడు. వైరం నారాయణునితో. ఆ నారాయణుని కొడుకు నెత్తిమీద పెట్టుకుని పూజిస్తున్నాడు అనే బాధ తప్ప వేరేది లేదు. సరే చంపమని తన భటులకు ఆజ్ఞ వేశాడు. ఒకటికి రెండు సార్లు.

వారు చంపలేక పోయారు. తనంత శక్తి శాలి వేరెవ్వరూ లేరు కదా, మరి తానే ప్రహ్లాదుడిని చంపటానికి ఎందుకు ప్రయత్నించ లేదు? ఆలోచిస్తే, కేవలం పుత్ర వ్యామోహం. తన చేతులతో ఆ పని చేయలేడు. అది ఒక తండ్రి దృక్కోణం నుంచి.

మరి ప్రహ్లాదుడు! తండ్రి తనను చంపించటానికి ప్రయత్నిస్తున్నాడు. తను పూజించే వారిని దూషిస్తున్నాడు. మరి బాలకుడు కదా. ప్రహ్లాదుడు యే రకం గా ప్రవర్తించాలి తండ్రితో. ఏ ఒక్క చోట, యే ఒక్క మాటలో కూడా ఒక్క అమర్యాదపు పలుకు, కోపం నిండినదీ లేదు. వీలయితే గౌరవంగా, ప్రీతిగా మాటలు చెప్పి తండ్రి మనస్సు మార్చాలన్న ప్రయత్నం, అదీ పాలబుగ్గల పసివాని ప్రవర్తన.

ఈ నాటి కొడుకులు అర్థం చేసుకోవలసిన విషయం ఒకటి, అర్థం చేసుకున్నాక గుర్తు ఉంచుకోవలసినది ఇది. ఏ తండ్రి అయినా, తన సంతానం మంచి పేరు గడించి, తన పేరును నిలబెట్టాలని మాత్రమే కోరుకుని కలలు కంటాడు. జీవన యానంలో పరిస్థితుల ప్రాబల్యం వలన సరియైన వసతులు ఏర్పరచలేక పోవచ్చు. అది వేరే విషయం. ఇది గ్రహించ గలిగితే నేటి కొడుకులు ఒక తండ్రి తపనను అర్థం చేసుకున్న వారు అవుతారు. తండ్రి పట్ల రాక్షసంగా ప్రవర్తించరు. అనాథ శరణాలయాలలో, వృద్ధాశ్రమంలో చేర్పించరు.. తల్లి తండ్రుల బాధ్యతలను ఇతర సహోదరులతో పంచుకోరు, వంతులు వేసుకుని.

తండ్రిని తండ్రిగానే గాక గురువుగా కూడా గౌరవించి, తగ్గ పేరు ప్రవర్తన ద్వారా, విజయాల ద్వారా తెచ్చుకొని, వారి పేరూ నిలప వలసిన బాధ్యత పిల్లది. తల్లి ప్రథమ గురువు, మాట నేర్పుతుంది. తండ్రి రెండవ గురువు, ఆట పాట నడక నడత నేర్పిన వాడు.

- నందూరి రామచంద్రరావు

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
16-6-2019

తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవిదేశాల్లోనే స్వధర్మ పరిరక్షణ కోసం అహర్నిశలూ పోరాటం చేసే ధార్మిక కేంద్రం విశాఖ శ్రీ శారదాపీఠం. పరివ్రాజకాచార్యులు, జగద్గురువులు, శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఈ పీఠాన్ని విశ్వజనీనమైన భారతీయ జీవనవిధానాలను చాటి చెప్పేలా దిద్దితీర్చారు. శ్రీ శారదాపీఠానికి ఉత్తరాధికారిగా కిరణకుమార శర్మ నియమితులవుతున్న సంగతి తెలిసిందే. ఆయన సన్యాస దీక్షా స్వీకారోత్సవం విజయవాడ కృష్ణాతీరాన శనివారం నాడు వేదోక్తంగా ప్రారంభమైంది, సోమవారం నాడు ముగియనుంది. శారదాపీఠ ఉత్తరాధికారి శిష్య తురీయాశ్రమ దీక్షా స్వీకరణోత్సవం సందర్భంగా తన మనసులోని భావాలను పంచుకున్నారు కిరణ కుమార శర్మ.

# అద్వైతం... సమత.. మమతలకు ప్రతిరూపం!



''చిన్ననాటినుంచీ లౌకికమైన జీవితం మీద నాకు ఇచ్చలేదు. బాల్యంలో ఎప్పుడో అమ్మానాన్నలతో చుట్టాలింటికి వెళ్లడమే తప్ప, ఇంతవరకూ నేటి యువత మాదిరిగా నేను ఉన్నదే లేదు. నా జీవితమంతా పీఠంతోనే ముడివేసుకుందని చెప్పవచ్చు. ఏడెనిమిదేళ్ల ప్రాయం నుంచీ నేను విన్నది వేదం, కన్నది అభిషేకం. అర్చన, పూజ నా నిత్యవిధి. ఇవన్నీ కలిసి నాలో ఆధ్యాత్మిక భావనలన్నింటినీ స్థిరీకరించి ఉంటాయి.'' అన్నారాయన.

నాకు శంకరాద్వైతం అంటే చాలా ఇష్టం. ప్రపంచానికీ, జీవకోటికీ సరిపడే సిద్ధాంతం అద్వైతం తప్పనిచ్చి మరొకటి కాదు. రకరకాల ఆలోచనలుండవచ్చుగానీ, వాటి అంతస్సూత్రం మటుకు ఒక సదాలోచన అయి ఉండాలనేది నా అభిప్రాయం. ఎందకంటే, రంగు, రూపం, ప్రాంతం, ప్రదేశం, దేశం ఇలా అన్నింటా మార్పులుండవచ్చునేమో. కానీ, జీవుల ఆకలి, వేదన, అలసట వంటి విషయాల్లో మార్పులుండవు. నిన్నయినా, నన్నయినా కన్నప్పుడు మన తల్లుల నొప్పుల తీరు ఒక్కటే కదా! కాబట్టే మనలో ఉండే ఆత్మ అనే పదార్థం వేరువేరుగా కాకుండా ఒక్కటిగానే ఉంటుంది. జీవాత్మను పరమాత్మలో లయం చేసుకోవడం ద్వారానే బతుకు సార్థకమవుతుంది. అంతటా బ్రహ్మత్వమే. ఏకాత్మతా వాదమే. దానిని సాధించనవసరం లేదు. దానిని గుర్తించవలసిన అవసరం ఉంది. నీలో నాలో అందరిలో ఉన్నది ఒకటే బ్రహ్మపదార్థమని తెలుసుకోవడమే అద్వైతం. భారతీయతత్త్వమే, ఆధ్యాత్మ సారమే అద్వైతం. ఉన్నది ఒక్కటే అనే పరతత్వం. ఈ శంకరసిద్ధాంతాన్ని చిన్ననాటనే హృదయగతం చేసుకునే బాట పట్టాను. సన్యాసాశ్రమాన్ని ఇప్పుడిలా స్వీకరించడానికి ఈ పరిణామమే మార్గం వేసి ఉంటుంది.'' అని వివరించారు.

''బహుశా స్వరూపానందేంద్రస్వామివారితో కలిసి పర్యటనలు చేసినందువల్ల ఈ జీవనం పట్ల అనురక్తి కలిగి ఉంటుంది. హిమాలయాల్లో పర్యటిస్తున్నప్పుడూ, బదరికావనంలో నడుస్తున్నప్పుడూ, కేదారేశ్వరుణ్ణి సందర్శిస్తున్నప్పుడు గొప్ప భావనలు కలుగుతుండేవి. మానవజీవితం చిన్నది. ఈ జన్మ తరచూ దక్కేది కాదు. అలాంటప్పుడు దీనిని సమాజానికి ఉపయోగపడే విధంగా సమర్పణ చేయడం కంటే గొప్ప సంగతి ఏముంటుంది. హిమాలయ సానువుల్లోని కటకగమనంగా సాగిన మా పాదయాత్రలు మాకెన్నో నేర్పించాయి. శరీరం కష్టపడినప్పుడే బుద్ధి కూడా సరైన విధాన యోచన చేస్తుంది. పాదయాత్రను తేలిగ్గా చాలామంది తీసిపారేస్తుంటారు. నిజానికి అలాంటి యాత్రలు చేసినవారికే జీవితం అంటే ఏంటో తెలుస్తుంది. బతుకును పదిమందికీ పంచడం అలవడుతుంది. సమాజానికి మంచి చేసే భావనలు ప్రతీ అడుగులోనూ అందించేది పాదయాత్రే. ఆ రకంగా వేల కిలోమీటర్లుగా సాగిన నా నడక నాకెంతో నేర్పించింది.'' వివరించారు శారదా పీఠ ఉత్తరాధికారి. వారి ఆశయాలు నెరవేరాలని ఆశిద్దాం.

నేడు ఫాదర్స్ డే

**సన్యాసదీక్ష తీసుకోవడం సామాన్యమైన విషయం కాదు. అలా తీసుకున్నవారికి భవబంధాలు ఉండ కూడదు. మాతృమూర్తి కనిపించినా అమ్మా అనే వీలు లేదు. తండ్రి ఎదురుపడితే 'నాన్నా!' అని పిలిచే అవకాశం ఉండదు. అన్నదమ్ములు అక్కచెల్లెళ్లు ఉండనే ఉండరు. వీరంతా ప్రపంచంలోని మిగిలిన వారెంతో స్వామికి అంతే. యజ్ఞోపవీతాన్నీ పరిత్యజించాలి. పావుకోళ్లు, ధర్మదండం, కాషాయంతోనే జీవితాంతం వర్తన సాగించవలసి ఉంటుంది. అందుకే ఇంతటి కఠినమైన ఆశ్రమాన్ని కోరుకునేవారు బహు తక్కువ. అయినా సరే, అలాంటి క్లిష్టమైన జీవనాన్ని ఎంచుకున్నారు పోణంగి కిరణ కుమారశర్మ.**

స్వామివారితో సంభాషణ:
**డా. చింతకింది శ్రీనివాసరావు,**
సీనియర్ పాత్రికేయులు



**● యోగ అనేది మనలో మనం మరింత తరచి చూసుకోవడానికి, అంతులేని విశ్రాంతిని, హాయిని, ఆహ్లాదాన్ని పొందడానికి మంచి సాధనం. మనోవికాసం పొందడానికి, మనసు ద్వారా నీ అంతట నీవుగానే పరమాత్మని చేరుకోవడానికి యోగను మించిన ఉపకరణం లేనేలేదు ● యోగ అంటే మానవత్వాన్ని దైవత్వంతో ఐక్యం చేసే సాధనం ● యోగ అంటే భగవంతునిలో లీనం అవడమే. ఆత్మ పరమాత్మతో ఏకం కావడమే యోగం.**

**- యోగినాథ్ సిద్ధనాథ్ గురునాథ్**
క్రియా యోగ గురువు

సంగీత సాహిత్యం

# ఆ చెప్పులేసుకునే అమ్మవారి దగ్గరకు...



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

''అచ్చపు వేడుకతోడ ననంతాళ్వారు వారికి/ముచ్చిలి వెట్టికి మన్ను మోసిన వాడు/మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత నిచ్చనిచ్చమాటలాడి నోచిన వాడు/'' అంటూ అన్నమాచార్యుల వారు తన కీర్తనల ద్వారా వేంకటేశ్వర స్వామి తన భక్తులకు ఎంత సులభ సాధ్యంగా ఉంటాడో చాలా మధురంగా మనకు వివరించారు. అనంతాళ్వారులు, తిరుమలనంబిలాగానే శ్రీకాళహస్తిలో ఓ చర్మకారుడుండే వాడు. చెప్పులు కుడుతుండేవాడు. అలాగే కంచిలో మరొక చర్మకారుడుండే వాడు. వీళ్ళకు ఒక అలవాటు ఉండేది.



పిండిలో ప్రమిదలు చేసి వత్తులు వేసి 'మెట్ల ఉత్సవం' అని చేస్తారు. దానికోసం ఇంటి పైకప్పు మీద పిండి ఆరబోశారు. వీరు మనసులో 'గోవిందా', 'గోవిందా' అని నిత్యం స్మరించుకుంటుంటారు. వాడనే వాడున్నాడని ఒక నమ్మకం. పరమేశ్వరుడికి కావలసింది కూడా అదే. వేంకటేశ్వర స్వామివారికి వాళ్ళిద్దరినీ కరుణించాలనిపించింది. ఆయన వచ్చారు. శ్రీకాళహస్తిలో ఉన్న చర్మకారుడి ఇంటిపైన ఆరబోసిన పిండిమీద ఎడమ పాదం పెట్టారు. అక్కడ కంచిలో ఉన్న చర్మకారుడి ఇంటిపైన ఆరబోసిన పిండిమీద కుడిపాదం పెట్టారు.

అనుభవజ్ఞులైన ఇద్దరు చర్మకారులు ఆ పాద ముద్రలను గమనించారు. కానీ అవి అక్కడ ఎవరు అలా తొక్కారో మొదట అర్థం కాలేదు. దగ్గరగా వెళ్ళి నిశితంగా చూస్తే... శంఖరేఖ, చక్ర రేఖ, అమృత కలశం అన్నీ ఉన్నాయి. అసలే స్వామి భక్తులు. పైగా వృత్తి నిపుణులు. అవి స్వామివారి పాదాలే అని గుర్తుపట్టారు.

''స్వామి మా ఇంటికివచ్చి పిండిమీద పాదం పెట్టాడంటే... దాని మర్మం ఏమిటి? తనకు ఆ కాలి చెప్పు కావాలని కొలతకు పెట్టి ఉంటాడు. అందుకని ఆ చెప్పు ఒకటి సిద్ధం చేస్తా'' అని ఆ ఆ కొలతలతో చెప్పు కుట్టేశాడు శ్రీకాళహస్తిలోని చర్మకారుడు. కంచిలోని ఉన్న చర్మకారుడిదీ ఇదే పరిస్థితి. ఇలాగే ఊహించాడు. పాద ముద్ర కొలతలు తీసి చెప్పు కుట్టేసాడు. ఇద్దరిలో ఏ ఒక్కరికీ కూడా మరొకరి గురించి తెలియదు. అయినా కూడబలుక్కున్నట్లుగా ఒకే సమయానికి వారు సిద్ధం చేసిన చెప్పులు తీసుకుని అలిపిరి వద్దకు చేరుకున్నారు. వేంకటేశ్వర స్వామివారికి వాటిని బహూకరించారు. రెండుపాదాల కొలతలు తీసుకుని ఒకే వ్యక్తి జత చెప్పులు సిద్ధం చేసినట్లుగా వారు వేర్వేరుగా తయారు చేసుకుని వచ్చినా... స్వామివారి పాదాల కొలతలకు సరిగా అతికినట్లు వీసమెత్తు తేడా రాకుండా కచ్చితంగా సరిపోయాయి.

ఇప్పటికీ శ్రీవేంకటేశ్వర స్వామివారి అలిపిరి మెట్ల దగ్గర పెట్టిన చెప్పులు కచ్చితంగా ఏడాది యేటప్పటికి అరిగిపోతాయట. ఆ చెప్పులు తలమీద పెట్టుకుని భక్తులు ప్రదక్షిణం చేస్తారు. కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు రోజూ ఏడుకొండలు దిగి పద్మావతీ అమ్మవారి దగ్గరకు వెళ్లేటప్పుడు ఆ చెప్పులే వేసుకుని వెడతాడని భక్తుల నమ్మకం.

అన్నమయ్య ఆనంద తన్మయత్వంతో చేసుకున్న ఈ కీర్తనలు ప్రతి ఇంటిలో వినిపిస్తే, పిల్లల నాలుకల మీద పిచ్చి పిచ్చి పాటలు పోయి ''కుమ్మర దాసుడైన కురువరతి నంబి/యిమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు/దొమ్ములు సేసినయట్టి తొండమాం చక్కురవర్తి/రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు'' అని పాడుకుంటూ మధ్యలో ''అంటే ఏంటమ్మా '' అని అడిగితే, ఆ తల్లి కూర్చోబెట్టుకుని చెబితే పిల్లలలో భక్తి కలుగుతుంది. ఆ ఇంట పరమేశ్వరుడి అనుగ్రహం కూడా కలిగి తీరుతుంది. అంతకన్నా ఏం చేయాలి? సంసారాలేమీ విడిచి పెట్టనక్కర్లేదు. తమ పని తాము చేసుకుంటూ ఇలాంటి కీర్తనలు పాడుకుంటూ ఉంటే చాలు. సంసారాలు, సమాజాలు సద్గుణాలతో సంస్కరింపబడతాయి.

ప్రశ్నోత్తర భారతం



254. చిత్రాంగదుడికి, గంధర్వుడికి జరిగిన యుద్ధంలో ఏం జరిగింది?
255. చిత్రాంగదుడి మరణం తరవాత భీష్ముడు ఏం చేశాడు?
256. కాశీరాజుకు ఎంతమంది పుత్రికలు?
257. కాశీరాజ పుత్రికలకు స్వయంవరం జరుగుతోందని తెలిసిన భీష్ముడు ఏం చేశాడు?
258. సభాసదులందరూ చూస్తుండగా భీష్ముడు ఏమని పలికాడు?
259. వివాహాలు ఎన్ని రకాలు?
260. కాశీ రాజు ఏం చేశాడు?

-నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

**జవాబులు:** 254) గంధర్వుడు మాయలు చేశాడు. యుద్ధంలో చిత్రాంగదుడిని హతమార్చాడు. అలా వాడి చరిత్ర ముగిసింది. 255) విచిత్రవీర్యుడికి పట్టం కట్టాడు. అతడు రాజ్యపాలన చేయసాగాడు. 256) కాశీరాజుకి ముగ్గురు పుత్రికలు. అంబ, అంబిక, అంబాలిక. 257) భీష్ముడు కాశీ వెళ్లి, కాశీ రాజ సభామధ్యంలోకి దూకి, అంబ, అంబిక , అంబాలికలను తన రథం మీద ఎక్కించుకున్నాడు. 258) కాశీ రాజా! నా తమ్ముడు విచిత్రవీర్యుడు, అతని కోసం నీ పుత్రికలను తీసుకువెళ్తున్నాను అన్నాడు. 259) ఎనిమిది రకాలు, వాటిలో గాంధర్వం క్షత్రియులకు శ్రేష్ఠం. అంతేకాదు, రాజులను జయించి, వారి కన్యలను హరించటం మిక్కిలి శ్రేష్ఠం. నన్ను అడ్డుకోదలచిన వారు నన్ను గెలిచి వీరిని తీసుకుని వెళ్లండి అన్నాడు. 260) కాశీరాజు కిమ్మనలేదు. మిగిలిన రాజులు భీష్ముడికి ఎదురు తిరిగాడు. యుద్ధం జరిగింది. రాజులంతా భీష్ముని ప్రతాపాగ్ని ముందు శలభాలు అయ్యారు. రాజులందరినీ ఓడించి, ముగ్గురు కన్యలను తీసుకుని హస్తినకు బయలుదేరాడు.

సువార్త

# నాన్నా! నీకు పాదాభివందనం!!

60 ఏళ్లకు దగ్గర పడుతున్నాయి కదా అని నేను డై చెయ్యకుండా వదిలెయ్యడంతో తెల్లబారిన మీసాలతో ఉన్న నన్ను చూసి మా వాళ్లంతా 'నిన్ను చూస్తుంటే మీ నాన్నని చూసినట్టే ఉంది!' అంటుంటే నా ఆనందానికి అవధుల్లేవు. 'పరలోకమందున్న మా తండ్రీ' అన్న సంబోధనతో ఆరంభమయ్యే 'పరలోక ప్రార్థన' అందరికీ నేర్పి, దేవుణ్ణి మానవాళికంతటికీ తండ్రిగా ఆవిష్కరించిన యేసుప్రభువు బోధతో, దేవుడు ప్రజలతో కలిసిపోయాడు. మన నాన్నలేమో పరలోకపు తండ్రికి ఇహలోకపు ప్రతినిధులయ్యారు.. నాన్నలకు దేవుడిచ్చిన గౌరవాభిషేకమిది. అవసరమైనవన్నీ అప్పటికప్పుడు తెచ్చిచ్చిన నాన్న ఎప్పుడూ మన సూపర్ మాన్, ప్రథమ గురువు. నాకైతే ఆత్మీయ క్రమాన్ని నేర్పిన మొదటి పాస్టర్ కూడా!! మొత్తం పదిమంది పిల్లలమున్న మా 'చిన్న' కుటుంబాన్ని తన పరిమిత వనరులతోనే ఏదీ తక్కువ కాకుండా సంతృప్తినిస్తూ పోషించిన గొప్ప మేనేజర్ నాన్న. ఆయన చిటికెన వేలు పట్టుకొని వీధుల్లో బుడిబుడి అడుగులేస్తూ విరామం లేకుండా అడిగే నా సందేహాలకు ఓపిగ్గా ఆయనిచ్చిన జవాబులే జ్ఞాన ఖజానాకు పునాదులయ్యాయి. స్కూల్లో సాంస్కృతిక పోటీలపుడు అదే స్కూల్లో మేష్టారుగా ఎదురుగా మొదటి వరుసలో కూర్చొని ఆయన మురిపెంగా కురిపించిన ప్రోత్సాహపు చిరునవ్వులే నా గెలుపుకు ప్రేరణ. మా వూరి దొరవారు, షావుకారూ విలన్లుగా, వాళ్ళ దోపిడీ ఇతివృత్తంగా అప్పట్లో పదోతరగతిలోనే నేను నాటకం రాసి ఊర్లో వేయిస్తే, అంతా శభాష్ అన్నా, షావుకారు మాత్రం కోపించి 'ఇకపై మీకు సరుకులు అరువివ్వను పో'మ్మనప్పుడు, నన్ను పల్లెత్తు మాట అనకుండా నా స్వేచ్ఛాభావాల్ని ప్రోత్సహించిన హక్కుల నాయకుడు నాన్న.

ఇంటికి పెద్దగా, ఎన్నో భావాలు, హోదాలు, ఉదాత్తమైన ఆలోచనల సమాహారంగా, కుటుంబమంతటికీ రక్షక కవచమై ఆవరించిన ఒక మహా శక్తి నాన్న. కరెంటు కూడా లేని కుగ్రామంలో రాత్రివేళ బుడ్డిదీపం వెలుతురులో పడుకున్న నేను, కాలిదగ్గర ఏదో పాకుతున్నట్టనిపించి దిగ్గున లేచి కూర్చుంటే, ఆ అలికిడికే నాన్న చటుక్కున లేచి అరక్షణంలో నన్ను పైకెత్తి టార్చిలైటేసి చూస్తే కట్లపాము!! మరుక్షణంలో దాని తల చితకబాది కొడుకును కాపాడుకొన్న ప్రాణదాత నాన్న. ఉన్నట్టుండి నూట నాలుగు జ్వరమొస్తే, కొడుకు పక్కనే మోకాళ్లని ప్రార్థిస్తూ తడిగుడ్డతో ఒళ్ళంతా తుడుస్తూ రాత్రంతా మేల్కొన్న మహా వైద్యుడు ఆయన, మండల కేంద్రంలో జూనియర్ కాలేజీలో చదువుతున్నపుడు సామాన్యుల్ని విపరీతంగా వేధిస్తున్న ఒక కర్కోటకుడైన పోలీసుకి వ్యతిరేకంగా ఓ దినపత్రిక ఎడిట్ పేజీకి నేనొక లేఖ రాస్తే, వారు ప్రచురించారు. అతన్ని కాపాడేందుకు స్థానిక డీఎస్పీ, మీ అబ్బాయి క్షమాపణ చెప్పాలంటూ బెదిరిస్తే, 'నా కొడుకు మాత్రం క్షమాపణ చెప్పడు' అని తెగేసి చెప్పి, నన్నూ చెప్పనివ్వని మా నాన్నే నా జర్నలిస్టు నైజానికి, తిరుగుబాటు భావాలకు స్ఫూర్తి. అలాంటి నాన్న జీవితాంతం నాతోనే ఉంటే బావుండునను కొంటుంటే, 58 ఏళ్ళ వయసులోనే గుండెజబ్బుతో చనిపోగా నా ప్రపంచమంతా తలకిందులయ్యింది. ఈ రోజున లక్షలమందికి నాన్న గురించి చెబుతున్న విషయాల్లో ఒక్కటి కూడా ఆయనతో చెప్పలేకపోయానే అన్న పుట్టెడు దిగులు మిగిల్చి మరీ ఆయన వెళ్ళిపోయాడు. నేనూ ఒక నాన్నగా.. నాన్న ఇప్పుడుంటే ఎంత బావుండేది? అనుకోని సందర్భమే లేదు. నా కుటుంబానికి నాన్నగా నా బరువులు, బాధ్యతలు పెరిగేకొద్దీ నాన్న మరింత ఎక్కువగా గుర్తుకొస్తున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయత. నాన్న మా అమ్మను ప్రేమించిన పద్ధతి చూసి భార్యను ప్రేమించడం నేర్చుకున్నాను. ఆయన తన పిల్లల్ని తీర్చిదిద్దిన పద్ధతిలో నా పిల్లల పెంపకం తెలుసుకున్నాను.. బంధుప్రీతి, శక్తికి మించిన బాధ్యతలు నెత్తినేసుకోవడం కూడా ఆయనతోనే అలవడ్డాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే జీవితమంతా ఆయనే నిండి ఉన్నా, నాన్న లేడన్న వెలితి, బాధ మాత్రం పోలేదు.. బాధ్యతలు, సవాళ్లు ఎక్కువయ్యే కొద్దీ ఆ వెలితి భావన బలపడుతూ వచ్చింది. మొన్న గుండెసర్జరీలో నాకు ఏమైనా జరగొచ్చునన్న భయం, నాకేమన్నా అయితే నా కుటుంబం మెలా? అన్న దిగులులో నాన్న అవసరం మరింత కనిపించింది. గుండెజబ్బుతో ఉన్న నేను బైపాస్ సర్జరీకోసం ఆపరేషన్ థియేటర్‌కు స్ట్రెచర్‌పై వెళ్తున్నపుడైతే సమాధిలోకి వెళ్తున్నట్టే అనిపించింది. ఆప్తులంతా ధైర్యం చెబుతుంటే అది తుది వీడ్కోలే అనిపించింది. సరిగ్గా అపుడే వచ్చాడు నాన్న!! నిజం!! ముప్పై ఏళ్ళ క్రితం మా నాన్న చనిపోయిన ఏడాదే పుట్టిన కారణంగా ఆయన పేరే నేను పెట్టుకున్న నా కొడుకు నా పైకి వంగి నా నుదుట ముద్దుపెట్టి' డాడీ, దేనికైనా నీకు, అమ్మకు, మనందరికీ నేనున్నానని మర్చిపోకు. అస్సలు భయపడొద్దు. బి బ్రేవ్!!' అంటున్నప్పుడు వాడిలో నాకు మా నాన్న స్పష్టంగా కనిపించాడు. నా గుండె దూది పింజలా ఒక్కసారిగా తేలికయింది.. 'నీవింకా నా ఇంట్లోనే ఉన్నావా నాన్నా!!' అనుకొంటూ మా నాన్నని నా కొడుకులో చూసుకొంటూ సర్జరీకి హాయిగా వెళ్లాను. అప్పుడర్థమయింది, నాన్నలు అసలు చనిపోరని, భావితరాల్లో చిరంజీవులై జీవిస్తుంటారని.

పేరేదైనా కొద్దిపాటి తేడాలతో ప్రతి నాన్నది ఇదే వ్యక్తిత్వం, ఇదే పాత్ర... నాన్నలందరికీ నా పాదాభివందనం....

**- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**
prabhukirant@gmail.com





ఇస్లాం వెలుగు

# తండ్రి సంతోషమే దైవ సంతోషం

పిల్లల్ని తల్లి కడుపులో పెట్టుకుని పెంచితే.. తండ్రి వాళ్లను గుండెలపై మోస్తాడు. కన్నబిడ్డలే జీవితంగా బతుకుతాడు. తన కళ్ల ముందు పిల్లలు ఎదుగుతూ ఉంటే సంతోషపడతాడు. వాళ్లు ఏదైనా సాధిస్తే, తానే సాధించినంతగా సంబరపడిపోతాడు. పిల్లలకు చిన్న అనారోగ్యం కలిగినా తల్లడిల్లిపోతాడు. చేయిపట్టి నడిపిస్తాడు.కంటికి రెప్పలా కాపాడుతాడు. పిల్లల ధైర్యం తండ్రి. పిల్లలకు ఓ మంచి నేస్తం నాన్న. హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ గార్ల ఉదాహరణే దీనికి సజీవ సాక్ష్యం. అందుకే తండ్రి స్థానానికి అత్యంత గౌరవమిచ్చారు ముహమ్మద్ ప్రవక్త (స).తండ్రి సంతోషంలోనే దైవ సంతోషం ఇమిడి ఉందన్నారు. తండ్రి స్వర్గానికి సింహ ద్వారమని చెప్పారు. తండ్రిని గౌరవించని, విధేయత చూపని సంతానానికి స్వర్గ ప్రవేశం దుర్లభం. 'ఫాదర్స్ డే' రోజున మాత్రమే తండ్రిని గౌరవించడం కాదు. ప్రతినిత్యం గౌరవించాలి. ప్రతిక్షణం విధేయత చూపాలి. ప్రతిసందర్భంలోనూ సంప్రదించాలి. ఆశీర్వాదాలు తీసుకోవాలి.

పిల్లల పెంపకంలో తల్లిది ఎంత పాత్రో తండ్రిదీ అంతే. కొంతమంది బాధ్యత లేని నాన్న లు ఉండవచ్చు. కానీ వాళ్ళల్లో కూడా ప్రేమ లేదని చెప్పలేం. ఎందుకంటే అది బంధం యొక్క గొప్పతనం. చాలా మంది భర్తలు భార్యల విషయంలో వివాదాస్పదులు కావచ్చు. కానీ, పిల్లలకు మాత్రం ప్రేమను పంచే గొప్ప తండ్రులుగానే ఉంటారు.

తండ్రి పిల్లలకు రూపంతో పాటు, తనకు తెలియకుండానే తన ప్రవర్తన ద్వారా పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తాడు. ఎందుకంటే, పిల్లలు పసితనం నుండీ తండ్రిని గమనిస్తుంటారు. గమనించిన దాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తారు. ఈ విధంగా తండ్రి పిల్లలకు గురువుగా, మార్గదర్శిగా నిలుస్తాడు.

చిన్నప్పటినుండీ తండ్రి చూపిన ప్రేమ, తమకోసం తెచ్చే వస్తువులు, తిప్పే ప్రదేశాలు అన్నీ ఒక వయసుకు వచ్చేవరకు వారికి చాలా బావుంటాయి. అప్పటి వరకూ అమ్మ నాన్న కళ్లతో చూసిన లోకం, అప్పటి నుంచీ తమకు నచ్చినట్లు చూడాలని, నచ్చింది చేయాలని అనిపిస్తుంది. అనుభవంతో చెప్పే నాన్న మాటలు అర్థంలేనివిగా అనిపిస్తాయి. అప్పటివరకు నాన్న ద్వారా నేర్చుకున్న విషయాల్లో మార్పులు చేర్పులు చేస్తూ సొంత నిర్ణయాలు తీసుకుంటారు.

కాలప్రవాహంలో, ఆధునికతా మోజులో పడి ఒంటరి ప్రయాణం చేస్తూ, ఎదురు దెబ్బలు తగిలినప్పుడు తండ్రి గుర్తుకు వస్తాడు. తను ఎదుర్కొనే ఒడిదుడుకుల అనుభవంతో, 'అవును నాన్న చెప్పింది నిజమే. నేనే వినలేదు'. అనుకునే సందర్భాలూ చాలానే ఉంటాయి. ఆ వాస్తవం తెలిసి వచ్చిన నాడే వారికి పూర్తి పరిణతి వచ్చినట్టు లెక్క. ఎందుకంటే తండ్రి అయ్యాకే ఎవరైనా పిల్లకోసం ఆలోచిస్తారు. తండ్రి అయిన తరువాతే తండ్రి విలువ ఏమిటో తెలుస్తుంది.

పిల్లల్లో మంచి లక్షణాలు పాదుకొల్పడానికి, వాళ్ళ భవిష్యత్తును బంగారు మయం చేయడానికి, వారి ఆర్థిక భరోసా కోసం తండ్రి పడే తపన, శ్రమ, ఆరాటం, పోరాటం ఎలాంటిదంటే..ప్రకృతిలో గాలి మనకు కనిపించకుండానే మనం బతకడానికి ప్రాణ వాయువును ఎలా అందిస్తుందో.. తండ్రి కూడా మనకు తెలియకుండానే మనకోసం తన ఉనికినే పణంగా పెడతాడు. కనుక తండ్రిని గౌరవించాలి. ప్రేమించాలి. విధేయత చూపాలి. తండ్రి మనసు కష్టపెట్టకూడదు. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ తండ్రిని సంతోషపెట్టాలి. అప్పుడే దైవం సంతోషిస్తాడు. స్వర్గాన్ని బహూకరిస్తాడు.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**



**సాక్షి ఫ్యామిలీ**

**సినిమా**

నల్లగొండ
ఆదివారం
16-6-2019

# పిల్లలకు మనం ఓ పుస్తకం కావాలి


● ప్రకాశ్‌రాజ్

**"పిల్లలు పుట్టినప్పుడే తల్లీదండ్రీ పుడతారు. పిల్లలతో పాటు పేరెంట్స్ కూడా ఎదగాలి" అంటున్నారు ప్రకాశ్‌రాజ్. ఒక తండ్రి ఎలా ఉండాలి? పిల్లలు సరైన దారిలో నడవాలంటే పేరెంట్స్ ఏం చేయాలి? వంటి విషయాలను 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు.**

**సినిమాల్లో అనేక తండ్రి పాత్రలు పోషించారు. ఓ తండ్రి పిల్లలతో ఎలా ఉండాలి?**

సినిమాలు వేరు. జీవితం వేరు. సినిమాల్లో కథ చెప్పడానికి సృష్టించిన పాత్రలవి. వాళ్లు నిజంగా తండ్రులు కారు. వాళ్లు అమ్మలూ కాదు. సరదాగా చెప్పాలంటే మహాత్మాగాంధీ గారి తర్వాత నేనే ఫాదర్ ఆఫ్ ది నేషన్ అంటాను. అన్ని రకాల తండ్రి పాత్రలు చేశా. పాజిటివ్, నెగటివ్, కేరింగ్ ఇలా అన్నీ చేశా. అవి వేరు. కథను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో ఈ పాత్ర ద్వారా కొన్ని భావాలు చెబుతుంటారు. జీవితం విషయానికొస్తే... తండ్రి అనేది ఒక వ్యక్తిత్వం. నాకు మొత్తం నలుగురు పిల్లలు. ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. దురదృష్టవశాత్తు ఒక కొడుకు చనిపోయాడు. ఇప్పుడు ఈ ముగ్గురూ కలిపి నేను. మనం అనుకుంటాం.. మనం పిల్లల్ని పెంచుతున్నాం అని. మనం మాత్రమే కాదు, మనతోపాటు మన సమాజం, మన చుట్టూ ఉండే మనుషులు, స్కూలు, నేర్చుకోవాలనే వాళ్ల ఆకలి... ఇవన్నీ కూడా వాళ్లను పెంచుతుంటాయి. పొద్దున్నే స్కూల్లో వదిలేస్తాం. సాయంత్రం 4 వరకూ రారు. ఎప్పుడూ వాళ్ల పక్కనే ఉండలేం. బయటి ప్రపంచం కూడా వాళ్లకు నేర్పిస్తుంది. భోజనం సమకూర్చడం, చదివించడం.. కేవలం ఇవే కాదు తండ్రి అంటే? పిల్లలు మానసికంగా వికాసం చెందడంలో తోడ్పడే వాడే అసలు సిసలు తండ్రి.

**పిల్లల్లో మానసిక వికాసం కోసం ఏం చేయాలి?**

ఇప్పుడు నాకు 54 ఏళ్లు. నా కూతురికి 23. నా యవ్వనంలో నా ఆకలి, ఆలోచనలు వేరు. నాకు, నా కూతురికి దాదాపు 30 ఏళ్ల డిఫరెన్స్ ఉంది. ప్రతి పదేళ్లకు జనరేషన్ మారుతుంటుంది. అది మనం అర్థం చేసుకోవాలి. పిల్లలు మన మూలంగా ఈ ప్రపంచంలోకి వచ్చిన జీవులు. వాళ్లు ఎగరడానికి రెక్కలు, శక్తి ఇవ్వాలి కానీ వాళ్లు ఎటు ఎగరాలో ఎటు ప్రయాణం చేయాలో మనం నిర్దేశించలేం. నిర్దేశించకూడదు కూడా. నిర్దేశిస్తే వాళ్లు మన చేయి పట్టుకుని నడుస్తారు. సొంత అభిప్రాయాలు ఉండవు. సొంతంగా ఆలోచించలేరు. అప్పుడు మానసిక వికాసం ఎలా వస్తుంది? అందుకే పిల్లలను ఎదగనివ్వాలి.

**మనం చేయి వదిలిస్తే సమాజం నుంచి పిల్లలు ఏదైనా చెడు నేర్చుకునే అవకాశం ఉంది కదా.. అందుకే స్వేచ్ఛ ఇవ్వకూడదనే భయం చాలా మందిలో ఉంటుంది..**

భయం ఎప్పుడు ఉంటుందంటే.. మన పెంపకంలో నమ్మకం లేనప్పుడు. మా అమ్మ మాతోనే నా ఇంట్లో ఉంటుంది. ఆమెకు 78 ఏళ్లు. 'మనం ఏదైనా తప్పు చేస్తే అమ్మకు కోపం వస్తుంది కదా' అనే పెంపకంలో నేను పెరిగాను. ఇప్పటికీ ఆ భయం ఉంటుంది. మన ఆబ్సెన్స్‌లో కూడా పిల్లలతో మన ప్రెజెన్స్ ఉండాలి. మనం ప్రేమతో, బాధ్యతతో పెంచితే పిల్లలు అర్థం చేసుకుంటారు. ఒక ఫ్లూట్ నుంచి మ్యూజిక్ బయటకు వచ్చాక ఆ సంగీతం మీద ఆ ఫ్లూట్‌కి ఎంత హక్కుంది? పిల్లల విషయంలో కూడా అంతే. మనం ఎప్పుడైతే మన పిల్లల్ని బాధ్యతగా పెంచుతూ, వాళ్ల ఆశల్ని, ఆశయాల్ని గౌరవిస్తామో అప్పుడు ఎలాంటి భయాలూ ఉండవు.

**మన పిల్లలు చెడు దారి పట్టరనే నమ్మకం తల్లిదండ్రులకు ఎలా కలుగుతుంది?**

ఇప్పుడు నా పెద్ద కూతురిని తీసుకుందాం. 17 ఏళ్లకే తనంతట తానే ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లగలిగేంత సామర్థ్యం ఉన్న అమ్మాయిలా పెరిగింది. 12 ఏళ్ల వయసులో తనకు పెయింటింగ్‌లో ఆసక్తి ఉందని చెప్పింది. హాస్టల్‌లో పెట్టాను. మ్యూజిక్ నేర్చుకుంది. యూకే వెళ్తాను అంది. పంపించాను. మా ఇద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, స్నేహం అలాంటిది. అది ఎలా కుదిరిందీ అంటే.. కూర్చుని మాట్లాడటం వల్ల. మన పిల్లల ఆలోచనలను గౌరవించకపోతే వాళ్లతో కూర్చుని ఓపెన్‌గా మాట్లాడలేం. అసలు వినం కూడా. అది తప్పు. మనం పెద్ద వాళ్లయినంత మాత్రాన మనదే కరెక్ట్ అనుకోకూడదు. పిల్లలు కిందపడితే 'నాకు మా అమ్మానాన్నలు ఉన్నారు' అనే భరోసా ఇవ్వాలి. అప్పుడు చెడు దారి పట్టరు.

**ఒక భర్తకు భార్య విలువ కూతురు పుట్టాక తెలుస్తుంది అంటారు. నిజమేనా?**

అవును. చాలామంది భర్తలు భార్యని దేవతగా చూసి మావగారిని విలన్‌గా చూస్తారు. అయితే వాళ్లకు కూతురు పుట్టినప్పుడే 'నా భార్య కూడా ఇంకొకడి కూతురే కదా. నా కూతురి విషయంలో నేనెంత ప్రొటెక్టివ్‌గా ఉన్నానో తన కూతురి విషయంలో ఆ తండ్రి కూడా అలానే ఉంటాడు కదా' అని అర్థం అవుతుంది. మామగారు పెళ్లి చేసి భర్తతో పంపించే శాక, 'ఇది నా సొమ్ము. తను వాళ్ల నాన్నగారి మాట ఎందుకు వినాలి ? వింటే ఇక్కడ ఉంటావు.. లేదంటే పుట్టింటికి వెళ్లిపోతావు' అంటాం. అదే కూతురు అత్తింటికి వెళ్లిపోతున్నప్పుడు వేరే ఫీలింగ్ ఉంటుంది. అందుకే అంటున్నా... పిల్లలు పుట్టినప్పుడే తండ్రి కూడా పుడతాడు. అప్పటివరకూ ఉన్న మగవాడు వేరు. ఆ తర్వాత వేరు. కొత్త మనిషి అన్న మాట. ఆ కొత్త మనిషి పిల్లలతో పాటు ఎదుగుతాడు.

**తాగుబోతు తండ్రి, బాధ్యత లేని తండ్రుల వల్ల పిల్లలు కూడా అలానే తయారవుతారా?**

లేదు. ఒక ఇంట్లో తండ్రి తాగుబోతు, పిల్లలను పట్టించుకోలేదు అనుకుందాం. తల్లి పెంచింది అనుకుందాం. అలాంటి తండ్రి కూడా ఓ తండ్రి ఎలా ఉండకూడదో పిల్లలకు నేర్పినట్లే. పెద్దయ్యాక తన పిల్లల విషయంలో ఇలా ఉండకూడదని ఆ పిల్లలు నేర్చుకుంటారు. మంచి తండ్రిని చూసి మంచిని, చెడ్డ తండ్రిని చూసి మంచిని నేర్చుకుంటారు. ఏదైనా పాఠమే. వాళ్ల గాయాలు, వాళ్ల తపనలు, వాళ్ల పడిపోవడాలను వాళ్లనే అనుభవించనివ్వాలి. పడిపోతే పట్టుకోవడానికి 'నేనున్నాను' అనే నమ్మకాన్ని పిల్లలకు కలిగించగలగాలి.

**ఇలాంటి నమ్మకాన్ని కలిగించగలిగితే వాళ్లు సరైన మార్గంలో వెళ్తారంటారా?**

వెళ్తారు. నువ్వు తరచూ వాళ్లతో మాట్లాడుతుండాలి. పొద్దున్నే స్కూల్ యూనిఫామ్ వేసి, స్కూల్‌కి పంపుతున్నాం.. అది చేశాం.. ఇది చేశాం అని త్యాగాలు చేస్తున్నట్టు మాట్లాడతాం. ముందు దాన్ని తీసేయాలి. నిన్ను ఎవడు అడిగాడు త్యాగం చేయమని? పిల్లల్ని పెంచడం నీ బాధ్యత. పిల్లల కోసం నువ్వు కష్టపడుతున్నావు. దాన్ని చెప్పి చూపిస్తూ పెంచకూడదు. నీ ఫిలాసఫీ ఏంటి? నీ నమ్మకాలేంటి? అనేవి మాట్లాడుతుండాలి.. అంతే. పిల్లలు మనల్ని ఒక పుస్తకం చదివినట్టు చదువుతుండాలి. మన పిల్లల దగ్గరే మనం సీక్రెట్స్ పెట్టుకున్నాం కదా? పిల్లలు తల్లినో తండ్రినో చూసే పెరుగుతారు. వాళ్లకు పుస్తకంగా ఉండగలిగితేనే ఏది తప్పో ఏది రైటో డిసైడ్ చేసుకోగలుగుతారు. మనం అది చేయం. మన సీక్రెట్స్ మనం పెట్టుకుంటాం. మన ప్లస్ పాయింట్స్,. మన శక్తిని మాత్రమే చూపిస్తాం. పిల్లలకన్నా మనం స్ట్రాంగ్ అని చూపిస్తూ ఉంటాం.

**ఇవన్నీ మీరెలా తెలుసుకోగలిగారు?**

మనిషి అంటేనే అద్భుతం. తన బతుకుని తన కళ్ల ముందు చూసుకుంటూ.. కొన్ని వాస్తవాల మీద దృష్టి పెడితే వాళ్లకే అర్థం అవుతుంది. కొంతమంది పిల్లల్ని కొడతారు. వాళ్లను కొట్టడానికి అసలు చేయి ఎలా వస్తుంది? పెరుగుతున్న ఓ చిన్న మొక్కను కొట్టే హక్కు నీకు ఎవరిచ్చారు. మనం పిల్లలతో అటాచ్డ్‌గా ఉంటూనే డిటాచ్డ్‌గా ఉండాలి. వాళ్ల గ్రోత్‌ని ఎంజాయ్ చేయాలి. వాళ్లతోనే ఎదగాలి.

**మరి మన కోపాన్ని పిల్లల మీద ఎలా చూపించాలంటారు? మన అనుభవంతో ఆలోచించి కొన్ని చేయొద్దు అంటాం కదా?**

ఆ విషయాన్ని ముక్కుసూటిగా మీ పిల్లలతోనే చెప్పండి. అయితే మనకు బేసిక్‌గా సహనం ఉండదు కదా. 'నీకేం తెలుసు' అంటాం. ఆ మాట ఎలా వస్తుంది అసలు? వాళ్లు పిల్లలు. వాళ్లకు తెలియాల్సిన అవసరం లేదు. అక్కడ నువ్వు సహనంగా కూర్చుని వివరించి చెప్పొచ్చు కదా. నా మూడేళ్ల కొడుకుతో నేను మాట్లాడుతుంటాను. వాడితో ఏం మాటలు అంటుంది నా భార్య. లేదు.. వాడికి చెప్పాలి, మాట్లాడాలి అంటాను నేను. అది నా బాధ్యత. ఒక్కసారి కాకపోతే 10 సార్లు చెబుతాను. 'ఐయామ్ హర్ట్' అంటాను వాడితో. వాడికి అర్థం అయ్యేలా చెప్పడానికి. చేయెత్తను. వాళ్లకు తెలియదని మనకు తెలుసు కదా. అర్థం అయ్యేట్టు చెబితే వాడికి బుర్రలోకి ఎక్కుతుంది.


● భార్యాపిల్లలతో ప్రకాశ్‌రాజ్

**మీరు చెప్పినవాటిలో మీ మూడేళ్ల కొడుకు అర్థం చేసుకుని, ఆచరిస్తున్నవాటి గురించి?**

వాడికి మిల్క్ ప్రొడక్ట్స్ పడవు. ఆ విషయం వాడికి అర్థమయ్యేలా చెప్పాలి. ఓపికగా చెప్పాను. దాంతో ఎవరైనా మిల్క్ చాక్లెట్ ఇస్తే 'నో.. అది నాకు అలర్జీ' అని అంటాడు వాడు. నేనే ఇచ్చినా 'డాడీ యాక్' అంటాడు. నా పిల్లలు పెద్ద పెద్ద పదాలు, వాక్యాలతో మాట్లాడతారు. నా చిన్నోడు కూడా. ఎందుకంటే నేను పెద్దవాళ్లతో మాట్లాడినట్టే వాళ్లతోనూ మాట్లాడతాను. అలానే వాళ్లు నేర్చుకుంటారు. వాళ్లను వాళ్లు ఎక్స్‌ప్రెస్ చేయడం నేర్చుకుంటారు. నా కొడుకు మాట్లాడుతుంటే అందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది. వాడి సంగతి ఎలా ఉన్నా 50 ఏళ్ల వయసులో నాకు కొడుకు పుట్టాడు. దాంతో నాకు మళ్లీ 10, 15 సంవత్సరాల యవ్వనం వచ్చినట్టుంది. 'జనరేషన్‌కు ఒకర్ని కన్నావు కదా డాడీ' అని నా కూతురు సరదాగా అంటుంది.


● కుమారుడు వేదాంత్‌తో..

**మీరు మళ్లీ పెళ్లి చేసుకుంటాను అన్నప్పుడు మీ ఇద్దరు కూతుళ్లు మిమ్మల్ని అర్థం చేసుకున్నారా?**

నేను పెళ్లి చేసుకునే సమయానికి మా పెద్దమ్మాయికి 14 ఏళ్లు. నా తల్లి, చెల్లి, కూతురు.. ముగ్గుర్నీ కూర్చోబెట్టి నేను పెళ్లి చేసుకోవాలనుకున్న అమ్మాయి (పోనీవర్మ)ను తీసుకొచ్చి 'ఈమెను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. మీరేమంటారు? అని అడిగాను. మా అమ్మాయి 'డాడీ.. గో ఎహెడ్' అంది. మా అమ్మ ఏడ్చేసింది. నా ఫ్యామిలీలోనే చాలామంది స్త్రీలు ఉన్నారు. అమ్మ, భార్య, పిల్లలు, చెల్లి.. ఇలా వీళ్లందరికీ ఎక్స్‌ప్రెస్ చేయాల్సిన బాధ్యత నా మీద ఉంది. మనం ఒక సొసైటీలో బతుకుతున్నాం. నన్ను చూస్తూనే నా కూతుళ్లు ఇద్దరూ పెరిగారు కదా. వాళ్ల అమ్మతో అనుచితంగా ప్రవర్తిస్తే నా కూతుళ్లు కూడా ఆడవాళ్లే కాబట్టి నా మీద కోపం పెరుగుతుంది. అప్పుడు ఒక మగాడిగా వాళ్లకు నేను మంచి ఎగ్జాంపుల్ ఎలా కాగలను? పిల్లల విషయంలో లత (మొదటి భార్య), పోనీ (రెండో భార్య) ఫ్రెండ్స్ అయిపోయారు. లతకు ఇప్పుడు నేను భర్తని కాదు. పోనీకు మాత్రమే భర్తను. లతకు నేను మాత్రమే డివోర్స్ ఇచ్చాను. నా పిల్లలు, మా అమ్మ డివోర్స్ ఇవ్వలేదు. లతకు, నాకూ మధ్య సమస్య ఉండి, అబద్ధాలతో కలిసి బతకొద్దని విడిపోయాం. ఒక తల్లిదండ్రులుగా పిల్లల మీద చూపించే ప్రేమ ఒకటే కానీ, భార్య, భర్తగా విడిపోదాం అనుకున్నాం. దానికి లత, పోనీ ఒకర్ని ఒకరు ద్వేషించుకోవాల్సిన అవసరం లేదు. ఒక స్త్రీకి అన్యాయం చేస్తూ ఇంకో స్త్రీతో ఎలా ఉండగలుగుతాను. ఈ స్త్రీ విషయంలో నేను చేసినది కరెక్ట్ అనిపిస్తేనే ఇంకో స్త్రీతో జీవితాన్ని పంచుకోగలుగుతాను. అందుకే హానెస్ట్‌గా ఉన్నాను. లత, నేను ఓపెన్‌గా మాట్లాడుకున్నాం. ఇలాంటి ఎగ్జాంపుల్స్ చూస్తూనే పిల్లలు పెరుగుతారు. అప్పుడే వాళ్ల నిర్ణయాలను వాళ్లు ధైర్యంగా తీసుకోగలుగుతారు. ఎవరైనా సమాజానికి కాదు మనస్సాక్షికి భయపడాలి.

**రెండో పెళ్లి ద్వారా కలిగిన మీ కుమారుడితో మీ పెద్ద కూతుళ్ల బాండింగ్?**

పెద్దమ్మాయికి 23, చిన్నదానికి 13, వాడికి 3. నా భార్య నా మరో కూతురులాంటిది. తనకి 42. నాకు 54. అందరికీ దాదాపు పదేళ్ల గ్యాప్ ఉంది గమనించారా? మొన్నే అందరం కాశ్మీర్ వెళ్లాం. వీలు కుదిరినప్పుడల్లా ఏదో ప్లేస్‌కి వెళతాం. ఎంజాయ్ చేస్తాం. మా బాండింగ్ బావుంటుంది.

**కూతుర్ని కొడుకులా పెంచాను అంటారు కొందరు.. అలా అనడం ద్వారా కొడుకే గొప్ప అని చెప్పినట్లు అవుతుంది కదా?**

అవును. ఎవరో నాతో మా పెద్దమ్మాయిని చూపిస్తూ 'నీ పెద్దకొడుకు' అన్నారు. 'కొడుకు కాదయ్యా.. తను నా కూతురు. కొడుకు కన్నా ఎక్కువ' అని చెప్పా. ఆ సెన్సిటివిటీ చాలా ముఖ్యం. జెండర్ ఈక్వాలిటీ అనేది మన ఇంట్లోనే మొదలవ్వాలి. ఇంట్లో కొడుకు అయితే ఒకలా చూడటం కూతురైతే మరోలా చూడటం చేయకూడదు. అలా చేస్తే సమాజం ఎప్పటికీ మారదు.

**అలాగే కూతుళ్లను చదివించడం వేస్ట్ అని కొందరు అనుకుంటారు...**

నేను దత్తత తీసుకున్న ఊర్లో గవర్నమెంట్ స్కూల్‌లో ఆడపిల్లలు ఎక్కువ ఉన్నారు. ప్రైవేట్ స్కూల్‌కి వెళ్లే బస్ నిండా అబ్బాయిలే. ఆ తేడా ఎందుకో? కూతుళ్లైతే ఏంటి? కొడుకులైతే ఏంటి? ఇద్దరూ మన పిల్లలే కదా. నా లైఫ్‌లో మెన్ కంటే విమెన్ చాలా స్పెషల్ అని గర్వంగా చెప్పగలను. ఉమెన్ ఈజ్ వెరీ స్పెషల్. వెరీ క్రియేటివ్, డౌన్ టు ఎర్త్. యాక్చువల్లీ వాళ్లే ఎర్త్. నేచర్. మగాళ్ల కంటే కూడా స్త్రీలు కచ్చితంగా కొంచెం విలువైన వాళ్లే.

**ఫైనల్లీ మీ పిల్లలతో మీరు మాట్లాడేవాటిలో ఎక్కువగా వచ్చే టాపిక్స్ గురించి?**

ఫిలాసఫీ, పాలిటిక్స్, సాహిత్యం, మొక్కలు, జీవితం... ఇలా అన్నింటి గురించీ మాట్లాడతాను. నేను చదివిన పుస్తకాల గురించి, విన్న కవిత గురించి చెబుతాను. వాళ్లు ఏదో చెబుతారు. అలా సంభాషించుకుంటాం. పిల్లలకు మనం ఓపెన్ బుక్ అవ్వాలంటే ఇలాంటివన్నీ ఉండాలి. అవన్నీ మాటల వల్లే అవుతుంది. అందుకే పిల్లలతో మాట్లాడదాం. ఆ మాటలే మనల్ని వాళ్లకు దగ్గరగా ఉంచుతాయి.

**పిల్లలకు టైమ్ స్పెండ్ చేసే తీరిక లేనంత బిజీగా తల్లిదండ్రులు ఉండవచ్చా?**

అస్సలు ఉండకూడదు. మనం చెప్పక ముందే తల్లిదండ్రులతో తమ బంధాన్ని అర్థం చేసుకునే పరిపక్వత ఎప్పుడు ఏర్పడుతుంది? అంటే.. పిల్లలతో మనం ఎక్కువ టైమ్ స్పెండ్ చేసినప్పుడే. తండ్రి అనేవాడు పిల్లలకు మరిచిపోలేని మంచి అనుభూతి అవ్వాలి. మరిచిపోలేని క్షణాలు అవ్వాలి. ప్రపంచంలో ఎంత ఒత్తిడి ఉన్నా అవన్నీ మర్చిపోయి పిల్లలతో గడపాలి. వాళ్లతో ఎక్కువ సమయం గడిపేందుకు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే పిల్లలు, తల్లిదండ్రులూ కలిపి పెరుగుతారు. మనం ఆల్రెడీ ఎదిగిపోయాం, వాళ్లు ఎదగాలి అన్నట్టు ఉండకూడదు. ఓ రిలేషన్‌షిప్‌ని నేను అలానే చూస్తాను. మా పిల్లలతో అలానే ఉండే ప్రయత్నం చేస్తున్నాను.

– డి.జి. భవాని


● ఎన్టీఆర్, రామ్‌చరణ్

# లుక్ డేట్ లాక్?

'ఆర్ఆర్ఆర్‌లో' ఎన్టీఆర్ లుక్ ఎలా ఉండబోతోంది? రామ్‌చరణ్ మీసాలతో ఎలా కనిపించబోతున్నారు? అని ఊహించుకుంటున్న ఫ్యాన్స్‌కో గుడ్‌న్యూస్. 'ఆర్ఆర్ఆర్' సినిమాలో ఎన్టీఆర్–చరణ్‌ల లుక్ రివీల్ చేసే తేదీని రాజమౌళి ఫిక్స్ చేసేశారని తెలిసింది. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్ఆర్ఆర్'. డీవీవీ దానయ్య నిర్మాత. రామ్‌చరణ్‌కు జోడీగా ఆలియా భట్ నటిస్తున్నారు. ఎన్టీఆర్‌కు హీరోయిన్ ఎవరూ ఫిక్స్ కాలేదు. కొమరమ్ భీమ్, అల్లూరి సీతారామరాజు పాత్రల్లో ఎన్టీఆర్, చరణ్ కనిపిస్తారు. 1920లలో పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను ఆగస్ట్ 15న రిలీజ్ చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉందట. స్వాతంత్ర్యం వచ్చిన రోజున స్వాతంత్ర్య సమర యోధులుగా వీరి లుక్స్ రిలీజ్ చేస్తే బావుంటుంది అనుకున్నారట. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్, తమిళ నటుడు సముద్రఖని ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూలైలో రిలీజ్ కానుంది.

# విరాటపర్వం ఆరంభం


● చెరుకూరి సుధాకర్, వెంకటేశ్, వేణు ఉడుగుల, సురేశ్‌బాబు, దివాకర్ మణి

అజ్ఞాతవాసం కోసం పూర్వం విరాటరాజు కొలువులో పాండవులు కొలువు దీరి కార్యసిద్ధులయ్యారు. ఇప్పుడు వెండితెరపై రానా 'విరాటపర్వం' మొదలైంది. 'నీదీ నాదీ ఒకే కథ' ఫేమ్ వేణు ఉడుగుల దర్శకత్వంలో రానా హీరోగా నటించనున్న 'విరాటపర్వం' సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయికగా నటించనున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ పతాకాలపై డి. సురేష్ బాబు, సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నటుడు వెంకటేశ్ క్లాప్ ఇవ్వగా, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాతలు డి. సురేష్ బాబు, సుధాకర్ చెరుకూరిలు దర్శకుడు వేణు ఉడుగులకు స్క్రిప్ట్ అందించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే వారంలో స్టార్ట్ కానుంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, మోహన్ చెరుకూరి, వై. రవిశంకర్, సాహు గారపాటి, అభిషేక్ అగర్వాల్, రామ్ ఆచంట, దర్శకులు చందు మొండేటి, అజయ్ భూపతి, వెంకటేశ్ మహా, ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్న ఈ సినిమాకు దివాకర్ మణి కెమెరామేన్.

# 30న నిర్మాతల మండలి ఎన్నికలు


● వైవీఎస్ చౌదరి, రామసత్యనారాయణ, సి.కల్యాణ్, శ్రీనివాసరావు ప్రసన్నకుమార్, మోహన్ వడ్లపట్ల

ప్రతి రెండేళ్లకోసారి నిర్మాతలమండలి ఎన్నికలు నిర్వహిస్తారు. కానీ ఈసారి జరగాల్సిన ఎన్నికలు చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు నిర్మాతల మండలి ఎన్నికలు జూన్ 30న జరగనున్నాయి. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత సి.కళ్యాణ్, ప్రసన్నకుమార్ కలిసి 'మన కౌన్సిల్–మన ప్యానెల్' అనే నినాదంతో ముందుకు వచ్చారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ– ''నిర్మాతల మండలి నిర్మాతల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేయబడింది. నిర్మాతలందరం ఒక గ్రూప్‌గా ఏర్పడి నిర్మాతల మండలి బలంగా ఉండాలని పి.రామ్మోహన్‌రావు, డి.సురేశ్ బాబు, అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు లాంటి పెద్దలందరూ ముందుకొచ్చారు'' అన్నారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''నిజానికి ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవంగా అర్హులకు తగ్గ పదవులిచ్చి నిర్మాతల మండలి స్ట్రాంగ్‌గా ఉండాలన్నదే మా కోరిక. కానీ సమయాభావం వల్ల సభ్యులందరూ అందుబాటులో లేని కారణంగా ఎన్నికలు జరపక తప్పటం లేదు'' అన్నారు. టి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ– ''ఇండస్ట్రీలో చాలా సమస్యలున్నాయి. ఎన్నికల్లో ఎవరు గెలిచినా మిగిలిన సభ్యులు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి అర్హులైన, ఆసక్తి ఉన్న సభ్యులకి పదవులిస్తాం'' అన్నారు. ఈ ఎన్నికల్లో 'మన ప్యానెల్','గిల్డ్‌ప్యానెల్' పోటీ పడనున్నాయి. ఈ కార్యక్రమంలో వైవీయస్ చౌదరి, నిర్మాతలు మోహన్ వడ్లపట్ల, రామసత్యనారాయణ, అశోక్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

# ఆ టైమ్ వచ్చింది


● జాక్వెలిన్

దాదాపు ఏడాది పూర్తి కావొచ్చింది 'రేస్ 3' సినిమా విడుదలై. ఒక్క జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తప్ప ఈ సినిమాలో నటించిన హీరో హీరోయిన్లంతా తమ తర్వాతి చిత్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ బ్యూటీ తర్వాతి సినిమాపై ఇంకా ఎందుకు క్లారిటీ రాలేదబ్బా? అని బీటౌన్‌లో ఎంక్వైరీ చేసిన వారికి 'ఆమె యాక్టింగ్ క్లాసులకు వెళుతోందని, అది కూడా లాస్ ఏంజిల్స్‌లోని ఇవనా చుబ్బుక్ స్టూడియోలో' అని తెలిసింది. చార్లైజ్ థ్రోన్, బ్రాడ్‌పిట్, జేమ్స్ ఫ్రాంకో వంటి హాలీవుడ్ స్టార్లు ఈ స్టూడియోలోనే యాక్టింగ్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఇండస్ట్రీలోకి వచ్చిన పదేళ్ల తర్వాత యాక్టింగ్ క్లాసులు ఏంటి? అని జాక్వెలిన్‌ని అడిగితే.. ''దశాబ్దకాలంగా ఇండస్ట్రీలో సినిమాలు చేస్తున్నాను. నా కెరీర్ తొలినాళ్లలో సినిమాల గురించి అర్థం చేసుకోవడానికి నాకు టైమ్ పట్టింది. కానీ నేనెప్పుడూ యాక్టింగ్ క్లాసులు తీసుకోలేదు. ఇప్పుడు తీసుకుంటున్నాను. ట్రైనింగ్ బాగుంది. నా కెరీర్‌లో ఇప్పటి వరకు ఎక్కువగా కమర్షియల్ సినిమాలే చేశాను. ఇప్పుడు ప్రయోగాత్మక సినిమాలు చేయాలనుకుంటున్నాను. కమర్షియల్, ఎక్స్‌పరిమెంట్ .. ఇలా రెండు జానర్‌లను బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేయాల్సిన టైమ్ వచ్చిందని తెలిసింది. అందుకే ట్రైనింగ్ తీసుకుంటున్నాను'' అన్నారు. తాను నటించిన 'డ్రైవ్' గురించి మాట్లాడుతూ – ''నేను, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ నటించిన ఈ సినిమా విడుదల ఆగిపోలేదు. త్వరలోనే ఆడియన్స్ థియేటర్స్‌లో చూస్తారు' అని చెప్పుకొచ్చారు జాక్వెలిన్.




## ఓడితే భోజనం చేయకూడదా: సానియా మీర్జా



**భా**రత టెన్నిస్ స్టార్, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ భార్య సానియా మీర్జా ఎక్కడికి వెళ్లినా మీడియా వెంటాడటం, ఆమె అసహనం వ్యక్తం చేయడం చాలా సార్లు జరిగేదే. మాంచెస్టర్‌లో శనివారం భర్త షోయబ్ మాలిక్‌తో కలిసి ఆమె బయటకు వెళ్లింది. వారితో పాటు పాక్ ఓపెనర్ ఇమాముల్ హఖ్ కూడా ఉన్నాడు. దీనిని వీడియో తీసిన పాక్ జర్నలిస్ట్ ఒకరు 'కీలక మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ మానేసి షోయబ్ మాలిక్ షికార్లు' అని టీవీలో వార్త ప్రసారం చేశాడు. దాంతో ఆమెకు చిర్రెత్తుకొచ్చి ట్విట్టర్‌లో తన ఆగ్రహాన్ని ప్రదర్శించింది. 'మా ఏకాంతాన్ని గౌరవించకుండా, మాతో పసివాడు ఉన్నాడనే విషయాన్ని మరచి మా అనుమతి లేకుండా వద్దంటున్నా ఆ వీడియో తీయడమే తప్పయితే దానికో చెత్త కథనం జోడించావు. మేం వెళ్లింది షికారుకు కాదు. అయినా మ్యాచ్ ఓడినా సరే భోజనం చేసే అర్హత అందరికీ ఉంటుంది. అంతా మూర్ఖుల బృందం' అని శివాలెత్తింది.

# 'సప్త' సమరానికి సై!

సరిగ్గా నాలుగు నెలల క్రితం జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో పాకిస్తాన్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో నలభై మంది భారత సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. ఆ దాడి తర్వాత మన దేశంలో వెల్లువెత్తిన ఆగ్రహావేశాల ప్రభావం క్రికెట్‌పై కూడా పడింది. ఏమైనా సరే పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ మాత్రం ఆడవద్దంటూ వీరాభిమానుల నుంచి మాజీ ఆటగాళ్ల వరకు వ్యాఖ్యలు చేశారు. రెండు పాయింట్లు పోయినా వరల్డ్ కప్ మ్యాచ్‌ను బహిష్కరించాల్సిందేనని ప్రముఖులెందరో బహిరంగంగా పిలుపునిచ్చారు.

ఇప్పుడు సమయం గిర్రున తిరిగింది... అసలు జరుగుతుందో లేదో అని సందేహమున్న మ్యాచ్‌కు సర్వం సన్నద్ధమైంది. ఇప్పుడు ఎవరి ఆలోచనల్లోనూ పుల్వామాలు, బాలాకోట్‌లు లేవు... ఉన్నదల్లా క్రికెట్ ఒక్కటే. ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు టికెట్ల కొనుగోలు కోసం ఐసీసీ బ్యాలెట్ ఓపెన్ చేస్తే ఫైనల్ మ్యాచ్‌కు 2.7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అదే భారత్, పాక్ మ్యాచ్‌కు ఏకంగా 4 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.

ఇరు జట్ల కెప్టెన్లు దీనిని ఒక క్రికెట్ మ్యాచ్‌గానే చూడండి, ఆటను ఆస్వాదించండి అని గంభీరంగా ఎన్ని మాటలైనా చెప్పవచ్చు. కానీ వారితో పాటు అభిమానులకూ తెలుసు ఇది అన్ని మ్యాచ్‌లలాంటిది కాదని. రెండు దేశాలు మ్యాచ్ ఫలితాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయోనని! 41 ఏళ్లలో 131 సార్లు తలపడినా... భారత్, పాక్ మ్యాచ్ ఏదో రూపంలోనో, మరే కారణంతోనో ఆసక్తి రేపుతూనే ఉంది. ఇప్పుడు విశ్వ వేదికపై దాయాదుల మధ్య ఏడోసారి జరిగే సమరానికి అందరిలో అంతే ఆసక్తి, అదే ఉత్సాహం!

## నేడు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ • వరల్డ్ కప్‌కే ప్రత్యేక ఆకర్షణ
## మరో విజయంపై కోహ్లి సేన గురి • రికార్డును సవరించాలని పాక్ ప్రయత్నం
## ఈ మ్యాచ్‌కూ వాన గండం • వరుణుడు కరుణిస్తేనే పూర్తి మ్యాచ్ సాధ్యం



**మాంచెస్టర్:** రెండేళ్ల క్రితం చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్... అప్పటి భారత్ టీమ్ బలాన్ని చూస్తే పాకిస్తాన్ చేతిలో ఓడిపోవడం అనూహ్యం. సరిగ్గా చెప్పాలంటే బలహీనంగా కనిపించిన పాక్‌ను తప్పుగా అంచనా వేసి కోహ్లి సేన బోల్తా కొట్టింది. ఇప్పుడు అదే ఇంగ్లండ్‌లో మరో ఐసీసీ ఈవెంట్‌లో ఇరు జట్లు తలపడబోతున్నాయి. ఈ మధ్య కాలంలో మరో రెండు వన్డేలలో పాక్‌ను భారత్ చిత్తు చేసినా... వరల్డ్ కప్ మ్యాచ్ అంటే ఉండే జోష్ వేరు. ఈ నేపథ్యంలో ఇరు జట్లు ఇక్కడి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నేడు లీగ్ మ్యాచ్‌లో తలపడబోతున్నాయి. మూడు మ్యాచ్‌లలో ఓటమి లేకుండా విరాట్ బృందం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుండగా, ఈ సారైనా భారత్‌పై తమ చెత్త ప్రపంచకప్ రికార్డు సరిచేయాలని పాక్ ఆశిస్తోంది. అయితే ఇరు జట్లకు ప్రత్యర్థిగా వర్షం మరోవైపు నుంచి వేచి చూస్తుండటమే పెద్ద సమస్య.

### విజయ్ శంకర్‌కు చాన్స్!

ధావన్‌కు గాయమయ్యాక న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో జట్టు కొత్త కూర్పును పరీక్షించాలని భారత్ భావించింది. అయితే వర్షం కారణంగా అది సాధ్యం కాలేదు. కాబట్టి ఈ మ్యాచ్ దానికి అవకాశం కల్పించవచ్చు. ఓపెనర్‌గా రోహిత్‌కు తోడుగా రాహుల్ బరిలోకి దిగుతాడు. నాలుగో స్థానంలో విజయ్ శంకర్‌ను ఆడించాలని టీమ్ మేనేజ్‌మెంట్ దాదాపుగా నిర్ణయించుకుంది. వాతావరణం అనుకూలంగా ఉంటే అతని స్లో మీడియం పేస్ ఉపయుక్తంగా ఉంటుందని జట్టు భావిస్తోంది. ఇది మినహా మిగతా జట్టులో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. అయితే పిచ్‌ను బట్టి అదనపు పేసర్ గురించి ఆలోచిస్తామని కోహ్లి చెప్పాడు. అదే జరిగితే కుల్దీప్ స్థానంలో షమీ ఆడే అవకాశం ఉంది. వర్షంతో మ్యాచ్ కుదించాల్సి వస్తే అప్పుడు తమ జట్టు కూర్పును కూడా మార్చుకుంటామని కూడా కెప్టెన్ అన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో రోహిత్, కోహ్లి వైఫల్యమే భారత్‌ను దెబ్బ తీసింది. ఈసారి వీరిద్దరు గట్టిగా నిలబడితే టీమిండియాకు ఎలాంటి సమస్య ఉండదు. శుభారంభం లభిస్తే ఆ తర్వాత ధోని, పాండ్యా, జాదవ్ దానిని కొనసాగించగలరు. ఒక్కసారిగా ఫామ్‌ను అంది పుచ్చుకున్న ఆమిర్‌ను మన టాపార్డర్ సమర్థంగా ఎదుర్కోవడం ముఖ్యం. బుమ్రా, భువనేశ్వర్ తమ స్థాయిలో చెలరేగితే భారత్‌కు ఆరంభంలోనే మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది.

**మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

### మాలిక్‌ను ఆడిస్తారా!

భారత్‌తో వన్డేల్లో అద్భుతమైన రికార్డు ఉన్న పాక్ ఆటగాళ్లలో షోయబ్ మాలిక్ ఒకడు. అయితే అదంతా గతం. భారత్‌పై గత తొమ్మిదేళ్లలో అతను ఒకే ఒక అర్ధ సెంచరీ చేశాడు. ప్రపంచకప్‌లో కూడా ఫామ్ ఘోరంగా ఉంది. అయితే అతని అనుభవం దృష్ట్యా మరో అవకాశం ఇవ్వాలని టీమ్ భావిస్తోంది. ఆసిఫ్ అలీ స్థానంలో ఆల్‌రౌండర్ ఇమాద్ వసీమ్‌కు చోటు ఇవ్వడం మినహా గత మ్యాచ్ ఆడిన జట్టునే పాక్ బరిలోకి దించనుంది. పాక్‌కు కూడా టాప్–3నే బలం. ఈ ముగ్గురి వన్డే సగటు 50కి పైగానే ఉండటం విశేషం. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో కూడా ఫఖర్ జమాన్ సెంచరీనే భారత్‌ను ఓడించింది. ఇమామ్ ఉల్ హఖ్, బాబర్ ఆజమ్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నారు. అనుభవజ్ఞుడైన హఫీజ్ కూడా కీలకం అవుతాడు. కొత్త పేసర్ షాహిన్ అఫ్రిది బౌలింగ్‌లో భారత్ ఎప్పుడూ ఆడలేదు. ఇది తమకు అనుకూలిస్తుందని పాక్ ఆశిస్తోంది. ఆమిర్‌ను జట్టు ప్రధానంగా నమ్ముకుంది. తన శైలి బౌలింగ్‌కు ఇక్కడి పరిస్థితులు సరిగ్గా అనుకూలించే అవకాశం ఉండటంతో ఆమిర్ ప్రమాదరకంగా మారగలడు. మొత్తంగా తొలి మ్యాచ్‌లో విండీస్ చేతిలో చిత్తు కావడం మినహా పాక్ జట్టు బలంగానే కనిపిస్తోంది. ఫేవరెట్ ఇంగ్లండ్‌ను కూడా ఓడించగలిగిన సర్ఫరాజ్ బృందాన్ని తక్కువగా అంచనా వేస్తే కష్టం.

### 'జీవితకాలం సాగే మ్యాచ్ కాదు'

**అ**న్ని మ్యాచ్‌లలాగే ఇది కూడా నిర్ణీత సమయానికి మొదలై నిర్ణీత సమయానికి ముగుస్తుంది. బాగా ఆడినా, ఆడకపోయినా ఇదేమీ జీవితకాలం సాగదు. ఈ మ్యాచ్‌లో ఫలితం ఎలా ఉన్నా అదే ముగింపు కాదు. టోర్నమెంట్ ఇంకా మిగిలే ఉంది. ఏ ఒక్కరి మీదో ఒత్తిడి ఉండదు. పదకొండు మందీ బాధ్యత పంచుకుంటారు. వాతావరణం మన చేతుల్లో లేదు కాబట్టి అన్నింటికి సిద్ధంగా ఉండాలి. టీవీ రేటింగ్స్‌కు పనికొచ్చే ఆసక్తికర వ్యాఖ్యలు నేనేమీ చేయను. నాకు ఏ బౌలరైనా ఒకరే. ఆడేటప్పుడు నేను బంతిని మాత్రమే చూస్తాను. అయితే నేను ప్రతీ బౌలర్ ప్రతిభను గౌరవిస్తాను. దానిని గుర్తించి ఆడతాను. అభిమానులూ... మ్యాచ్‌ను చూడండి, చూసి ఆనందించండి. ఇది కేవలం క్రికెట్ మాత్రమే. ఈ మ్యాచ్ కోసం నన్ను టికెట్లు అడుగుతున్న స్నేహితులు, బంధువులకు ఒకటే మాట చెబుతున్నా. టికెట్ల కోసం నన్ను మాత్రం నమ్ముకోవద్దు. మీకు అవకాశం ఉంటే వచ్చి మ్యాచ్ చూడండి. లేదంటే ఇంట్లో కూర్చొని టీవీలో చూడండి. మీ అందరి ఇళ్లలో చాలా మంచి టీవీలు ఉండే ఉంటాయి. నేను ఒకసారి టికెట్లు ఇవ్వడం మొదలు పెడితే దానికి అంతు ఉండదు. అందుకే అలా మొదలు పెట్టదల్చుకోలేదు.

**-విరాట్ కోహ్లి, భారత కెప్టెన్**


పాక్ కెప్టెన్ సర్ఫరాజ్, కోచ్ ఆర్థర్

**మీ**రు హీరోలుగా మారే అవకాశం వచ్చింది. మీది 2019 బ్యాచ్. మిమ్మల్ని ఎలా గుర్తుంచుకోవాలని భావిస్తున్నారు. ఈ మ్యాచ్ ఒక అద్భుతమైన అవకాశాన్ని ఇస్తోంది. ఇందులో ఒక్కో క్షణం మీ కెరీర్‌లను నిర్వచిస్తుంది. ఏదైనా ప్రత్యేకంగా చేస్తే ఎప్పటికీ గుర్తుండిపోతారు.

**-పాక్ జట్టు సభ్యులనుద్దేశించి కోచ్ మికీ ఆర్థర్ చెప్పిన మాటలు**


చహల్, రోహిత్, బుమ్రా

### వర్షం ముంచెత్తుతోంది!

**భా**రత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతుందా..! సగటు అభిమానిని ఇప్పుడు పీడిస్తున్న ధర్మ సందేహమిది. జట్లు, బలాబలాల సంగతులు ఎలా ఉన్నా ఈ వరల్డ్‌కప్ ఫలితాలను వర్షం కూడా శాసిస్తోంది. వాన కారణంగా రద్దయిన నాలుగు మ్యాచ్‌లలో భారత్ మ్యాచ్ కూడా ఉంది. కివీస్‌తో మ్యాచ్ పోయినా పెద్దగా పట్టించుకోలేదు కానీ పాకిస్తాన్‌తో మ్యాచ్ మాత్రం కచ్చితంగా జరగాలని అంతా కోరుకుంటున్నారు. అయితే మాంచెస్టర్‌లో పరిస్థితి మాత్రం అంత ఆశాజనకంగా లేదు. ఇంగ్లండ్‌లో వాతావరణం గురించి దాదాపు కచ్చితమైన సమాచారం అందించే ఏజెన్సీలు అన్నీ ఆదివారం వర్షం పడుతుందనే చెబుతున్నాయి. ఇందులో మరో మాట కూడా తేడా లేదు. మ్యాచ్ జరిగే సమయంలోనే వానకు అవకాశం ఉందని, మధ్యాహ్నం తర్వాత ఎక్కువ కావచ్చని కూడా తెలుస్తోంది. నిజానికి శనివారం రోజంతా వాతావరణం బాగానే ఉంది. కొద్ది సేపు ఎండ కూడా కాయడంతో అభిమానులు సంతోషించారు. అయితే భారత జట్టు ప్రాక్టీస్ ముగించిన పది నిమిషాల తర్వాత చినుకులు మొదలయ్యాయి. సాయంత్రానికి వర్షం జోరు పెరిగింది. భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల సమయంలో కూడా అక్కడ భారీ వర్షం కురుస్తోంది. పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచినా ఔట్‌ఫీల్డ్ పనితీరుపైనే సందేహాలు ఉన్నాయి. చిన్న జల్లులకే సాయంత్రం మైదానంలో వేర్వేరు చోట్ల నీళ్లు నిలిచిపోయాయి. ఇలాంటి స్థితిలో మ్యాచ్ కోసం గ్రౌండ్‌ను ఎలా సిద్ధం చేస్తారో చూడాలి. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానం ఈ వరల్డ్‌కప్‌లో ఒక సెమీఫైనల్ సహా ఆరు మ్యాచ్‌లకు వేదిక కాగా, ఇదే తొలి మ్యాచ్.

చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్ చూసేందుకు అభిమానులు పెద్ద మొత్తం వెచ్చించారు. అదృష్టవశాత్తూ టికెట్ దక్కించుకున్నవారు ఎప్పుడెప్పుడు మైదానంలో అడుగు పెడదామా అని చూస్తుంటే... మరికొందరు దీనిని మంచి ఆదాయమార్గంగా భావించారు. 'వియాగోగో' అనే వెబ్‌సైట్ ద్వారా తమ వద్ద ఉన్న టికెట్లను అధిక ధరకు 'రీసేల్' చేసేందుకు సిద్ధమయ్యారు. రీసేల్‌లో ఒక్కో టికెట్ ధర భారత కరెన్సీలో కనీసం రూ. 20 వేలు పలుకుతోంది. గరిష్టంగా ఇది రూ. 62 వేలకు వరకు వెళ్లటం విశేషం. నిజంగా వానతో మ్యాచ్ రద్దయితే వీరి గుండె బద్దలవడం ఖాయం!



### పిచ్, వాతావరణం

**సా**ధారణ బ్యాటింగ్ పిచ్. కనీస మాత్రం పచ్చిక కూడా లేదు. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. అయితే ఒక్కసారిగా మారిపోయే వాతావరణం జట్టు వ్యూహాలను మార్చవచ్చు. వర్ష ప్రమాదం ఎలాగూ ఉంది. కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. 1999 ప్రపంచకప్‌లో ఇరు జట్ల మధ్య ఇక్కడే మ్యాచ్ జరిగింది.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్, రాహుల్, విజయ్ శంకర్, ధోని, జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్, చహల్, బుమ్రా.
**పాకిస్తాన్:** సర్ఫరాజ్ (కెప్టెన్), ఇమామ్, ఫఖర్, బాబర్ ఆజమ్, హఫీజ్, మాలిక్, సొహైల్/ఇమాద్, షాదాబ్, రియాజ్, ఆమిర్, షాహిన్ అఫ్రిది.

## 6-0

### ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌దే పైచేయి
### ఆరు మ్యాచ్‌లలోనూ విజయం
### ప్రతీసారి పాక్‌కు నిరాశే

**ఒ**కటోసారి...రెండోసారి...మూడోసారి... 23 ఏళ్ల వ్యవధిలో తేదీలు, వేదికలు మారాయి... నాలుగు ఖండాల్లో ఆట జరిగింది... కానీ ఫలితం మాత్రం సేమ్ టు సేమ్... ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్ విజయం. ఆరు మ్యాచ్‌లలో ఇరు జట్లు తలపడగా ఎన్ని ప్రయత్నాలు చేసినా పాక్‌కు ఒక్కసారి కూడా గెలుపు దక్కలేదు. ఇప్పుడు మరోసారి భారత్, పాకిస్తాన్ మధ్య సమరానికి సిద్ధమైన తరుణంలో టీమిండియా కొట్టిన 'సిక్సర్'ను గుర్తు చేసుకుంటే...

- **4 మార్చి, 1992 (సిడ్నీ):** ప్రపంచ కప్‌లో భారత్, పాక్ తలపడిన తొలి మ్యాచ్. 49 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సచిన్ (62 బంతుల్లో 54 నాటౌట్; 3 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం పాకిస్తాన్ 48.1 ఓవర్లలో 173 పరుగులకే ఆలౌటైంది. భారత్ 43 పరుగుల తేడాతో నెగ్గింది. కపిల్, ప్రభాకర్, శ్రీనాథ్ తలా 2 వికెట్లు తీయగా సచిన్ కూడా కీలకమైన సొహైల్ వికెట్ తీసి భారత్‌ను గెలిపించాడు. మియాందాద్‌ను రనౌట్ చేయడంలో కిరణ్ మోరే విఫలం కాగా... అతడిని వెక్కిరిస్తూ మియాందాద్ వేసిన కుప్పిగంతులు 'ఫోటో ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిపోయింది.
- **9 మార్చి, 1996 (బెంగళూరు):** ఉత్కంఠభరిత క్వార్టర్ ఫైనల్లో భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 287 పరుగులు చేసింది. నవజ్యోత్ సిద్ధూ (93; 11 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించాడు. చివర్లో అజయ్ జడేజా (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడు భారత్‌కు భారీ స్కోరు అందించింది. పాక్ 49 ఓవర్లలో 9 వికెట్లకు 248 పరుగులు చేసింది. భారత్ 39 పరుగులతో గెలిచింది. అమీర్ సొహైల్ (55), అన్వర్ (48) కలిసి మెరుపు ఆరంభాన్ని (10 ఓవర్లలో 84) ఇచ్చినా వీరిద్దరు ఔటయ్యాక పాక్ ఓటమి దిశగా పయనించింది. వెంకటేశ్ ప్రసాద్, కుంబ్లే మూడేసి వికెట్లు తీశారు. ప్రసాద్ బౌలింగ్‌లో వాదనకు దిగి తర్వాతి బంతికే సొహైల్ క్లీన్‌బౌల్డ్ కావడం అభిమానుల దృష్టిలో ఎప్పటికీ నిలిచిపోయే క్షణం.
- **8 జూన్, 1999 (మాంచెస్టర్):** ప్రపంచ కప్‌లో పాక్‌పై భారత్ విజయాల 'హ్యాట్రిక్' పూర్తి చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 6 వికెట్లకు 227 పరుగులు చేసింది. రాహుల్ ద్రవిడ్ (61), అజహరుద్దీన్ (59), సచిన్ (45) స్కోరులో కీలక పాత్ర పోషించారు. అనంతరం పాక్ 45.3 ఓవర్లలో 180 పరుగులకే కుప్పకూలింది. భారత్ 47 పరుగులతో గెలిచింది. వెంకటేశ్ ప్రసాద్ 5 వికెట్లతో చెలరేగి ప్రత్యర్థిని పడగొట్టగా, శ్రీనాథ్‌కు 3 వికెట్లు దక్కాయి.
- **1 మార్చి, 2003 (సెంచూరియన్):** టాస్ గెలిచిన పాక్ 7 వికెట్లకు 273 పరుగులు చేసింది. సయీద్ అన్వర్ (101) మినహా మిగతా వారంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 45.4 ఓవర్లలో 4 వికెట్లకు 276 పరుగులు చేసి సునాయాస విజయాన్నందుకుంది. సచిన్ (75 బంతుల్లో 98; 12 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, చివర్లో యువరాజ్ సింగ్ (50 నాటౌట్) ఆకట్టుకున్నాడు.
- **30 మార్చి, 2011 (మొహాలి):** ప్రపంచకప్‌లో విజేతగా నిలిచే దిశగా భారత్... సెమీ ఫైనల్లో పాకిస్తాన్ అడ్డంకిని దాటింది. టాస్ గెలిచిన భారత్ 9 వికెట్లకు 260 పరుగులు చేసింది. సచిన్ (115 బంతుల్లో 85; 11 ఫోర్లు) టాప్ స్కోరర్. వహాబ్ రియాజ్‌కు 5 వికెట్లు దక్కాయి. అనంతరం పాక్ 49.5 ఓవర్లలో 231 పరుగులకే ఆలౌటవ్వడంతో భారత్ 29 పరుగులతో నెగ్గింది.
- **15 ఫిబ్రవరి, 2015 (అడిలైడ్):** ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 7 వికెట్లకు 300 పరుగులు సాధించింది. కోహ్లి (126 బంతుల్లో 107; 8 ఫోర్లు) సెంచరీ చేశాడు. అనంతరం పాక్ 47 ఓవర్లలో 224 పరుగులకే కుప్పకూలడంతో భారత్ 76 పరుగులతో నెగ్గింది. షమీకి 4 వికెట్లు దక్కాయి.



భారత్, పాకిస్తాన్ రెండూ తనకిష్టమే అన్నట్లుగా వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ ప్రత్యేకమైన డ్రెస్‌తో సిద్ధమయ్యాడు. ఒక వైపు భారత పతాకం రంగులు, మరో వైపు పాక్ జెండా రంగులతో ఉన్న ఈ డ్రెస్‌ను తన బర్త్‌డేకు కూడా ధరిస్తానంటూ సరదాగా వ్యాఖ్య జోడించాడు!



## ఫైనల్లో బోపన్న జంట

మెర్సిడెస్ కప్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-డెనిస్ షపోవలోవ్ (కెనడా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టుట్‌గార్ట్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-షపోవలోవ్ ద్వయం 6-3, 6-4తో నిక్ కిరియోస్-మ్యాట్ రీడ్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో బ్రూనో సొరెస్ (బ్రెజిల్)- జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీతో బోపన్న జంట ఆడుతుంది.

# ఫించ్ ఫటాఫట్

- ఆసీస్ కెప్టెన్ అద్భుత శతకం
- శ్రీలంకపై 87 పరుగులతో కంగారూల విజయం
- రాణించిన స్మిత్, స్టార్క్
- కరుణరత్నే సెంచరీ మిస్




*బ్యాటింగ్, బౌలింగ్‌లో కొంత తడబడినా చివరకు శ్రీలంకపై ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. తొలుత కెప్టెన్ ఫించ్ భారీ సెంచరీతో అదరగొట్టడంతో శ్రీలంకకు సవాల్ విసిరిన కంగారూలు... అనంతరం ప్రత్యర్థి పోరాటాన్ని తట్టుకుని గెలుపును అందుకున్నారు. ఓ దశలో సింహాళీ జట్టు సంచలనం సృష్టిస్తుందేమో అనిపించినా ఆసీస్ ముందు వారి ఆటలు సాగలేదు.*

**లండన్**

డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు ప్రపంచ కప్‌లో మరో విజయం దక్కింది. శనివారం ఇక్కడి ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 87 పరుగుల తేడాతో శ్రీలంకను తేలిగ్గా ఓడించింది. కెప్టెన్ ఆరోన్ ఫించ్ (132 బంతుల్లో 153; 15 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సెంచరీకి తోడు, స్టీవ్ స్మిత్ (59 బంతుల్లో 73; 7 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. చివర్లో మ్యాక్స్‌వెల్ (25 బంతుల్లో 46 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) మెరిశాడు. ఉదాన (2/57) కీలక వికెట్లు తీయడంతో పాటు రెండు చురుకైన రనౌట్లు చేశాడు. ఛేదనలో ఓపెనర్లు కెప్టెన్ కరుణరత్నే (108 బంతుల్లో 97; 9 ఫోర్లు), కుశాల్ పెరీరా (36 బంతుల్లో 52; 5 ఫోర్లు, సిక్స్) ఇచ్చిన అద్భుత ప్రారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయిన లంక 45.5 ఓవర్లలో 247 పరుగులకే ఆలౌటైంది. పేసర్లు స్టార్క్ (4/55), రిచర్డ్‌సన్ (3/47) కీలక సమయంలో విజృంభించి ప్రత్యర్థిని నిలువరించారు. ఫించ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆసీస్ స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకుండా బరిలో దిగడం గమనార్హం.

### వారిద్దరికి తోడు.. చివర్లో అతడు

కెప్టెన్ హోదాకు తగ్గట్లు ఆసీస్ ఇన్నింగ్స్‌కు ఫించ్ మూలస్తంభంలా నిలిచాడు. అతడితో కలిసి తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించినా ఇబ్బందిగా కనిపించిన మరో ఓపెనర్ వార్నర్ (48 బంతుల్లో 26; 2 ఫోర్లు)ను ధనంజయ బౌల్డ్ చేశాడు. 53 బంతుల్లో ఫించ్ అర్ధశతకం అందుకున్నాడు. ఉస్మాన్ ఖాజా (10)నూ ధనంజయే ఔట్ చేశాడు. అప్పటికి స్కోరు 23 ఓవర్లలో సరిగ్గా 100. రన్‌రేట్ 5 లోపే. ఈ దశలో ఫించ్‌కు స్మిత్ తోడవడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ధనంజయ బౌలింగ్‌లో ఫోర్, రెండు సిక్స్‌లు బాది ఫించ్ ఊపు తెచ్చాడు. సిరివర్ధన ఓవర్లో లాంగాఫ్‌లోకి లాఫ్టెడ్ షాట్‌తో సిక్స్ కొట్టి సెంచరీ (97 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. స్మిత్ అర్ధ సెంచరీ (46 బంతుల్లో) మార్క్‌ను చేరుకోవడం, ఫించ్ దూకుడు మీద ఉండటంతో ఆసీస్ 350 పైనే చేసేలా కనిపించింది. తిసారా పెరీరా, నువాన్ ప్రదీప్, మలింగ వేసిన వరుస ఓవర్లలో వీరు ఏకంగా 45 పరుగులు పిండుకున్నారు. 128 బంతుల్లోనే 150 పరుగులు పూర్తి చేసుకున్న ఫించ్ ఇదే జోష్‌లో ఉదాన బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. మరుసటి ఓవర్లోనే మలింగ పదునైన యార్కర్‌తో స్మిత్ వికెట్లను గిరాటేశాడు. ప్రదీప్ బౌలింగ్‌లో (45వ ఓవర్) మ్యాక్స్‌వెల్ నాలుగు ఫోర్లు, సిక్స్ బాది జట్టు స్కోరును 300 దాటించాడు.


స్మిత్


కరుణరత్నే

### ఆ ఐదు ఓవర్లు...

మొదటి 25 ఓవర్లలో 110 పరుగులే చేసిన ఆసీస్ తర్వాతి 20 ఓవర్లలో 192 పరుగులతో చెలరేగింది. అయితే, ఆ జట్టు ఇన్నింగ్స్‌లో చివరి ఐదు ఓవర్లను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. భీకరంగా ఆడుతున్న మ్యాక్స్‌వెల్‌ను కట్టడి చేయడంతో పాటు, షాన్ మార్ష్, అలెక్స్ క్యారీలను అడ్డుకుని లంక ఒక్కసారిగా పుంజుకుంది. ఈ క్రమంలో 46, 47 ఓవర్లలో మలింగ, ఉదాన నాలుగేసి పరుగులే ఇచ్చారు. 48వ ఓవర్లో మలింగ 7 పరుగులతో సరిపెట్టాడు. 49వ ఓవర్లో ఉదాన సైతం 7 పరుగులే ఇచ్చి... డైరెక్ట్ హిట్‌లతో క్యారీ (4), కమిన్స్ (0)లను రనౌట్ చేశాడు. తిసారా వేసిన ఆఖరి ఓవర్లో 10 పరుగులే వచ్చాయి. మొత్తమ్మీద చివరి ఐదు ఓవర్లలో కంగారూలు మూడు వికెట్లు కోల్పోయి 32 పరుగులే చేయగలిగారు.

### లంక కలకలం రేపినా...

తమ స్థాయి ఆటకు భారీ అనదగ్గ లక్ష్యంతో బరిలో దిగిన శ్రీలంక అనూహ్యంగా విజృంభించింది. కరుణరత్నే, కుశాల్ తొలి ఓవర్ నుంచే బౌండరీలు బాదుతూ సులువుగా పరుగులు సాధించారు. ఒకటికి రెండు సార్లు బంతి ఓపెనర్ల బ్యాట్ లోపలి అంచుకు తగిలినా వాటికీ ఫోర్లు రావడంతో రన్‌రేట్ జోరుగా సాగింది. 43 బంతుల్లో కరుణరత్నే, 33 బంతుల్లో కుశాల్ అర్ధ సెంచరీలు నమోదు చేసుకున్నారు. 13వ ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటింది. అయితే, కుశాల్‌ను బౌల్డ్ చేసి స్టార్క్ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. తిరిమన్నె (16) పేలవ ఫామ్ కొనసాగిస్తూ వెనుదిరిగాడు. సెంచరీ ముంగిట కరుణరత్నే ఔటయ్యాడు. మాథ్యూస్ (9), మెండిస్ (30) పరిస్థితులకు తగ్గట్లు ఆడలేకపోయారు. ఒకే ఓవర్లో సిరివర్ధన (3), తిసారా పెరీరా (7)లను పెవిలియన్ చేర్చి లంక ను స్టార్క్ దెబ్బకొట్టాడు. ఉదాన (8), మలింగ (1) వికెట్లు రిచర్డ్‌సన్‌కు దక్కాయి.

### లంక నిరసన

ప్రపంచ కప్‌లో బస, ప్రాక్టీస్ ఏర్పాట్లు, మ్యాచ్ వేదికల విషయంలో తమ పట్ల వివక్ష చూపుతున్నందుకు నిరసన తెలుపుతూ... శ్రీలంక జట్టు ఆస్ట్రేలియాతో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశాన్ని బహిష్కరించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం జట్టు తరఫున ఎవరైనా ఒకరు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరవాలి. దీనిని ఉల్లంఘించినందుకు లంక జట్టుపై చర్యలు తీసుకునే వీలుంది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | 0.812 | 8 |
| న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | 2.163 | 7 |
| ఇంగ్లండ్ | 4 | 3 | 1 | 0 | 1.557 | 6 |
| భారత్ | 3 | 2 | 0 | 1 | 0.539 | 5 |
| శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.778 | 4 |
| వెస్టిండీస్ | 4 | 1 | 2 | 1 | 0.666 | 3 |
| దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | -0.208 | 3 |
| బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.714 | 3 |
| పాకిస్తాన్ | 4 | 1 | 2 | 1 | -1.654 | 3 |
| అఫ్గానిస్తాన్ | 4 | 0 | 4 | 0 | -1.638 | 0 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (బి) ధనంజయ 26; ఫించ్ (సి) కరుణరత్నే (బి) ఉదాన 153; ఖాజా (సి) ఉదాన (బి) ధనంజయ 10; స్మిత్ (బి) మలింగ 73; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 46; షాన్ మార్ష్ (సి) సిరివర్ధన (బి) ఉదాన 3; క్యారీ (రనౌట్) 4; కమిన్స్ (రనౌట్) 0; స్టార్క్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (50 ఓవర్లలో 7 వికెట్లకు) 334.
**వికెట్ల పతనం:** 1-80, 2-100, 3-273, 4-278, 5-310, 6-317, 7-320.
**బౌలింగ్:** మలింగ 10-1-61-1, ప్రదీప్ 10-0-88-0, ఉదాన 10-0-57-2, తిసారా పెరీరా 10-0-67-0, డి సిల్వా 8-0-40-2, సిరివర్ధన 2-0-17-0.

**శ్రీలంక ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్‌సన్ 97; కుశాల్ పెరీరా (బి) స్టార్క్ 52; తిరిమన్నె (సి) క్యారీ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 16; మెండిస్ (సి) క్యారీ (బి) స్టార్క్ 30; మాథ్యూస్ (సి) క్యారీ (బి) కమిన్స్ 9; సిరివర్ధన (బి) స్టార్క్ 3; తిసారా పెరీరా (సి) వార్నర్ (బి) స్టార్క్ 7; ధనంజయ నాటౌట్ 16; ఉదాన (సి) ఫించ్ (బి) రిచర్డ్‌సన్ 8; మలింగ (సి) ఖాజా (బి) రిచర్డ్‌సన్ 1; ప్రదీప్ (సి) క్యారీ (బి) కమిన్స్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (45.5 ఓవర్లలో ఆలౌట్) 247.
**వికెట్ల పతనం:** 1-115, 2-153, 3-186, 4-205, 5-209, 6-217, 7-222, 8-236, 9-237, 10-247.
**బౌలింగ్:** స్టార్క్ 10-0-55-4; కమిన్స్ 7.5-0-38-2; బెహ్రెన్‌డార్ఫ్ 9-0-59-1; రిచర్డ్‌సన్ 9-1-47-3; మ్యాక్స్‌వెల్ 10-0-46-0.

# జ్యోతి సురేఖ డబుల్ ధమాకా

**ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు గెలిచిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి**




**ఎస్-హెర్టోజెన్‌బాష్ (నెదర్లాండ్స్):** కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ అదరగొట్టింది. విజయవాడకు చెందిన 22 ఏళ్ల జ్యోతి సురేఖ ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో రెండు కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. తొలుత ముస్కాన్ కిరార్, రాజ్ కౌర్‌లతో కలిసి జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో కాంస్యం దక్కించుకోగా... ఆ తర్వాత వ్యక్తిగత విభాగంలో మరో కాంస్యం గెల్చుకుంది. కాంస్య పతక పోరులో జ్యోతి సురేఖ, ముస్కాన్, రాజ్ కౌర్ బృందం 229-226తో యెసిమ్ బోస్టాన్, గిజెమ్ ఎల్మాగ్లి, ఇపెక్ టామ్‌రుక్‌లతో కూడిన టర్కీ జట్టుపై గెలిచింది. భారత జట్టు విజయంలో జ్యోతి సురేఖ కీలకపాత్ర పోషించింది. ఆమె సంధించిన ఎనిమిది బాణాల్లో ఆరు '10' షాట్‌లు ఉండటం విశేషం. యెసిమ్ బోస్టాన్ (టర్కీ)తో జరిగిన వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో జ్యోతి సురేఖ 'షూట్ ఆఫ్'లో పైచేయి సాధించింది. నిర్ణీత 15 బాణాల తర్వాత ఇద్దరూ 145-145 పాయింట్లతో సమంగా నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు ఇద్దరికీ ఒక్కో బాణం అవకాశం ఇచ్చారు. ఇందులో జ్యోతి సురేఖ గురికి 10 పాయింట్లు రాగా... యెసిమ్ బాణానికి తొమ్మిది పాయింట్లే వచ్చాయి. నేడు పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో తరుణ్‌దీప్ రాయ్, రమేశ్ ప్రవీణ్ జాదవ్, అతాను దాస్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణం కోసం తలపడనుంది. చైనా జట్టుతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

**24** *తన ఎనిమిదేళ్ల కెరీర్‌లో జ్యోతి సురేఖ సాధించిన అంతర్జాతీయ పతకాల సంఖ్య. ఇందులో మూడు స్వర్ణాలు, 11 రజతాలు, 10 కాంస్యాలు ఉన్నాయి.*

*'రెండేళ్ల క్రితం టీమ్ విభాగంలో మేం రజత పతకం సాధించాం. ఈసారి కాంస్యం దక్కినా ఎలాంటి నిరాశ లేదు. ఎందుకంటే వరుసగా రెండో ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ టాప్-3లో నిలిచాం. ఈ పతకం మా అందరికీ ఎంతో ప్రత్యేకం. ఇక వ్యక్తిగత విభాగంలో నాకిది తొలి ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం. ఒకదశలో కొంచెం నెర్వస్‌గా ఫీలయ్యాను. కానీ నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని ప్రయత్నించాను. నా ప్రత్యర్థి నుంచి కూడా గట్టిపోటీ ఎదురుకావడంతో కాస్త ఒత్తిడికి లోనయ్యాను. షూట్ ఆఫ్‌లో మాత్రం కంగారు పడకుండా గురి చూసి కొట్టాను. "* -జ్యోతి సురేఖ


తాహిర్

# దక్షిణాఫ్రికా బోణీ

**అఫ్గానిస్తాన్‌పై 9 వికెట్లతో విజయం ● తాహిర్ మాయాజాలం**

**కార్డిఫ్:** ఎట్టకేలకు ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా గెలుపు బోణీ కొట్టింది. శనివారం అఫ్గానిస్తాన్‌తో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో సఫారీ జట్టు 9 వికెట్లతో జయభేరి మోగించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ జట్టు 20 ఓవర్లకు 69/2 స్కోరుతో ఉండగా వర్షం గంటపాటు అంతరాయం కలిగించింది. అంతకుముందూ 25 నిమిషాలు ఆటకు ఆటంకం ఏర్పడింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధనల ప్రకారం మ్యాచ్‌ను 48 ఓవర్లకు కుదించారు. అయితే, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇమ్రాన్ తాహిర్ (4/29), క్రిస్ మోరిస్ (3/13) ధాటికి అఫ్గాన్లు 34.1 ఓవర్లలో 125 పరుగులకే ఆలౌటయ్యారు. రషీద్ ఖాన్ (25 బంతుల్లో 35; 6 ఫోర్లు) టాప్ స్కోరర్. ఓపెనర్లు హజ్రతుల్లా జజాయ్ (22; 3 ఫోర్లు), నూర్ అలీ జద్రాన్ (32; 4 ఫోర్లు) మినహా మిగతా బ్యాట్స్‌మెన్ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 48 ఓవర్లలో 127గా సవరించారు. సఫారీలు 28.4 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 131 పరుగులు చేసి విజయానందాన్ని పొందారు. ఓపెనర్లు క్వింటన్ డికాక్ (72 బంతుల్లో 68; 8 ఫోర్లు), హషీమ్ ఆమ్లా (83 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు) శతక భాగస్వామ్యం అందించారు. డికాక్ ఔటయ్యాక వన్‌డౌన్‌లో వచ్చిన ఫెలూక్వాయో (17 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, సిక్స్) సిక్స్‌తో లాంఛనం ముగించాడు.

# ఆసియా చెస్ బ్లిట్జ్ చాంపియన్ నిహాల్



**జింగ్‌తాయ్ (చైనా):** భారత యువ గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ ఆసియా చెస్ చాంపియన్‌షిప్‌లో బ్లిట్జ్ విభాగంలో టైటిల్ సాధించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నమెంట్‌లో నిహాల్ ఎనిమిది పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 14 ఏళ్ల నిహాల్ ఏడు గేముల్లో గెలిచి, రెండింటిని 'డ్రా' చేసుకున్నాడు. భారత్‌కే చెందిన ఎస్.ఎల్.నారాయణన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకోగా... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఎరిగైసి అర్జున్ 6.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాడు. మరోవైపు క్లాసిక్ విభాగం ఓపెన్ కేటగిరీలో భారత గ్రాండ్ మాస్టర్స్ కార్తికేయ మురళి, సేతురామన్ వరుసగా రజత, కాంస్య పతకాలు గెలిచారు. కార్తికేయ, సేతురామన్‌తోపాటు నారాయణన్ కూడా వరల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌కు అర్హత పొందారు.

# అజేయ భారత్

- ఎఫ్‌ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ టోర్నీ టైటిల్ సొంతం
- తుది పోరులో దక్షిణాఫ్రికాపై 5-1తో ఘనవిజయం




**భువనేశ్వర్:** సొంతగడ్డపై సంపూర్ణ ఆధిపత్యాన్ని చలాయించిన భారత పురుషుల హాకీ జట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్లో మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 5-1 గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (11వ, 25వ నిమిషాల్లో), వరుణ్ కుమార్ (2వ, 49వ నిమిషాల్లో) రెండేసి గోల్స్ సాధించగా... వివేక్ ప్రసాద్ (35వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. దక్షిణాఫ్రికా తరఫున రిచర్డ్ పొట్జ్ (53వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. తుది ఫలితంతో సంబంధం భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో జరిగే టోక్యో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జపాన్ 4-2తో అమెరికాను ఓడించింది.

**అదే జోరు...**

లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్... సెమీఫైనల్లో ఆసియా క్రీడల చాంపియన్ జపాన్‌ను చిత్తుగా ఓడించింది. అదే జోరును ఫైనల్లోనూ కనబరిచింది. ఆట మొదలైన రెండో నిమిషంలోనే వరుణ్ కుమార్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి భారత్ ఖాతా తెరిచాడు. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను, పెనాల్టీ స్ట్రోక్‌ను లక్ష్యానికి చేర్చడంతో భారత ఆధిక్యం 3-0కి పెరిగింది. ఆ తర్వాత భారత్ అదే దూకుడు కొనసాగించగా... దక్షిణాఫ్రికా డీలా పడింది. ఈ టోర్నమెంట్ మొత్తంలో భారత్ 35 గోల్స్ సాధించి, కేవలం నాలుగు గోల్స్ మాత్రమే సమర్పించుకుంది.



# అమ్మాయిలు శుభారంభం

- తొలి మ్యాచ్‌లో ఉరుగ్వేపై 4-1తో విజయం
- ఎఫ్‌ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ టోర్నీ

**హిరోషిమా:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) మహిళల సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో టైటిల్ ఫేవరెట్ భారత్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో ఉరుగ్వే జట్టును ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ రాణి రాంపాల్ (10వ నిమిషంలో), గుర్జీత్ కౌర్ (21వ నిమిషంలో), జ్యోతి (40వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (56వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఉరుగ్వే జట్టుకు వియానా తెరీసా (51వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో పోలాండ్‌తో భారత్ ఆడుతుంది. రెండేళ్ల తర్వాత ఉరుగ్వేతో మ్యాచ్ ఆడిన భారత్ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. మరోవైపు మొదటి క్వార్టర్‌లో ఉరుగ్వే జట్టు చురుగ్గా ఆడుతూ గోల్స్ చేసే అవకాశాలను సృష్టించినా భారత డిఫెన్స్ వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. మూడో క్వార్టర్‌లో ఇరు జట్లు పలుమార్లు గురి తప్పాయి. ముఖ్యంగా ఉరుగ్వే రెండు పెనాల్టీ కార్నర్‌లను జారవిడచగా, భారత్ ఒక పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంలో విఫలమైంది. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో చిలీ 7-0తో మెక్సికోపై, జపాన్ 2-1తో రష్యాపై, పోలాండ్ 6-1తో ఫిజీపై విజయం సాధించాయి.

